
ఇతర రాష్ట్రాలు, ప్రపంచ దేశాల ముఖ్యమైన పరిణామాలు
సామాజిక, ఆర్థిక, రాజకీయ పుస్తక సమీక్షలు
ప్రతి ఆదివారం 'వార్త' మెయిన్‌లో ఒక పూర్తి పేజీ



epaper.vaartha.com WWW.VAARTHA.COM

తెలుగు జాతీయ దినపత్రిక

# వార్త

కడప

fb.com/vaartha Digital

Published from Kadapa, Vijayawada, Hyderabad, Visakhapatnam, Rajahmundry, Guntur, Nizamabad, Ongole, Warangal, Tirupathi, Kurnool, Anantapur, Karimnagar, Mahabubnagar, Khammam, Nellore, Nalgonda, Tadepalligudem, Srikakulam

20-9-2025 శనివారం సంపుటి: 31 సంచిక: 230 పేజీలు: 10+4 వెల: 6.50


అఫ్ఘాన్‌లోని ఎయిర్‌బేస్‌ను మళ్లీ తీసుకుంటాం: ట్రంప్

లలిత్‌మోడీ సోదరుడు సమీర్ మోడీ అరెస్టు

5లో





## ప్లాస్టిక్ భూతాన్ని తరిమేయండి

### అది మీ వల్లే సాధ్యం: డి.సిఎం పవన్‌తో డి. స్పీకర్ రఘురామకృష్ణరాజు

**విజయవాడ,సెప్టెంబరు19,ప్రభాతవార్తప్రతినిధి:** ఆంధ్రప్రదేశ్ అసెంబ్లీ సమావేశాల్లో నేడు ఆసక్తికరమైన సంభాషణ చోటుచేసుకుంది. ప్లాస్టిక్ నిషేధంపై శాసనసభ డిప్యూటీ స్పీకర్ రఘురామ కృష్ణరాజు, డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ ఉద్దేశిస్తూ వ్యాఖ్యలు చేశారు. ఆయన ప్లాస్టిక్ వాడకానికి వ్యతిరేకంగా ప్రచారం చేయాలని డిప్యూటీ స్పీకర్ డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్‌ను కోరారు. ఈ సందర్భంగా రఘురామ కృష్ణరాజు మాట్లాడుతూ ఇటీవల ప్లాస్టిక్‌పై కేరళ ప్రభుత్వం ఓ పాలసీని తీసుకొచ్చింది. ఆ పాలసీతో ప్లాస్టిక్‌ను నిషేధించడానికి మార్గం సుగమమైంది. ఏపీలో లిక్కర్ వినియోగం ఏ రేంజ్‌లో ఉందో మన ఆదాయం చూస్తేనే తెలుస్తుందన్నారు. లిక్కర్ బాటిల్స్ అన్ని ప్లాస్టిక్ బాటిల్స్ కావడం వల్ల ప్లాస్టిక్ పొల్యూషన్ మరింత పెరిగిపోయే ప్రమాదం పొంచి ఉందని ఆయన ఆందోళన వ్యక్తం చేశారు. కేరళలో ఓజిల్లాలో లిక్కర్ బాటిల్ మీద అదనంగా రూ.10 వసూలు చేస్తున్నట్లు తెలిపారు. వినియోగదారుడు ఆ ఖాళీ బాటిల్ ను తిరిగి ఇచ్చిన వెంటనే అదనంగా వసూలు చేసిన రూ.10ని తిరిగి ఇచ్చేస్తున్నారని తెలిపారు. దీంతో ప్లాస్టిక్ రీసైకిల్ చేసే అవకాశం ఉందన్నారు. బ్రాందీ బాటిల్స్‌కి ప్లాస్టిక్ వినియోగం ఎక్కువగా ఉంది. ఎక్కడ పడితే అక్కడ పడేస్తున్నారు. ఏపీలో కూడా కేరళ మాదిరిగా పాలసీ తీసుకొస్తే ప్లాస్టిక్ బాటిల్స్ అన్నీ ఒక దగ్గర కలెక్ట్ చేయొచ్చన్నారు. ఎక్సైజ్‌డిపార్టుమెంట్ వాళ్ళతో కోఆర్డినేట్ చేసుకుంటే మేజర్ పర్సెంటేజ్ ఆఫ్ ప్లాస్టిక్ వేస్ట్‌ను అరికట్టొచ్చన్నారు. ఈ సింగిల్ యూస్ ప్లాస్టిక్స్ నిషేధానికి మీలాంటి హీరోస్ తోటి అడ్వర్టైజ్‌మెంట్ చేయాలి అంటే కొన్ని కోట్లు అవు తుంది. మీరు సంబంధితశాఖ మంత్రిగా ప్లాస్టిక్‌ని నిషేధించండి అని మీరు జన

>>2

## అన్ని నదులను అనుసంధానిస్తా



### ●రాష్ట్రంలో కరవు మాట రానివ్వను..●పోలవరం ఎడమకాలువకు రూ.960కోట్లతో టెండర్లు ●పట్టిసీమ ద్వారా కృష్ణా డెల్టాకు 439 టిఎంసిలు తరలించాం ●అసెంబ్లీలో చేసిన పిపిపిలో సిఎం చంద్రబాబు

**విజయవాడ,సెప్టెంబరు 19,ప్రభాతవార్తప్రతినిధి:**నదుల అనుసంధానం ద్వారానే నీటి కొరత లేకుండా ఉండి, వ్యవసాయానికి లాభం కలుగుతుందని నమ్మే వ్యక్తిని తానని ఏపీ సీఎం చంద్రబాబు నాయుడు స్పష్టం చేసారు. ఇప్పటికే గోదావరి, కృష్ణాని అనుసంధానం చేసామన్నారు. రాష్ట్రంలో ఉన్న అన్ని నదులని అనుసంధానం చేస్తామని హామీ ఇస్తున్నా. రాష్ట్రంలో నీటి సమర్ధ నిర్వహణ అంశంపై అసెంబ్లీలో జరిగిన చర్చలో ప్రసంగించిన సీఎం చంద్రబాబు నాయుడు ప్రసంగిస్తూ రాయలసీమ ప్రాంతంలో వేరుశనగ విత్తనాలు వేస్తే ఖర్చు కూడా రాని పరిస్థితి ఉండేది. నష్టపోయిన రైతులకు ఇన్ పుట్ సబ్సిడీ ఇచ్చి ఆదుకున్నామన్నారు. ఉమ్మడి రాష్ట్రంలో పాలమూరు, నల్గొండ జిల్లాల్లోనూ తీవ్రమైన నీటి కొరత ఉండేదన్నారు. శ్రీశైలం లెఫ్ట్ మెయిన్ కెనాల్ ద్వారా ఎత్తిపోతల ఏర్పాటు చేసి నీళ్లు ఇచ్చామన్నారు. దేశంలో నదుల అనుసంధానం చేస్తే అందరికీ ప్రయోజనం కలుగుతుందని చెబితే సురేశ్ ప్రభు నేతృత్వంలో టాస్క్ ఫోర్సు ఏర్పాటు చేశారన్నారు. ప్రస్తుతం రాష్ట్రాల్లో ఇంట్రా లింకింగ్ ఆఫ్ రివర్స్ చేపడతారు. ఆ తర్వాత గంగా కావేరిని అనుసంధానించే ప్రక్రియ చేపడతారు. అందుకే దేశంలో తొలిసారిగా నదుల అనుసంధానాన్ని చేపట్టిన రాష్ట్రం ఆంధ్రప్రదేశ్ అన్నారు. ఏపీలో 1.06 కోట్ల ఎకరాలకు నీటిని అందిస్తున్నాం. కూటమి అధికారంలోకి వచ్చాక రూ. 12 వేల కోట్లు ఖర్చు పెట్టాం. మొత్తం ఐదేళ్లలో రూ. 60 వేల కోట్లను జలవనరుల శాఖకు ఖర్చు చేస్తాం. 94 శాతం రిజర్వాయర్లలో నీళ్ల నింపిన జలవనరుల శాఖకు అభినందనలు. 1040 టీఎంసీల నీళ్లు ప్రస్తుతం నిల్వ ఉన్నాయి. తుంగభద్ర లాంటి ప్రాజెక్టుల్లో గేట్లు కొట్టుకు పోయాయి. వాటర్ యూజర్స్ కమిటీలకు కూడా కూటమి అధికారంలోకి వచ్చాకే ఎన్నికలు నిర్వహించి ప్రతినిధుల్ని నియమించాం. రాష్ట్రంలో భూగర్భ జలాలను కూడా పెంచడానికి చర్యలు చేపట్టాం. ఈసారి 2.1 శాతం వర్షపాతం తక్కువగా పడింది. గతంతో పోలిస్తే 1.5 మీటర్ల మేర భూగర్భ జలాలు పెరిగాయి. ప్రస్తుతం 8.43 మీటర్ల మేర భూగర్భజలాలు ఉన్నాయి. 697 టీఎంసీల నీరు ప్రస్తుతం అందుబాటులో ఉన్నాయి. గత ఏడాదితో పోలిస్తే నిల్వలు పెరిగాయి. భూమినే జలాశయంగా మార్చుకోవాలి. సమర్ధ నీటి నిర్వహణ ద్వారా గ్రామీణ ప్రాంతాల్లో ఉన్న చెరువులను నింపడం, భూగర్భజలాలను రీఛార్జి చేసుకోవాలి. గతంలో కొండలు, అటవీ ప్రాంతాల్లో ట్రెంచ్ లు తవ్వించాం. ఫాం పాండ్స్ ఏర్పాటు చేసుకోవటం లాంటి ప్రక్రియలు చేపట్టాలి. నీటిని సమర్ధవంతంగా మేనేజ్ చేసుకుంటే కరవు అనే మాట రాష్ట్రంలో ఉండదు. ఏపీని కరవు రహిత రాష్ట్రంగా తయారు చేసే బాధ్యత కూటమి తీసుకుంటుంది. రాష్ట్ర విభజన తర్వాత పోలవరం ప్రాజెక్టును జాతీయ ప్రాజెక్టుగా ప్రకటించారు. జూన్ 2 తేదీ కంటే ముందే 7ముంపు మండలాలను కలపాలని ప్రధానిని కోరాను. పార్లమెంటు సమావేశాని కంటే ముందు ముంపు మండలాలు కలుపుతూ ఆర్డినెన్సును తెచ్చాం. ఆ నిర్ణయంతోనే పోలవరం ప్రాజెక్టు ముందుకు వెళ్లింది. భూసేకరణ, కాంట్రాక్టుల వివాదాలు, కుడి కాలువ లాంటి సమస్యలను దాటుకుని 2019 నాటికి 72 శాతం ప్రాజెక్టు నిర్మాణం పూర్తిచేశాం. స్పిల్ వే, స్పిల్ ఛానల్, గేట్లు, కాఫర్ డ్యామ్ పనులు, కుడి కాలువ పనులు వందశాతం పూర్తి చేశాం. 2019-24 మధ్య పోలవరం ప్రాజెక్టులో చేసిన

>>2

## అభ్యర్థుల జీవితాలతో ఆడుకొంటున్న ఎపిపిఎస్సీ: హైకోర్టు ఆగ్రహం



**విజయవాడ,సెప్టెంబరు 19,ప్రభాతవార్తప్రతినిధి:**ఏపీపీఎస్సీ గ్రూప్1 ప్రధాన పరీక్ష జవాబుపత్రాల మాన్యువల్ మూల్యాకనంలో అక్రమాలు చోటు చేసుకున్నాయన్న కారణంతో పరీక్షను రద్దు చేసి, తాజాగా నిర్వహించాలని హైకోర్టు సింగిల్ జడ్జి 2024మార్చి 13న కీలక తీర్పు ఇచ్చింది. ఈ తీర్పును సవాలు చేస్తూ ఏపీపీఎస్సీ, ఉద్యోగాలు పొందిన వారు ధర్మాసనం ముందు అప్పీళ్లు వేశారు. అప్పీళ్లపై హైకోర్టు విచారణ జరిపింది. మంగళగిరిలోని హాయ్‌ల్యాండ్ రిసార్ట్స్‌లో గ్రూప్1 ప్రధాన పరీక్ష జవాబు పత్రాలను మూల్యాంకనం చేయకపోతే 65 రోజులు అక్కడ ఏమి చేశారని ఏపీపీఎస్సీని హైకోర్టు సూటిగా ప్రశ్నించింది. హాయ్‌ల్యాండ్‌లో మూల్యాంకనం జరగకపోతే త్వరలో ఫలితాలు ప్రకటిస్తామని ఏపీపీఎస్సీ అప్పటి కార్యదర్శి పీఎస్సార్ ఆంజనేయులు ఎందుకు మీడియాకు తెలిపారని ప్రశ్నించింది. ఫిర్యాదు చేయడానికి యేడాది సమయం ఎందుకు తీసుకున్నారని ప్రశ్నలు సంధించింది. వేలమంది అభ్యర్థుల జీవితాలతో ఏపీపీఎస్సీ ఆడుకుంటోందని ఘాటుగా వ్యాఖ్యానించింది. గ్రూప్1 నోటిఫికేషన్(27/2018) ప్రధాన పరీక్షను రద్దు చేస్తూ సింగిల్ జడ్జి ఇచ్చిన తీర్పును సవాలు చేస్తూ ఏపీపీఎస్సీ, ఉద్యోగాలకు ఎంపికైన అభ్యర్థులు దాఖలు చేసిన అప్పీళ్లపై హైకోర్టులో తుది విచారణ ప్రారంభమైంది. హైకోర్టు న్యాయమూర్తులు జస్టిస్ బట్టుదేవానంద్, జస్టిస్ హరిహరనాథశర్మతో కూడిన ధర్మాసనం ఈమేరకు ఉత్తర్వులిచ్చింది.

## 22 నుంచి దసరా సెలవులు

**విజయవాడ,సెప్టెంబరు 19,ప్రభాతవార్తప్రతినిధి:** ఎపిలో పాఠశాలలకు ఈ నెల 22 నుండి అక్టోబర్ 2 వరకు దసరా సెలవులు ఇస్తున్నట్లు మంత్రి నారా లోకేష్ ప్రకటించారు. ఈ నెల 22 నుండి దసరా సెలవులు ఇవ్వాలని ఉపాధ్యాయులు కోరానన్నారు. ఈ క్రమంలో విద్యా అధికారులతో చర్చించి ఈ నిర్ణయం తీసుకున్నట్లు ఎక్స్‌లో పోస్ట్ చేశారు. మంత్రి తెలిపినట్లుగానే ఆంధ్రప్రదేశ్‌లో ఈనెల 22 సోమవారం నుంచి అక్టోబర్ 2గురువారం వరకు పాఠశాలలకు దసరా సెలవులు ఇస్తున్నట్లు ప్రభుత్వం ప్రకటించింది. ఈ నిర్ణయాన్ని అధికారికంగా విద్యాశాఖ తెలియజేసింది. ఉపాధ్యాయుల కోరిక మేరకే ఈ నిర్ణయం తీసుకున్నామని విద్యాశాఖ మంత్రి లోకేశ్ తెలిపారు. "పాఠశాలలకు దసరా సెలవులు 22 నుంచి ఇవ్వాలని ఉపాధ్యాయులు కోరారు. టీడీపీ గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీలు ఈ విషయాన్ని నా దృష్టికి తీసుకువచ్చారు. వారి అభ్యర్థనను పరిశీలించి, విద్యాశాఖ అధికారులతో చర్చించి ఈ నిర్ణయం తీసుకున్నాం" అని లోకేశ్ వెల్లడించారు.

## ఉల్లి రైతులకు శుభవార్త



### హెక్టారుకు 50 వేలు ఇవ్వాలని సిఎం చంద్రబాబు నిర్ణయం

**విజయవాడ సెప్టెంబరు 19,ప్రభాతవార్తప్రతినిధి:** రాష్ట్రంలో ఉల్లి ధరలు పతనం కావడంతో రైతులు ఇబ్బందులు పడుతున్నారని గ్రహించిన సీఎం చంద్రబాబు కీలక నిర్ణయం తీసుకున్నారని వ్యవసాయ శాఖ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు తెలిపారు. శుక్రవారం సీఎం క్యాంప్ ఆఫీస్ వద్ద మీడియా తో మాట్లాడుతూ ఉల్లి పంట పండించిన రైతులకు హెక్టారుకు రూ.50,000 ఆర్థిక సాయం అందజేయాలని సీఎం చంద్రబాబు నిర్ణయం తీసుకున్నారని మంత్రి అచ్చెన్నాయుడు తెలిపారు. ఈ నిర్ణయంతో ప్రభుత్వంపై సుమారు రూ.100 కోట్లు అదనపు భారం పడనుందని అన్నారు. కర్నూలు ఖరీఫ్ సీజన్ లో 45,278 ఎకరాల్లో ఉల్లి పంట సాగు చేసారని, 24, 218 మంది రైతులు లబ్ధిపొందుతున్నట్లు మంత్రి అచ్చెన్నాయుడు తెలిపారు. రైతుల ప్రయోజనాలను దృష్టిలో ఉంచుకుని తీసుకున్న ఈ చర్యకు రాష్ట్రవ్యాప్తంగా రైతులు స్వాగతం పలుకుతున్నారని పేర్కొన్నారు. పంటకు ధర పలికినప్పుడే ఉల్లిని విక్రయించాలని రైతులకు మంత్రి సూచించారు. మార్కెట్లో సమయానుసారం ధరలు లభించే వరకు రైతులు సహనంతో ఉండాలని ఆయన పిలుపునిచ్చారు. ఈ ఆర్థిక సాయం రైతులకి తక్షణ ఉపశమనం లభిస్తుందన్నారు. 2016లో ఉల్లి ధరలు పడిపోతే 7723 మంది రైతులనుండి 2.77 లక్షల క్వింటాళ్ళు కొనుగోలు చేసి 7 కోట్ల రూపాయలు రైతులకు

>>2

## 474 పార్టీలపై ఇసి వేటు




### రెండు దశల్లో 808 పార్టీల గుర్తింపు రద్దు
### మరో 359 పార్టీల స్క్రూటినీ

**న్యూఢిల్లీ, సెప్టెంబరు 19:** గుర్తింపు లేని నమోదిత రాజకీయ పార్టీలపై కేంద్ర ఎన్నికల సంఘం కొరఢా ఝులిపించింది. గత ఆరు సంవత్సరాలలో ఒక్క ఎన్నికల్లో కూడా పోటీ చేయని, నిబంధనలు ఉల్లంఘించిన 474 గుర్తింపు పొందిన రాజకీయ పార్టీలను జాబితా నుంచి తొలగించింది. రాజకీయ పార్టీలు ప్రజాప్రాతినిధ్య చట్టం 1951లోని సెక్షన్ 29ఏ ప్రకారం, నిబంధనలు ఉల్లంఘించిన పార్టీలపై వేటు వేసినట్లు ఈసీ పేర్కొంది. ఈ ఏడాది ఇప్పటి వరకు 808 రాజకీయ పార్టీలను జాబితా నుంచి తొలగించింది. తొలి దశలో ఆగస్టు 9న 334 పార్టీలను రద్దు చేయగా, తాజాగా సెప్టెంబర్ 18న 474 గుర్తింపులేని నమోదిత రాజకీయ పార్టీలను జాబితా నుంచి తొలగించామని ఈసీ ఒక ప్రకటనలో తెలిపింది. రెండో దశలో తొలగించిన 474 రాజకీయ పార్టీలలో అత్యధిక ఉత్తర్ ప్రదేశ్‌లోనివే. ఏకంగా 121 పార్టీలను జాబితా నుంచి ఈసీ తొలగించింది. ఆ తర్వాత మహారాష్ట్ర 44, తమిళనాడు 42, ఢిల్లీ 40, మధ్యప్రదేశ్ 23, పంజాబ్ 21, ఆంధ్రప్రదేశ్ 17, రాజస్థాన్ 17రాజకీయ పార్టీలున్నాయి. మొత్తంగా 30 రాష్ట్రాలు, కేంద్ర పాలిత ప్రాంతాలలోని 474 పార్టీలను జాబితా నుంచి తొలగించినట్లు ఈసీ వివరించింది. ఇప్పటివరకు 2520 గుర్తింపులేని నమోదిత రాజకీయ పార్టీ

>>2


## మైక్ ఇస్తే సభకొస్తా

### ప్రజాసమస్యలపై మాట్లాడేందుకు సమయం ఇవ్వకపోతే ఎలా?
### ప్రతిపక్షహోదా కంటే అదేముఖ్యం..
### పార్టీ ఎమ్మెల్యేలతో జగన్



**విజయవాడ,సెప్టెంబరు19,ప్రభాతవార్తప్రతినిధి:** 'ఎంఎల్ఏలందరితో పాటు మీకు సమయమిస్తాం అని వాళ్ళు అంటున్నారు. ఒక ఎంఎల్ఏకి ఇచ్చినట్లుగా కొన్ని నిముషాల సమయమే ఇస్తే ఏం మాట్లాడగలను, ప్రజాసమస్యలను సవివరంగా చెప్పగలరా?అని వైకాపా అధ్యక్షుడు, మాజీ ముఖ్యమంత్రి జగన్ వ్యాఖ్యానించారు. సభకు రండి, మాట్లాడేందుకు సమయమిస్తా అని స్పీకర్ అంటున్నారు కదా అని తమ పార్టీ ఎంఎల్ఏ ఒకరు అనడంతో జగన్ స్పందించారు. 'నువ్వు ఇంకా మనోళ్ళెవరికైనా వస్తే అందరూ వెళ్ళి స్పీకర్‌ను కలిసి అడగండి. తగిన సమయమిస్తానని హామీ ఇస్తే మనకు ప్రతిపక్ష హోదా ఇవ్వకపోయినా సరే రేపే సభకొస్తా'అని పేర్కొన్నారు. తన కార్యంపు కార్యాలయంలో నిర్వహించిన వైకాపా శాసనసభాపక్ష సమావేశంలో జగన్ ఈ ఆసక్తికర వ్యాఖ్యలు చేశారు. విశ్వసనీయ సమాచారం మేరకు చెప్పేది వేరు...చేసేది వేరు..'సభకు వస్తే మాట్లాడే అవకాశమిస్తామని వాళ్ళు చెబుతారు. కానీ చేసేది వేరే ఉంటుంది. రెండు మూడు అంశాలపై మొన్న నేను ప్రెస్‌మీట్ పెట్టి ప్రజెంటేషన ఇస్తే గంటపైనే పట్టింది. అలా ప్రజా సమస్యలపై సభలో వివరించేందుకు సమయమిస్తారా?ఎంఎల్ఏకిచ్చినట్లు సమయమిస్తామంటే వచ్చి మాత్రం ఏం చేయ గలం ?వాళ్ళు పూర్తి స్థాయిలో సమయమివ్వరు. అందుకే సభకు వెళ్ళకుండా ఇక్కడ ప్రెస్‌మీట్‌లో ప్రభుత్వాన్ని ఎండగట్టాలని నిర్ణయించాం. ప్రతిపక్ష హోదా ఇవ్వకపోవడంపై

>>2



సిఎం చంద్రబాబు నాయుడు సమక్షంలో టిడిపిలో చేరిన ఎంఎల్‌సీలు

### వైఎస్సార్సీ నుంచి ముగ్గురు ఎమ్మెల్సీలు

## టిడిపిలోకి

### సిఎం చంద్రబాబు సమక్షంలో చేరిక

**విజయవాడ,సెప్టెంబరు19,ప్రభాతవార్తప్రతినిధి:** ముగ్గురు వైసీపీ ఎమ్మెల్సీలు టీడీపీలో చేరారు. సీఎం చంద్రబాబు సమక్షంలో బల్లి కల్యాణ చక్రవర్తి, కర్రి పద్మశ్రీ, మర్రి రాజశేఖర్ టీడీపీ కండువా కప్పుకున్నారు. ఇప్పటికే ఈ ముగ్గురు వైసీపీకి, ఎమ్మెల్సీ పదవులకు రాజీనామా చేసిన సంగతి తెలిసిందే. ఉండవల్లి సీఎం క్యాంపు కార్యాలయంలో ముఖ్యమంత్రి చంద్రబాబు సమక్షంలో ఈ చేరికల కార్యక్రమం జరిగింది. వారికి పసుపు కండువాలు కప్పి సాదరంగా పార్టీలోకి ఆహ్వానించారు చంద్రబాబు. తాము 6 నెలల క్రితమే ఎమ్మెల్సీ పదవులకు రాజీనామా చేసినప్పటికీ, వాటిని ఇప్పటివరకు ఆమోదించలేదని వారు తెలిపారు. తమ రాజీనామా ఆమోదిస్తారన్న నమ్మకం లేదని, అందుకే తాము టీడీపీలో చేరామని బల్లి కల్యాణ్ చక్రవర్తి, కర్రి పద్మశ్రీ, మర్రి రాజశేఖర్ చెప్పారు.

>>2

## రూ.15 వేల 'వాహన మిత్ర'కు గ్రీన్ సిగ్నల్

### కేబినెట్ సమావేశంలో కీలక నిర్ణయం

**విజయవాడ,సెప్టెంబరు 19,ప్రభాతవార్తప్రతినిధి:** నాలా ఫీజు రద్దు చట్ట సవరణకు ఆమోదం, వాహనమిత్ర కింద రూ.15 వేల సాయానికి కీలక నిర్ణంతో పాటు అసెంబ్లీలో ప్రవేశపెట్టే 13 బిల్లులకు ఏపీ మంత్రి మండలి సమావేశం ఆమోదముద్రవేసింది. భారీ ప్రాజెక్టుల కోసం స్పెషల్ పర్పస్ వెహికల్ ఏర్పాటు, ఏపీ జీఎస్టీ బిల్లు 2025 సవరణలకు ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం కీలక నిర్ణయాలు తీసుకుంది. ముఖ్యమంత్రి చంద్రబాబు అధ్యక్షతన శుక్రవారం అసెంబ్లీలోని ఆయన ఛాంబర్‌లో రాష్ట్ర మంత్రివర్గం సమావేశమైంది. ఈ భేటీలో ప్రజలకు లబ్ధి చేకూర్చే పలు ముఖ్యమైన ప్రతిపాదనలకు ఆమోదం తెలిపింది. వీటిలో ప్రధానంగా వ్యవసాయ భూములను వ్యవసాయేతర అవసరాలకు మార్చేటప్పుడు విధించే నాలా (వ్యవసాయేతర భూముల మదింపు) ఫీజును రద్దు చేసేందుకు ఉద్దేశించిన చట్ట సవరణకు కేబినెట్ గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది. ఈ సమావేశంలో తీసుకున్న ఇతర నిర్ణయాలను రాష్ట్ర హోంమంత్రి అనిత మీడియాకు వెల్లడించారు. వాహనమిత్ర పథకం కింద ఆటో, ట్యాక్సీ డ్రైవర్లకు ఏటా రూ.15 వేల ఆర్థిక సాయం అందించే ప్రతిపాదనకు మంత్రివర్గం ఆమోదముద్ర వేసిందని ఆమె తెలిపారు. దీంతో పాటు రాష్ట్రంలో భారీ ప్రాజెక్టుల వేగవంతమైన అమలు కోసం ఒక స్పెషల్ పర్పస్ వెహికల్ (ఎస్పీవీ) ఏర్పాటు చేయాలన్న నిర్ణయానికి కూడా కేబినెట్ అంగీకారం తెలిపిందన్నారు. అసెంబ్లీ సమావేశాల్లో ప్రవేశపెట్టేందుకు వీలుగా మొత్తం 13 బిల్లులకు మంత్రివర్గం ఆమోదం తెలిపిందని హోంమంత్రి వివరించారు.



శుక్రవారం జరిగిన కేబినెట్ సమావేశ దృశ్యం

>>2

## నేడు మాచర్లకు ముఖ్యమంత్రి

### 'స్వర్ణాంధ్ర స్వచ్ఛాంధ్ర'కు హాజరు

**గుంటూరు-ప్రభాతవార్త ప్రతినిధి, సెప్టెంబరు 19:** ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు శనివారం పల్నాడు జిల్లా మాచర్లలో పర్యటించనున్నారు. ప్రతీ నెలా మూడో శనివారం నిర్వహించే 'స్వర్ణాంధ్ర స్వచ్ఛాంధ్ర' కార్యక్రమంలో ఆయన పాల్గొనున్నారు. ఉదయం 10.30గంటలకు మాచర్లకు చేరుకోనున్న సీఎం స్థానికంగా ఉన్న చెరువు పరిసర ప్రాంతాల్లో స్వచ్ఛతా కార్యక్రమం చేపట్టనున్నారు. ఈ సందర్భంగా స్వచ్ఛతా కార్యక్రమంలో పాల్గొనే ప్రతినిధులు, పారిశుధ్య కార్మికులతో సీఎం సంభాషించనున్నారు. శానిటేషన్ వర్కర్లకోసం ఏర్పాటు చేసిన హెల్త్ క్యాంపును సందర్శించి, సఫాయి కర్మచారీలు, వైద్య సిబ్బందితో మాట్లాడనున్నారు. అనంతరం స్వచ్ఛరథాన్ని జెండా ఊపి ప్రారంభించనున్నారు. అనంతరం మాచర్లలోని ప్రజావేదిక వద్ద ఏర్పాటు చేసిన స్టాళ్లను సీఎం పరిశీలించనున్నారు. మాచర్ల మున్సిపాల్టీలోని స్వయం సహాయ సంఘాలకు చెందిన మహిళలకు రూ.2కోట్ల విలువైన మైక్రో క్రెడిట్‌చెక్కును అందించనున్నారు. అనంతరం ప్రజావేదిక నుంచి ప్రజలను ఉద్దేశించి సీఎం ప్రసంగించనున్నారు. అనంతరం బంగారు కుటుంబాలు,

>>2



సిఎఎకు వ్యతిరేకంగా శుక్రవారం న్యూఢిల్లీలో ప్రదర్శనలు జరిపిన జెఎన్‌యు విద్యార్థులు

# టిడిపిలోకి

>> కూటమి ప్రభుత్వం చేస్తున్న అభివృద్ధిలో భాగస్వాములు కావాలని టీడీపీలో చేరామని వారు వెల్లడించారు. నెల్లూరు జిల్లాకు చెందిన బల్లి కళ్యాణ చక్రవర్తి, గోదావరి జిల్లాలు చెందిన కర్రి పద్మశ్రీ, గుంటూరుకు చెందిన మర్రి రాజ శేఖర్ పార్టీ మారుతున్నారు. అసెంబ్లీ ఎన్నికల్లో వైసీపీ ఓటమి తర్వాత, పార్టీ అంతర్గత సమస్యలు, నాయకత్వంపై అసంతృప్తి కారణంగా టీడీపీలో చేరాలని నిర్ణయించారు. వీరు కొన్నాళ్ల కిందటే ఎమ్మెల్సీ పదవితో పాటు వైసీపీకి కూడా రాజీనామా చేశారు. కానీ మండలి ఛైర్మన్ మోషన్ రాజు వైఎస్ఆర్‌సీపీకి చెందిన ఎమ్మెల్సీనే. ఆయన రాజీనామాలను ఆమోదించడం లేదు. కైకలూరుకు చెందిన జయమంగళ వెంకటరమణ తన రాజీనామాను ఆమోదించడం లేదని కోర్టుకు కూడా వెళ్లారు. కోర్టు ఆలస్యం చేస్తున్నారని మండలి ఛైర్మన్‌కు రూ. పదివేల ఫైన్ కూడావేసింది. కానీ ఇంకా నిర్ణయం తీసుకోలేదు. బల్లి కళ్యాణచక్రవర్తి 2019లో తిరుపతి నుంచి వైసీపీ తరపున లోక్‌సభ కు ఎన్నికైన బల్లి దుర్గాప్రసాద్ కుమారుడు. ఎంపీగా ఉన్న ఆయన అనారోగ్యంతో మరణించారు. ఆయన కుమారుడు కళ్యాణచక్రవర్తి ఎంపీ టిక్కెట్ ఆశించినప్పటికీ జగన్ ఎమ్మెల్సీ హామీ ఇచ్చి గురుమూర్తికి టిక్కెట్ కేటాయించారు. తర్వాత కళ్యాణచక్రవర్తికి ఎమ్మెల్సీ ఇచ్చారు. మర్రి రాజశేఖర్ చిలుకలూరిపేట నేత. విడదల రజనీ కోసం ఆయన సీటు త్యాగం చేశారు. ఆయనకు మంత్రి పదవి ఇస్తామని జగన్ హామీ ఇచ్చారు. కానీ ఎలాంటి పదవి ఇవ్వకపోగా విడదల రజనీని మళ్లీ ఇంచార్జ్‌గా చేయడంతో సొంత పార్టీపై ఆగ్రహం వ్యక్తం చేశారు. చివరికి టీడీపీలో చేరాలని నిర్ణయించారు. ఇక కర్రి పద్మశ్రీ కూడా టీడీపీలో చేరనున్నారు.ఎన్నికలకు ముందు ఎమ్మెల్సీలు టీడీపీతో టచ్‌లో ఉన్నారని తెలియగానే మండలి ఛైర్మన్ రాత్రికి రాత్రి అనర్హతా వేటు వేస్తూ ఉత్తర్వులు జారీ చేసేవారు. అయితే ఇప్పుడు రాజీనామాలు సమర్పించి నెలలు గడుస్తున్నా నిర్ణయాలు మాత్రం తీసుకోవడం లేదు. ఇప్పుడు ఉన్న సంఖ్యాబలం ప్రకారం.. ఎవరు రాజీనామా చేసినా ఆ సీటు కూటమి ఖాతాలోనే పడుతుంది. అందుకే రాజీనామాలు ఆమోదించడం లేదన్న ప్రచారం జరుగుతోంది. వైసీపీకి రాజీనామా చేసిన వాళ్లు.. మళ్లీ తమ సీటు తమకే ఇస్తారన్న ఒప్పందంతోనే పార్టీలు మారుతున్నారన్న ప్రచారమూ జరుగుతోంది. ఇప్పటికే ఆరుగురు ఇలా రాజీనామాలు చేశారు. రాజీనామా చేసిన వారిలో శాసనమండలి డిప్యూటీ ఛైర్మన్ జకియా ఖానం కూడా ఉన్నారు.

చీరాలకు చెందిన ఎమ్మెల్సీ పోతుల సునీత బీజేపీలో చేరారు. కైకలూరుకు చెందిన మరోఎమ్మెల్సీ జయమంగళ వెంకటరమణ జనసేనపార్టీలో చేర తారన్న ప్రచారం జరుగుతోంది.

# మైక్ ఇస్తే సభకొస్తా

>> మనం కోర్టుకు వెళ్లాం. కోర్టు నుంచి వచ్చిన సమన్లకు స్పీకర్ సమాధానమివ్వడం లేదు' అని జగన్ చెప్పినట్లు సమాచారం.

**అప్పుడు అనర్హత వేటు పడిందా?:** 60 రోజులు సభకు రాకపోతే అనర్హత వేటు వేస్తామంటూ మాట్లాడుతున్నారు. చంద్రబాబు సభకు రాకపోతే ఆయనపై వేటుపడిందా?లేదు కదా? అయినా మనం ఉభయసభల ఉమ్మడి సమావేశంలో గవర్నర్ ప్రసంగ సమయంలో హాజరయ్యాం.ఏటా అలా వెళ్తునా ్నం.గవర్నర్ ఎదుట మన సమస్య ప్రస్తావించి,మనకు జరుగుతున్న అన్యాయాన్ని చెప్పి వస్తున్నాం.నేను సభకు వచ్చాననేందుకు గవర్నరే సాక్ష్యం'అని జగన్ పేర్కొన్నట్లు తెలిసింది.
పెద్దిరెడ్డితో పాటు ఎంఎల్‌ఏలు వెళితే వెళ్ళొచ్చు మీరు రాకపోయినా,కనీసం ఎంఎల్‌ఏలైనా అసెంబ్లీకి వస్తే బాగుంటుందని కొందరు ప్రస్తావించారు. ఎంఎల్‌ఏలను అసెంబ్లీకి వెళ్ళకండని నేను ఆపలేదు. పెద్దిరెడ్డన్నా నువ్వు పెద్దరికం తీసుకొని ఎంఎల్‌ఏలను అసెంబ్లీకి తీసుకువెళతావా?అన్న (పెద్దిరెడ్డి)తో పాటు ఎంఎల్‌ఏలు సభకు వెళ్ళాలనుకుంటే వెళ్ళొచ్చు' అని జగన్ వ్యాఖ్యానించినట్లు సమాచారం. అయితే సభకు వెళ్ళేందుకు పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి సుముఖత వ్యక్తం చేయలేదని తెలిసింది.

**మండలిలో మన బలాన్ని చూపాలి**

శాసనమండలిలో మనకు మంచి బలం ఉంది. రాజీపడకుండా మన ఎంఎల్‌సీలందరూ ప్రజల కోసం గట్టిగా పోరాడాలి.రాజకీయంగా ఎదిగేందుకు మీకు ఇది అవకాశం.ఎవరు ఎలా పని చేస్తున్నారో గమనిస్తుంటాం' అని ఎంఎల్‌సీలకు జగన్ చెప్పారు.

# ఉల్లి రైతులకు శుభవార్త

>> చెల్లించామని, 2018లో మరొక సారి 9740 మంది రైతుల నుండి 3.48 లక్షల క్వింటాళ్ళ ఉల్లి కొనుగోలు చేసి 6.45 కోట్లు చెల్లించామని తెలిపారు. జగన్ హయాంలో 2020 సంవత్సరంలో వైసీపీ ప్రభుత్వంలో ఉల్లి ధరలు పడిపోతే, నామ మాత్రంగా క్వింటాకి రూ.770/లు మద్దతు ధర ప్రకటించి, ఏ ఒక్కరి దగ్గరా ఉల్లి కొనుగోలు చేయకుండా, కేవలం 250 మంది రైతుల దగ్గర 75 లక్షలు ఇచ్చి ఉల్లిని కొని రైతులని నిండా ముంచారని మండిపడ్డారు. రైతుల అభివృద్ధి కోసం కూటమి ప్రభుత్వం కట్టుబడి ఉందని మంత్రి స్పష్టం చేశారు. రైతుల సంక్షేమం, వ్యవసాయ రంగ అభివృద్ధి తమ ప్రభుత్వానికి ప్రాధాన్యతమని ఆయన అన్నారు. రైతుల శ్రమకు గౌరవం కల్పించేందుకు, వారికి న్యాయమైన ధరలు లభించేలా కూటమి ప్రభుత్వం కృషి చేస్తుందన్నారు. వర్షాభావం, ప్రకృతి వైపరీత్యాల సమయంలో రైతులకు భరోసా కల్పించే విధంగా పంటలకు కొనుగోలు ధరలు తగ్గితే ప్రభుత్వమే కొనుగోలు చేస్తూ రైతులకు అండగా నిలబడుతుందన్నారు. కూటమి ప్రభుత్వం రైతుల పక్షాన నిలిచి, వారిని ఆర్థికంగా బలపరిచే విధంగా పలు సంస్కరణలు, సంక్షేమ కార్యక్రమాలు తీసుకొస్తోందని అన్నారు. కేవలం మాటలకే పరిమితమైపోయిన గత ప్రభుత్వం మాదిరి కాకుండా, మా ప్రభుత్వం రైతులకు సాక్షా త్కారమైన లాభాలను అందజేస్తుందని అన్నారు. రైతుల సమస్యలను పరిష్కరించడం తమ ప్రభుత్వ ధ్యేయమని, భవిష్యత్తులో కూడా మరింతబలమైన విధానాలతో వ్యవసాయ రంగాన్ని అభివృద్ధి చేస్తామనిమంత్రి హామీ ఇచ్చారు.


యుకె కింగ్ ఛార్లెస్ బహుమతిగా పంపిన మొక్కను
శుక్రవారం న్యూఢిల్లీలోని తన నివాసంలో నాటి నీరుపోస్తున్న ప్రధాని మోడీ

## అసోంరైఫిల్స్ బలగాల ట్రక్కుపై సాయుధ దుండగుల దాడి
## ఇద్దరు జవాన్లు మృతి, మరో ఐదుగురికి గాయాలు

**ఇంపాల్, సెప్టెంబరు 19:** మణిపూర్‌లో అస్సాం రైఫిల్స్ ట్రక్‌పై ఆగంతకులు దాడిచేయడంతో ఇద్దరు జవాన్లు మృతిచెందారు. మరో ఐదుగురు తీవ్ర గాయాలకు లోనయ్యారు. గుర్తుతెలియని సాయుధ దుండగులు పారామిలిటరీ ఫోర్స్ 407 టాటా వాహనంపై కాల్పులకు తెగబడ్డారు. ఈ వాహనం ఇంపాల్‌నుంచి బిష్ణుపూర్‌కు వెళుతుండగా ఈసంఘటన నంబాల్ సబాల్ లీకాల్‌ప్రాంతంలో జరిగింది. సాయంత్రం 5.50 గంటలప్రాంతంలో కేవలం ఇంపాల్ ఎయిర్‌పోర్టుకు ఎనిమిది కిలోమీటర్లదూరంలోనేజరిగిందని పోలీసులు తెలిపారు.

# అన్ని నదులను అనుసంధానిస్తా

>> పనులు 3.84 శాతం మాత్రమే. 2027 డిసెంబరు నాటికి ప్రాజెక్టును పూర్తి చేసి నీళ్లిస్తాం. గతంలో రూ.400 కోట్లతో డయాఫ్రం వాల్ ను నిర్మించాం. గత పాలకుల అసమర్థ పాలన వల్ల పోలవరం డయాఫ్రం వాల్ కొట్టుకు పోయింది. కాంట్రాక్టర్లను మార్చొద్దని కేంద్ర జలసంఘం చెప్పినా గత పాలకులు వినలేదు. 2025 డిసెంబరు నాటికి డయాఫ్రం వాల్ పూర్తి చేస్తాం. పోలవరం ఎడమ కాలువ పనుల్ని రూ. 960 కోట్లతో టెండర్లు పిలిచాం. దీనిని పూర్తి చేసి ఉత్తరాంధ్రకు నీళ్లిస్తాం. రూ.894 కోట్ల నిధులు నిర్వాసితులకు నిధులు ఇచ్చాం. పట్టిసీమ ప్రాజెక్టు ద్వారా 439 టీఎంసీల నీటిని కృష్ణా డెల్టాకు తరలించాం. పొదుపు చేసిన నీటిని శ్రీశైలం నుంచి రాయలసీమ ప్రాంతానికి తరలించి నీరిచ్చాం. గత ప్రభుత్వంలో పట్టిసీమ ఎత్తిపోతలను వినియోగించలేదు. సీబీఎన్ కు పేరు రాకూడదనే ప్రజాధనంతో కట్టిన పట్టిసీమను వాడకుండా వదిలేశారు. ప్రజావేదికను కూల్చేసి విధ్వంసంతో పాలన ప్రారంభించారు. 1987లో ఎన్టీఆర్ సంకల్పించిన హంద్రీనీవా కాలువ ద్వారా 738 కిలోమీటర్ల నీటిని తరలించి చిట్టచివరి ప్రాంతానికి తీసుకెళ్లాం. వందరోజుల్లోనే రూ. 3800 కోట్లను మంజూరు చేసి 3850 క్యూసెక్కుల నీటిని పారిస్తున్నాం. పులివెందుల చెరువుకు కూడా నీటిని కూటమి ప్రభుత్వమే ఇస్తోంది. హంద్రీనీవాపై ఇప్పటి వరకూ రూ.13 వేల కోట్ల రూపాయల మేర ఖర్చు పెట్టాం. 40 టీఎంసీల మేర నీటిని తరలించు కోవచ్చు.468 చెరువులను నింపే ప్రయత్నం చేస్తున్నాం.రాయలసీమలోని అన్ని రిజర్వాయర్లలోనూ నీటిని నింపేలా ప్రణాళికలు చేసుకున్నాం. సాగునీటి రంగం పై ఖర్చు భారీగానే చేస్తున్నామన్నారు. 2014- 19 మధ్య రూ.68,417 కోట్లు (5 ఏళ్ళలో) 2019- 24 మధ్య కేవలం రూ.28,376 కోట్లు (5 ఏళ్ళలో) 202425 మధ్య రూ.12,454 కోట్లు (ఏడాదిలో) ఖర్చు చేసామన్నారు.

**రాష్ట్రానికి ఒక వరం, పోలవరం..**

ఏడు మండలాలు తెలంగాణాలో ఉండటంతో, పోలవరం ప్రాజెక్ట్ కట్టటం అసాధ్యం అవుతుంది. జూన్ 2, 2014 లోపు ఏడు మండలాలు ఆంధ్రప్రదేశ్ కి ఇవ్వకపోతే పోలవరం కట్టలేం, నేను మా ప్రజలను మోసం చేయలేను అని, ఈ ఏడు మండలాలు ఏపీలో కలిపితేనే ప్రమాణస్వీకారం చేస్తానని నాడు కేంద్రాన్ని కోరాం. మన విజ్ఞప్తిని మన్నించి, ఏడు మండలాలు ఏపీకి ఇచ్చిన ప్రధాని మోడీ గారికి ధన్యవాదాలు. ఈ రోజు పోలవరం ఈ స్టేజికి వచ్చింది అంటే, నాడు తీసుకున్న నిర్ణయమే నన్నారు. 2019-24 మధ్య సాగునీటి రంగానికి భయంకరమైన పరిస్థితి. ప్రాజెక్ట్ లకు గ్రీజు కూడా పెట్టని పరిస్థితి. కాలువలు మెంటైన్ చేయలేదు. పూడిక తీయలేదు. ఏకంగా ప్రాజెక్టులు, గేట్లు కూడా కొట్టుకుపోయే పరిస్థితి. టెండర్లు పిలిస్తే కాంట్రాక్టర్లు కూడా రాని పరిస్థితి.. వెలిగొండ ప్రాజెక్టు 1996లో నేనే ఫౌండేషన్ వేసా. 2014- 19 మధ్య టన్నెల్ 1 95 పని పూర్తి చేసాం. తరువాత వచ్చిన ప్రాజెక్ట్ మొత్తం గందరగోళం చేసింది. వెలిగొండ ప్రాజెక్టు పనులు పూర్తి చేయకుండానే జాతికి అంకితం అని ప్రారంభించారు. ఇంకా పనులు మిగిలే ఉన్నాయి. కూటమి ప్రభుత్వం వస్తూనే పనులు స్పీడ్ అప్ చేసాం. వచ్చే ఏడాది జులై నాటికి వెలిగొండ ప్రాజెక్టు పూర్తి చేస్తాం. ఖిఖివైసీపీకి సాగునీటిపై విధానం లేదు, విధ్వంసమే" అంటూ వీడియో ప్రదర్శించిన ముఖ్యమంత్రి.. పట్టిసీమ దండగ.. డేట్లు మర్చి, పోలవరం ఫేట్ మార్చేసిన వైనం, పర్సంటాఅర పర్సంటా అంటూ వెకిలి వ్యాఖ్యలు, కుప్పం నీళ్ళ సినిమా సెట్టింగ్, ప్రాజెక్ట్ పూర్తి చేయకుండా జాతికి అంకితం ఇచ్చేసే చిత్ర విచిత్ర విన్యాసాలు సభలో సీఎం ప్రదర్శించారు. ఉత్తరాంధ్ర సుజల స్రవంతి ద్వారా వంశధార వరకూ నీళ్ల తరలించవచ్చన్న చంద్రబాబు.. రూ.960 కోట్లతో చేపట్టిన ఈ ప్రాజెక్టు పనులు 75 శాతం పూర్తయ్యాయని తెలిపారు. అక్టోబరులోనే అనకాపల్లి వరకు ఈ జలాలు తీసుకొస్తామన్నారు. రూ.1425 కోట్లతో ఈ ప్రాజెక్టును పోలవరం కుడి కాలువతో అనుసంధానించామని చంద్రబాబు వెల్లడించారు.

శ్రీశైలంలో నిల్వ చేసిన నీళ్ల సీమ, హంద్రీనీవా, గాలేరునగరికి.. మల్యాల నుంచి కుప్పం ప్రాంతానికి హంద్రీనీవా జలాలు తరలించామని చంద్రబాబు చెప్పారు. పులివెందులలోని చెరువులకూ నీళ్లందించామని, హంద్రీనీవా ప్రాజెక్టుపై ఇప్పటివరకు రూ.13 వేల కోట్లు ఖర్చు చేశామని చంద్రబాబు తెలిపారు. దీని ద్వారా 40టీఎంసీల నీళ్లు తరలిం చగలుగుతున్నామని చంద్రబాబు అన్నారు.

# రూ.15 వేల 'వాహన మిత్ర'కు గ్రీన్ సిగ్నల్

>> వీటిలో ఏపీ జీఎస్టీ బిల్లు 2025కు సంబంధించిన సవరణలు కూడా ఉన్నాయని పేర్కొన్నారు. అలాగే, రాష్ట్రంలో ఓటర్ల జాబితా తయారీకి సంబంధించిన తేదీలను ఖరారు చేసే ప్రతిపాదనను కూడా కేబినెట్ ఆమోదించినట్లు ఆమె తెలిపారు. ఈ నిర్ణయాలతో రాష్ట్ర అభివృద్ధి, సంక్షేమానికి ప్రభుత్వం కట్టుబడి ఉందని స్పష్టం చేశారు.ఇక వివిధ బిల్లులకు ఏపీ కేబినెట్ గ్రీన్ సిగ్నల్ ఇచ్చారు. వైఎస్సార్ తాడిగడప మున్సిపాలిటీ, తాడిగడప మున్సిపాలిటీగా మార్చే డ్రాఫ్ట్ బిల్లుకు పలు సవరణలు చేస్తూ కేబినెట్‌లో ఆమోదం ముద్రపడింది. రాజధాని అమరావతి ప్రాంతంలో పెద్ద ప్రాజెక్టుల అమలుకు ప్రత్యేక వాహక నౌకలను ఏర్పాటు చేస్తూ మంత్రిమండలిలో నిర్ణయం తీసుకున్నారు.ఆగస్టు 31లోగా అర్బన్ లోకల్ బాడీలు, అర్బన్ డెవలప్మెంట్ అథారిటీ, ఏపీ సీఆర్డీఏ, రాజధాని ఏరియా మినహాయించి అనథరైజ్‌గా నిర్మించిన భవనాలకు పినలైజేషన్ విధించే ప్రతిపాదనపై కేబినెట్ ఆమోదం తెలిపింది. నాలా ఫీజు రద్దుకు సంబంధించి మున్సిపల్ అడ్మినిస్ట్రేషన్‌లోని వివిధ చట్టాలను సవరిస్తూ మంత్రిమండలిలో నిర్ణయం తీసుకున్నారు.రాజధాని అమరావతి ప్రాంతంలో పెద్ద ప్రాజెక్టుల అమలుకు ప్రత్యేక వాహక నౌకలను ఏర్పాటు చేస్తూ మంత్రిమండలిలో నిర్ణయం తీసుకున్నారు. మున్సిపల్ కార్పొరేషన్ చట్టం 1955, ఏపీ మున్సిపాలిటీ యాక్ట్ 1965 లకు ప్రజా ప్రాతినిధ్య చట్టం 1950 ను అనుసరించి ఓటర్ల జాబితా తయారీకి మరో మూడు తేదీలను ఖరారు చేసే ప్రతిపాదనకు మంత్రిమండలి ఆమోదం తెలియజేశారు. రాజధాని అమరావతి పరిధిలో గతంలో 343 ఎకరాలకు సంబంధించి ఇచ్చిన భూ సేకరణ నోటిఫికేషన్‌ను వెనక్కి తీసుకునేందుకు క్యాబినెట్‌లో గ్రీన్ సిగ్నల్ వచ్చింది. లిఫ్ట్ పాలసీ కింద చిన్న సంస్థల ఏర్పా టుకు భూములు కేటాయింపుకు సంబంధించి మంత్రిమండలిలో చర్చించి ఆమోదం తెలిపారు.పంచాయతీరాజ్ శాఖలో పలు భూములను అగ్రికల్చర్ నుంచి నాన్ అగ్రికల్చర్‌కు కన్వర్షన్‌కు సంబంధించి చేసిన ప్రతిపాదనలకు కేబినెట్‌లో ఆమోదముద్ర పడింది. ఆంధ్రప్రదేశ్ జీఎస్టీ బిల్ 2025లో పలు సవరణలు చేస్తూ చేసిన ప్రతిపాదనలకు ఆమోదం తెలపడంతో పాటు ఈ అసెంబ్లీ సమావేశాల్లో సభముందుకు తీసుకువచ్చే పలు బిల్లులకు మంత్రిమండలిలో ఆమోదముద్ర పడింది.

# ఎటువంటి రాజకీయ నిర్ణయాలు తీసుకోలేదు
## నాపై దుష్ప్రచారం చేస్తున్నారు: రాజ్‌గోపాల్ రెడ్డి

**విజయవాడ,సెప్టెంబరు 19,ప్రభాతవార్తప్రతినిధి:** కాంగ్రెస్ పార్టీలో తాను అత్యంత నిబద్ధతతో వ్యవహరిస్తున్నానని టీజీ రాష్ట్రం మునుగోడు శాసనసభ్యులు కోమటిరెడ్డి రాజ్ గోపాల్ రెడ్డి స్పష్టం చేసారు.తనపై కొందరు పనిగట్టుకుని చేస్తున్న దుష్ప్రచారంలో భాగమే తాను వైసిపిలో చేరుతున్నట్లు వస్తున్న కథనాలన్నారు.తన రాజకీయ జీవితంతో కాంగ్రెస్‌తో ముడిపడి ఉందన్నారు.తనని కాంగ్రెస్ వాదిగానే ప్రజలు ఉండాలని కోరుకుంటారన్నారు. విజయవాడ కనక దుర్గమ్మ సాక్షిగా తనపై వస్తున్న తప్పుడు కథనాలను దుష్ప్రచారాలను మరోసారి తీవ్రంగా ఖండిస్తున్నా అన్నారు. శుక్రవారం ఉదయం విజయవాడ లోని కనకదుర్గమ్మ ఆలయాన్ని సందర్శించి అమ్మవారిని రాజ్ గోపాల్ రెడ్డి దర్శించికున్నారు.అమ్మవారి దర్శనానికి వచ్చిన రాజ్ గోపాల్ రెడ్డికి వేద ఆశీర్వచనం ఆలయ అర్చకులు చేసారు.అనంతరం మీడియాతో .రాజగోపాల్ రెడ్డి మాట్లాడుతూ నిన్న ఒక సామాజిక కార్యక్రమంలో పాల్గొనడానికి గుంటూరు వచ్చాను. ఈరోజు విజయవాడ అమ్మవారి దర్శనం చేసుకున్న అన్నారు.తాను తెలంగాణ నుంచి ఇక్కడికి బయలుదేరినప్పటి నుండి రాజకీయంగా తన పై దుష్ప్రచారం చేస్తున్నారన్నారు. నేను నిన్ననే మీడియా ముందు క్లారిటీ ఇచ్చానన్నారు.కొంతమంది కావాలని నా ప్రతిష్టను దెబ్బతీయడానికి దుష్ప్రచారం చేస్తున్నారు వాటిని నమ్మకండన్నారు..తాను ఎటువంటి రాజకీయ నిర్ణయం తీసుకోవడం లేదన్నారు. రెండు తెలుగు రాష్ట్రాల ప్రజల అన్నదమ్ములు లాగా కలిసి ఉండి రెండు రాష్ట్రాలు సుభిక్షంగా ఉండి అభివృద్ధి పథంలో దూసుకుపోవాలని అమ్మవారిని ప్రార్థించా. మా కాంగ్రెస్ పార్టీ ప్రభుత్వం పేదలకు అండగా ఉండే కార్యక్రమాలు చేపడుతుందన్నారు.

# మావోయిస్టుల లేఖ అసలా! నకిలీయా?
## ఆరా తీస్తున్న పోలీస్, ఇంటెలిజెన్స్ వర్గాలు

**చర్ల, సెప్టెంబర్ 19 ప్రభాతవార్త:** మావోయిస్టు విప్లవోద్యమంపై కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు చేస్తున్న పాశివిక దాడులతో మావోయిస్టు పార్టీపై భూస్వామ్య పెత్తందారులు చేస్తున్న అసత్య ప్రచారాన్ని మానుకోకుంటే పరిణామాలు తీవ్రంగా ఉంటాయని భద్రాద్రి కొత్తగూడెం జిల్లా అల్లూరి సీతారామరాజు డివిజన్ (బికే ఏఎస్ ఆర్) డివిజన్ కమిటి విప్లవ పేరుతో విడుదలైన లేఖ సంచలనం కలిగిస్తుంది.మావోల మనుగడ సన్నగిల్లిందని విప్లవోద్యమంపై భూస్వామ్య పెత్తందారుల విధానాలు మళ్ళీ హెచ్చరిల్లుతున్నాయి. ఈ క్రమంలో పేదలు, సామాన్యులు, మధ్య తరగతి ప్రజలపై ఆయా వర్గాలు పెట్రేగి పోతున్నాయి. ప్రజలపై జరుగుతున్న ఈ దాడులను మావోయిస్టుపార్టీ చూస్తూ ఊరుకోదని, తీవ్ర హెచ్చరికలు చేసారు. భద్రాచలం చర్ల దుమ్ముగూడెం మండ లాల్లో కొందరు పెత్తందారులు ఈ పోకడలకు పాల్పడుతున్నారని అన్నారు. ముఖ్యంగా చర్ల, దుమ్ముగూడెం మండలాల్లో రాజకీయ బ్రోకర్లతో కలిసి పెత్తందారులు, భూస్వాములు ఈ పైశాచిక చర్యలకు పాల్పడుతున్నట్లు మా దృష్టికి వచ్చింది. "ఖబడ్దార్" పెత్తందార్లలారా పద్దతి మార్చుకోండి, లేకుంటే ప్రజా కోర్టులో మీకు శిక్ష తప్పదని అన్నారు. ఏజన్సీ ప్రాంతంలోని బడాబాబులు భూ స్వాములు రాజకీయ నాయకులు తమ పద్దతులు మార్చుకోవాలని చర్లకు చెందిన ప్రముఖ ఇసుక కాంట్రాక్టర్ల వ్యవహారశైలిపైనా ఘాటైన హెచ్చరికలు చేసారు. భూ స్వాముల స్వాధీనంలో ఉన్న భూములను ఇకనైనా పేదలకు అప్పగించాలని లేకుంటే ఆ భూములను మా పార్టీ స్వాధీన పర్చుకొని పేదలకు పంచుతుందని హెచ్చరించారు. రాజకీయ నాయకులు మొదలు కొని కొందరు వ్యాపారులు, భూస్వాములు పోలీసులకు పూర్తి ఇన్ఫార్మర్లుగా మారిపోయారు. పోలీస్ వ్యవస్థతో పనిచేస్తూ మా పార్టీకి సహకరిస్తున్నట్లుగా మోసపూరిత మాటలు చెప్పి కొందరు ఇన్ఫార్మర్స్ మమ్ములను మాయ చేస్తున్నారు వారికి మా ప్రజా కోర్టులో మరణ శిక్ష తప్పదని హెచ్చరిస్తున్నాము. ఖబడ్దార్ పోలీస్ ఇన్ఫార్మర్స్ అన్నారు. మరో ముందడుగు వేసి ప్రజాకోర్టులో శిక్ష తప్పదని అనడంతో పరిస్థితి తీవ్రంగా ఉన్నట్లు అర్థం అవుతుంది.దీంతో ఇప్పటి వరకు గుట్టుగా మావోలకు ఇటు పోలీసులకు ఇన్ఫార్మర్లుగా వ్యవహరిస్తున్న వారు సైతం ఆందోళనలో పడ్డారు. లేఖను బట్టి చూస్తే ఇన్ఫార్మర్ల వ్యవహారశైలి పై మావోలు నిశిత పరిశీలన చేసినట్లు తేటతెల్లం అవుతుంది ఇన్ఫార్మర్లకు వెన్నులో వణుకుపుట్టి అసలు మావోల లేఖ లేదా కావాలని ఎవరైన రాసారా అని కూపిలాగుతున్నారు.మావోల లేఖ అయితే ఇప్పుడు తమ పరిస్థితి ఏమిటని వారిలో అందోళన మొదలైంది. ఇన్స మారాలని కోరారు. అడవులో ఖనిజ సంపదను ఎత్తుకెళ్ళేందుకు బ్రాహ్మణీయ ఫాసిస్టు, బాజాపా ప్రభుత్వంతో చేతులు కలుపుతూ మా పార్టీపై కుట్రలు పన్నుతున్నారు. గొల్లగుప్ప గ్రామానికి చెందిన ఆదివాసీ మహిళ పై జరిగిన అత్యాచారం పై న్యాయవిచారణ చేయాలని డిమాండ్ చేసారు. పూసుగుప్పలో జరిగిన మారణాలపై కూడా న్యాయం చేయాలని అన్నారు. ఆపరేషన్ కగార్లో అమరులైన వారి త్యాగాల స్ఫూర్తితో ముందుకుసాగుదాం. ఆదివాసీలు, పార్టీ సభ్యులపై సాగుతున్న మారణకాం డకు బదులు తీర్చుకుంటాం. ప్రజలకోసం పని చేసే మావోయిస్టు పార్టీకి ప్రజాస్వామిక వాదులు, మేధావులు, విద్యావంతులు, జర్నలి స్థులు, పౌర హక్కులు, మానవ హక్కులు సంఘాలు విప్లవోద్యమాలు ఉద్యమాలకు మద్దుతు ఇవ్వాలని కోరారు.ప్రజా యుద్ధం కొనసాగిద్దాంఅమరుల త్యాగాలను ఎత్తిపడదాం.విప్లవ పోరాటాలు కొనసాగిద్దామని విప్లవ పేరుతో విడుదలైన లేఖలో పేర్కొనిఉంది.కాగా ఆపరేషన్ కగార్ పేరుతో జరుగుతున్న దాడులతో గత కొంతకాలంగా మునుగడే ప్రశ్నార్థకంగా మారిక క్రమంలో స్తబ్ధతగా ఉన్న మావోయిస్టు సరిహద్దు ప్రాంతాలలో ఎటువంటి అలజడులకు పాల్పడలేదు.తాజా వ్యాపారులు రాజకీయ నాయకులు భూస్వాములకు ఇసుక వ్యాపారులకు ఘాటైన హెచ్చరికల నేపద్యంలో ఈ ప్రాంతంలో మళ్లీ అలజడి నెలకొంది.విప్లవ పేరుతో విడుదలైన లేఖ నిజమా కాదా అని కొందరు వ్యాపారులు రాజకీయ నాయకులు మావోల ఇన్ఫార్మర్ల ద్వారా ఆరాతీస్తున్నట్లు తెలిసింది.ఇప్పటికే లేఖ పై స్పష్టత వచ్చేందుకు పోలీసులు ఇంటిలిజెన్సీ వర్గాలు ఆరాతీస్తున్నాయి.ఒకటి రెండు రోజుల్లో మావోల లేఖపై స్పష్టత వచ్చే అవకాశం ఉందని బావిస్తున్నారు.

# అరటిపళ్లతో ప్రియాంకకు తులాభారం

**మనస్సేరీ(కేరళ), సెప్టెంబరు 19:** కాంగ్రెస్ నాయకురాలు, వయనాడ్ ఎంపీ ప్రియాంక గాంధీ తన నియోజకవర్గంలో నిర్వహిస్తున్న పర్యటనలో శుక్రవారం ఆమె ముక్కం మనస్సేరీలోని శ్రీ కున్నత్ మహావిష్ణు ఆలయాన్ని సందర్శించి, అరటిపండ్లతో తులాభారం వేయించుకున్నారు. ఈ ప్రత్యేక పూజా కార్యక్రమంలో పాల్గొన్న ప్రియాంకకు ఆలయ అధికారులు స్వాగతం పలికారు. కాంగ్రెస్ మాజీ అధ్యక్షురాలు సోనియా గాంధీ, లోక్‌సభ ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ కూడా వాయనాడ్ చేరుకోవడం రాజకీయంగా ప్రాధాన్యత సంతరించుకుంది. వారం రోజులుగా తన లోక్‌సభ నియోజకవర్గంలో పర్యటిస్తున్న ప్రియాంక గాంధీ, క్షేత్రస్థాయిలో ప్రజలతో మమేకమవుతున్నారు. ఈనెల 12న ప్రారంభమైన ఈ పర్యటనలో భాగంగా ఆమె వివిధ సామాజిక, మత, వర్గాల నాయకులను వారి ఇళ్ల వద్దే కలుసుకుని సమస్యలు అడిగి తెలుసుకుంటున్నారు. ముఖ్యంగా యువత, మహిళలతో ప్రత్యేకంగా సమావేశమవుతూ విద్య, వైద్యం, వ్యవసాయం, పర్యావరణ పరిరక్షణ వంటి అంశాలపై చర్చిస్తున్నారు.

ఆలయంలో తులాభారం అనంతరం, కొత్తగా నిర్మించిన ఆలయ రథాన్ని ప్రియాంక గాంధీ పరిశీలించారు. దాని నిర్మాణంలో పాలుపంచుకున్న శిల్పుల నైపుణ్యాన్ని అభినందించారు. ప్రియాంక ఆలయ సందర్శన సాంస్కృతిక సామరస్యాన్ని, ప్రజలతో ఆమెకున్న భావోద్వేగ బంధాన్ని తెలియజేస్తోందని కాంగ్రెస్‌నాయకులు పేర్కొన్నారు.

## రష్యాపై ఆంక్షలు విధించేందుకు బ్రిటన్ అంగీకారం
## మీడియాతో అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్‌ట్రంప్

**న్యూయార్క్, సెప్టెంబరు 19:** అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ రష్యా నుంచి చమురు కొనుగోలు చేస్తున్న భారత్ తదితర దేశాలపై గుర్రుగా ఉంటున్నాడు. రష్యా చమురు కొనుగోలు చేసే దేశాలే లక్ష్యంగా పలు చర్యలు తీసుకున్నారు. ఈ క్రమంలో ఉక్రెయిన్‌లో శాంతి నెలకొల్పడం కోసం రష్యాపై ఆంక్షలు విధించేందుకు యూకే ప్రధాని కీర్ స్టార్మర్ అంగీకరించారని ట్రంప్ చెప్పారు. యూకే పర్యటన ముగించుకున్న ట్రంప్ అమెరికాకు తిరిగి వెళ్తుండగా ఎయిర్‌ఫోర్స్ వన్‌లో మీడియాతో మాట్లాడారు. యుద్ధం ముగింపు తాను అనుకున్న దానికంటే కష్టంగా ఉందని అన్నారు. స్టార్మర్‌తో జరిగిన భేటీలో ఉక్రెయిన్ అంశం కూడా చర్చకు వచ్చిందని తెలిపారు. ఈయూ, నాటో దేశాలు మాస్కో నుంచి చమురు కొనుగోలు చేయడం గురించి తాను లేవనెత్తానని, దాంతో స్టార్మర్ కొంచెం ఇబ్బందిపడ్డారని చెప్పారు.

## వారం - వర్జ్యం

20-09-2025, శనివారం
శ్రీ విశ్వావసు నామ సంవత్సరం,
భాద్రపద మాసం, దక్షిణాయణం
వర్ష ఋతువు, కృష్ణపక్షం
చతుర్దశి రా.12.19
మఖ ఉ.8.06
వర్జ్యం : సా.4.35-6.17
దు.ఆ.5.57-7.34
రాహుకాలం - ఉ.9.00-10.30

## వారఫలం

**మేషం :** గృహ నిర్మాణ ఆలోచనలు సాగిస్తారు. వాహనాలు, ఆభరణాలు కొనుగోలు చేస్తారు.

**వృషభం :** ఇంట్లో శుభకార్యాల ప్రస్తావన వుంటుంది. ఋణాలు తీరి ఊరట చెందుతారు.

**మిథునం:** స్థిరాస్థి వివాదాలు తీరి లబ్ధి పొందుతారు. కొత్త పెట్టుబడులకు అనుకూల కాలం.

**కర్కాటకం :** ఆప్తులు సహాయం అందుకుంటారు. సంతానం పట్ల సంతృప్తి కలిగి వుంటారు.

**సింహం:** మీ ప్రతిభకు గుర్తింపు లభిస్తుంది. ఆరోగ్యం పట్ల జాగ్రత్త అవసరం. స్వల్ప ధన లాభం.

**కన్య :** జీవిత భాగస్వామితో స్వల్ప వివాదాలు తలెత్తుతాయి. అనవసర విషయాలలో జోక్యం వద్దు.

**తుల :** ఆర్థికపరమైన సర్దుబాటులను అద్భుతముగా చేయగలుగుతారు.

**వృశ్చికం:** ముఖ్యమైన శుభకార్యమును వ్యవహారమును చక్కపెట్టి బరువు బాధ్యతలను దించుకుంటారు.

**ధనుస్సు:** తాత్కాలిక ప్రయోజనముల కొరకు మీకు ఇష్టం లేకపోయినా కొందరిలో కలిసి పనిచేయవలసి వస్తుంది.

**మకరం:** విద్యాపరంగా పురోభివృద్ధి బాగుంటుంది. నూతన వైద్యవిధానములు అనుకూల ఫలితములనిస్తాయి.

**కుంభం:** మీ ఆత్మీయులతో సమాలోచనలు చేసి కొన్ని కీలక నిర్ణయాలు తీసుకుంటారు.

**మీనం :** సకుటుంబంగా వివాహాది శుభకార్యములకు హాజరవుతారు. క్రయ విక్రయాలలో ప్రోత్సాహం.

- శ్రీమతి ములుగు శివజ్యోతి, కోఠి, హైదరాబాద్

# తరిమేయండి

>> సైనికులకు చెప్పారంటే చాలు ఎవరన్నా ప్లాస్టిక్ పడవేస్తే పట్టేసుకుంటారు. జనసైనికులు ఆ మధ్యన మీరు ఇచ్చిన పిలుపు మేరకు రోడ్లపై ఏర్పడిన గుంతలను పూడ్చారు అని గుర్తు చేశారు. ప్లాస్టిక్‌ని ఆపండి అని మీరు ఒక్క పిలుపు ఇస్తే చాలు ఇక అది ఆగిపోతుందన్నారు. సంబంధిత శాఖ మంత్రిగా మీరు ఆ స్టెప్స్ తీసుకుంటే ఈ ప్లాస్టిక్ భూతాన్ని అరికట్టాలంటే అది మీ వల్ల సాధ్యమయ్యే అవకాశం చాలా ఎక్కువగా ఉందని పవన్ కళ్యాణ్‌ను కోరారు. తల్లి గర్భంలోకూడా ఈ పొల్యూటెంట్స్ మైక్రోపొల్యూటెంట్స్ భయాందోళనకు గురిచేస్తున్నాయని అన్నారు.అలాగే గ్రామాల్లో, నగరాల్లో డిజిటల్ బోర్డ్స్ ని ఎంకరేజ్ చేస్తే ఈ ఫ్లెక్సీలు మానేసి ఆఅడ్వర్టైజ్మెంట్ ఏదో డిజిటల్ బోర్డ్స్ లోనే ఇచ్చుకుంటారన్నారు. డిజిటల్ బోర్డ్స్‌ని ఎంకరేజ్ చేస్తే ప్లాస్టిక్ నిషేధించొచ్చని తెలిపారు.

# నేడు మాచర్లకు ముఖ్యమంత్రి

>> మార్గదర్శులతో సీఎం మాట్లాడనున్నారు. స్వచ్ఛతా కార్యక్రమంలో ఉత్తమ పనితీరు కనబర్చిన మున్సిపల్ కమిషనర్లు, వివిధ పాఠశాలల ప్రతినిధులను ముఖ్యమంత్రి సన్మానించనున్నారు. మధ్యాహ్నం 2 గంటలకు టీడీపీ కార్య కర్తలతో సీఎం సమావేశం కానున్నారు. అనంతరం సాయంత్రం 5 గంటలకు నివాసానికి చేరుకుంటారు.

# 474పార్టీలపై ఇసి వేటు

>>లు ఉండగా, తాజా తొలగింపుతో ఈ సంఖ్య 2046కు తగ్గిందని పేర్కొంది. ప్రస్తుతం ఆరు జాతీయ పార్టీలు, 67 ప్రాంతీయ పార్టీలు ఉన్నాయని కేంద్ర ఎన్నికల సంఘం వెల్లడించింది. దేశవ్యాప్తంగా 23 రాష్ట్రాలు, కేంద్ర పాలిత ప్రాంతాలకు సంబంధించి 359 పార్టీల కార్యకలాపాలపై పరిశీలన జరుగుతోందని ఈసీ తెలిపింది. 2021-22, 2022-23, 2023-24 ఆర్థిక సంవత్సరాలకు సంబంధించి వార్షికఆడిట్, ఎన్నికల వ్యయ నివేదికలు సమర్పించలేదు.ఆయా పార్టీలకు నోటీసులు జారీచేసినట్లు ఈసీ తెలిసింది. పారదర్శకత,జవాబుదారీతనం, మరింత విశ్వసనీయమైన ఎన్నికల ప్రక్రియ కోసం ఈ చర్యలు తీసుకున్నామని ఎన్నికల కమిషన్ వివరించింది.

# సొంత పార్టీలో సెగలు - మిత్రపక్షంలో భగభగలు

**శ్రీకాళహస్తి,సెప్టెంబర్ 19 ప్రభాతవార్త** శ్రీకాళహస్తీశ్వరాలయ ధర్మకర్తల మండలి చైర్మన్ పగ్గాలను జనసేన పార్టీకి కేటాయించటం,జనసేన పార్టీ శ్రీకాళహస్తికి చెందిన కొట్టేసాయి(ప్రసాద్‌)పేరును ప్రతిపాదించటం పట్ల సొంత పార్టీలో సెగలు పొగలు చేసుకుంటున్నాయి. మిత్రపక్షమైన తెలుగుదేశం పార్టీ క్యాడర్ భగ భగ మంటున్నాయి. శ్రీకాళహస్తీశ్వరాలయ ధర్మకర్తల మండలి చైర్మన్ ప్రకటన కూటమి పార్టీల్లో ప్రకంపనలు చేసుకున్నాయి. శుక్రవారం తెలుగుదేశం పార్టీ నాయకులు పలువురు తమ పార్టీ పదవులకు రాజీనామాలు చేయటానికి సిద్ద పడ్డారు. ఈ నేపధ్యంలో శాసనసభ్యుడు సుధీర్‌రెడ్డికి మెసేజ్‌లు,ఫోన్ల ద్వారా తమ నిరసనలు తెలుపుతున్నారు. శ్రీకాళహస్తి మండలంలో ఫ్లేక్సీలు కూడా తొలగించినట్లు సమాచారం. శ్రీకాళహస్తీశ్వరాలయ ధర్మకర్తల మండలి చైర్మన్ పదవిని ఉమ్మడి చిత్తూరుజిల్లా కార్యదర్శి కొట్టేసాయి ప్రసాద్‌కు ఇవ్వటంపై జనసేన పార్టీ మాజీ నియోజకవర్గ ఇన్‌చార్జి వినూత కోట అభ్యంతరం చెబుతూ పార్టీకి బహిరంగ లేఖ రాసారు.డెప్యూటీ సిఎం పవన్‌కళ్యాణ్‌కు రాసిన

### శ్రీకాళహస్తీశ్వరాలయ చైర్మన్ ప్రకటన ప్రకంపనలు

లేఖలో సారాంశం ఇలా ఉంది.పవిత్రమైన శ్రీకాళహస్తీశ్వరాలయ ధర్మకర్తల మండలి చైర్మన్ పదవిని ఏ మాత్రం అర్హత లేని కొట్టేసాయికి ఇవ్వటంపైఅభ్యంతరం చెబుతున్నానని పునరాలోచించాలని అభ్యర్థించారు.మహిళలంటే కనీసం మర్యాద,గౌరవంలేని కనీసం రోజు ఆలయానికి వెళ్ళి అలవాటు లేని ఆతనికి ఇవ్వటం దారుణమన్నారు. ఇది సమంజసం కాదన్నారు. ఆతని పేరు ప్రకటించే ముందు పార్టీ స్థానికంగా విచారణ జరిపి ఉండాల్సింది.తనపై హత్యాయత్నం నమోదులో కుట్రలో ప్రధానమైన వ్యక్తుల్లో కొట్టే సాయి ఒకరనే విషయం మీకు తెలియజేస్తున్నానని పేర్కొన్నారు.బహుశా తనపై జరిగిన ఇంత పెద్ద సమస్య కుట్రకు సంబంధించి మీ దృష్టికి చేరలేదని భావిస్తున్నానని వినూత కోట తాను రాసిన లేఖలో పేర్కొన్నారు. పరమ పవిత్రమైన దేవాలయం చైర్మెన్ పదవి ప్రకటించే ముందు నిజాయితిగా పార్టీ కోసం కష్టపడ్డ వారిని గుర్తించి ఎంపిక చేసి ఉండాల్సింది.మహిళలంటే సాయికి గౌరవం లేదు. జనసేన నియోజకవర్గ ఇన్‌చార్జ్‌గా ఉన్న తనను భౌతికంగా వతనం చేయాలని, రాజకీయాలకు దూరం చేయాలని తన డ్రైవర్‌ను డెబ్బతీసేందుకు జరిగిన కుట్రల్లో కొట్టె సాయి ప్రధాన వ్యక్తి అని పేర్కొన్నారు.త్వరలో అన్ని ఆధారాలతో మీడియాకు వివరిస్తామని వినూత కోట ఓ ఉత్తరాన్ని పార్టీకి పంపినట్లు తెలిపారు. శ్రీకాళహస్తి తెలుగుదేశం వర్గాల్లో శ్రీకాళహస్తీశ్వరాలయ ధర్మకర్తల మండలి చైర్మన్ పదవిని జనసేనకు కట్టబెట్టడంపై తీవ్ర అసంతృప్తి గురయ్యారు. పలువురు తమ పార్టీ పదవులకు రాజీనామాలు చేస్తామని, మరి కొందరు విజయవాడకు బయలుదేరేటానికి శుక్రవారం సిద్ధమయ్యారు.కాగా బిసి వర్గాల్లో ఒక్కసారిగా అసంతృప్తి చోటు చేసుకుంది.ఈ మేరకు కొందరు బిసి నాయకులు ముఖ్యమంత్రికి వినతి పత్రం పంపారు. పోలీసుల చేత చెంప దెబ్బతినటమే అర్హత అయితే తాము లాఠీ దెబ్బలు తిన్నాము.మరి మాకు ఏ పదవులు రావా? అంటూ ప్రశ్నిస్తున్నారు.



# ఛలో మెడికల్ కళాశాల నిరసనకు పోటెత్తిన జనం

## మెడికల్ కళాశాల ప్రైవేటీకరణను నిరసిస్తూ వైఎస్సార్సీ ఉద్యమం

## పశ్చిమ ప్రాంతంలో ఆరోగ్య హక్కు కోసం రోడ్డెక్కిన ప్రజలు



**ఒంగోలు - ప్రభాతవార్త ప్రతినిధి** పశ్చిమ ప్రాంతంలో వైకాపా ప్రభుత్వ హయాంలో మంజూరు చేసిన మెడికల్ కళాశాలను కూటమి ప్రభుత్వం ప్రవేటీకరణకు సిద్ధం కావడం పట్ల వైకాపా పెద్ద ఎత్తున ఉద్యమానికి శ్రీకారం చుట్టింది. అన్నీ రంగాలలో వెనుకబడిన పశ్చిమ ప్రాంతంలో ఏర్పాటు చేసిన ప్రభుత్వ మెడికల్ కళాశాలను ప్రవేటీకరణ చేస్తూ జీఓ జారీ చేయడాన్ని పశ్చిమ ప్రాంత ప్రజలు జీర్ణించుకోలేక పోతున్నారు. ప్రవేటు కార్పొరేట్ నోచుకోలేని పేద ప్రజల కోసం ఆనాడు మాజీ ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డి రూ.475 కోట్లతో మెడికల్ కళాశాలను మంజూరు చేయడంతో పాటు భవన నిర్మాణ పనులు కూడా శరవేగంగా సాగుతున్న నేపధ్యంలో కూటమి ప్రభుత్వం ఏర్పాటుతో మెడికల్ కళాశాల నిర్మాణ పనులు నిలిచిపోయాయి. అయితే అధికారంలోకి వచ్చిన ఏడాదిన్నర తరువాత మెడికల్ కళాశాలను ప్రవేటీకరణ చేసే జీఓ జారీ చేయడాన్ని తీవ్రంగా నిరసిస్తూ వైయస్సార్ పార్టీ ఆధ్వర్యంలో పోరాటానికి శ్రీకారం చుట్టారు. మార్కాపురం నియోజకవర్గ ఇంచార్జి ,మాజీ ఎమ్మెల్యే అన్నా రాంబాబు నేతృత్వంలో శుక్రవారం ఉదయం చేపట్టిన ఛలో మెడికల్ కళాశాల నిరసన ర్యాలీ విజయవంతమైంది. జిల్లా అధ్యక్షులు బూచేపల్లి శివప్రసాదరెడ్డి, జడ్పీ ఛైర్మన్ బూచేపల్లి వెంకాయమ్మ ,యర్రగొండపాలెం ఎమ్మెల్యే తాటిపర్తి చంద్రశేఖర్,మార్కాపురం మాజీ ఎమ్మెల్యే కుందురు నాగార్జునరెడ్డి ఆధ్వర్యంలో జరిగిన ఈ ర్యాలీలో పశ్చిమ ప్రాంతం నుండి పెద్ద ఎత్తున ప్రజలు తరలి వచ్చారు. పార్టీ కార్యకర్తలు,నాయకులు ,అనుబంధ సంఘాల నాయకులు ప్రజలతో సాగిన ర్యాలీకి ప్రజలు పెద్ద ఎత్తున పోటెత్తారు. మార్కాపురం నుండి మెడికల్ కళాశాల వరకు ఛలో మెడికల్ కళాశాల నిరసన ర్యాలీ కొనసాగింది. మెడికల్ కళాశాల భవన నిర్మాణాలను సెల్ఫీ చిత్రాలు తీసుకున్నారు. వైకాపా జిల్లా అధ్యక్షులు బూచేపల్లి శివప్రసాదరెడ్డి మాట్లాడుతూ మెడికల్ కళాశాలను ప్రవేటీకరణ చేసే ప్రక్రియ నుంచి కూటమి ప్రభుత్వం సత్వరమే విరమించుకోవాలన్నారు. పేద ప్రజల కోసం ఆనాడు ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డి మంజూరు చేయడం జరిగిందని పూర్తి చేసే వైకాపాకు మంచి పేరు వస్తుందనే దుర్బుద్ధితో ప్రవేటీకరణకు శ్రీకారం చుట్టారన్నారు. అన్నీ రంగాలలో వెనుకబడిన పశ్చిమ ప్రాంత ప్రజలకు మెరుగైన వైద్యం అందించే మంచి ఆలోచనతో ఆనాడు ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డి మార్కాపురం ప్రాంతంలో మెడికల్ కళాశాల ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. నాణ్యమైన వైద్యం కోసం ,వైద్య విద్యకోసం ఎదురు చూస్తున్న నిరుపేదలకు ,పేద విద్యార్థులకు మెడికల్ కళాశాల ఓ వరంగా భావించారన్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత మెడికల్ కళాశాలను ప్రవేటు వ్యక్తులకు దారాదత్తం చేసే పెద్ద కుట్ర జరుగుతుందన్నారు.

# మదనపల్లి ఫైళ్ల దగ్ధం కేసు!

## - మళ్లీ జైలుకు ఆర్డీఓ మురళి

## - అక్టోబర్ 3 వరకు రిమాండ్ విధించిన కోర్టు



**చిత్తూరు, సెప్టెంబర్ 19 ప్రభాతవార్త:** మదనపల్లి సబ్ కలెక్టర్ కార్యాలయంలో ఫైళ్ళ దగ్ధం కేసులో నిందితుడిగా అప్పటి అర్డీఓగా విధులు నిర్వర్తించిన మురళీని సిఐడి పోలీసులు శుక్రవారం మరోసారి అరెస్టు చేశారు. సుప్రీంకోర్టు అర్డీఓ మురళీ బెయిల్‌ను రద్దు చేయడంతో శుక్రవారం సిఐడి పోలీసులు తిరుపతిలో అర్డీఓ మురళీని అరెస్టు చేసి చిత్తూరులోని సిఐడి కోర్టుకు హాజరు పరిచారు. ఈ మరకు చిత్తూరు సిఐడి కోర్టు జడ్జి షేక్‌బాబా అర్డీఓ మురళీని అక్టోబర్ 3వ తేదీ వరకు రిమాండ్ విధిస్తూ ఉత్తర్వులు జారీ చేశారు. ఈ మేరకు సిఐడి పోలీసులు అర్డీఓ మురళీని చిత్తూరు జైలుకు తరలించారు.

# ఎపిఐఐసి పారిశ్రామిక వాడ స్థలాల పరిశీలన

**కుప్పం, సెప్టెంబర్ 19 ప్రభాతవార్త :** కుప్పం పట్టణ సమీపంలో ఉన్న ఎపిఐఐసి పారి శ్రామికవాడ స్థలాలను శుక్రవారం ఎపిఐఐసి డైరెక్టర్ మల్లానూరు ప్రేమ్‌కుమార్ పరి శీలించారు. కుప్పం ప్రాంతంలో ఆటో నగర్ ఏర్పాటు చేయాల్సిన నేపథ్యంలో అందుకు తగిన నిర్మాణాలకు సంబంధించి స్థలాలు పరిశీలిస్తున్నట్లు ఆయన తెలిపారు. ఆటోనగర్ ఏర్పాటు అంశం సిఎం చంద్రబాబునాయుడు దృష్టికి తీసుకెళ్లి పనులు ప్రారంభమయ్యేలా చర్యలు తీసుకుంటామన్నారు. కార్యక్రమంలో కడ సభ్యుడు రాజ్‌కుమార్, టిడిపి మున్సిపల్ అధ్యక్షుడు రాజ్‌కుమార్, కార్మిక సంఘ అధ్యక్షుడు శివకుమార్, నేతలు రమణ, హరి, ఇస్మాయిల్, మునాఫ్ పాల్గొన్నారు.



ఎపిఐఐసి స్థలాలు పరిశీలిస్తున్న నేతలు

# పరిశ్రమలకు భూములు ఇచ్చేదిలేదు

## - భూసర్వే అడ్డగింత.. జీవనోపాధి కోల్పోతామంటున్న రైతులు

**రామకుప్పం, సెప్టెంబర్ 19 ప్రభాతవార్త :** పరిశ్రమల ఏర్పాటుకు తమ భూములు ఇచ్చేది లేదని పేర్కొంటూ మణీంద్రం పంచాయతీలోని రైతులు భూసర్వేను అడ్డుకున్నారు. సచివాలయం ఎదుట బైఠాయించి నిరసన తెలిపారు. భూములు కోల్పోతే తాము జీవనోపాధి కోల్పోతామని పేర్కొన్నారు. గతంలో రెండుసార్లు ఎయిర్‌పోర్టు నిర్మాణంకు భూములు ఇచ్చి సహకరించామన్నారు. హంద్రీ-నీవా కాలువ, గ్యాస్ పైప్‌లైన్ ఏర్పాటుకు సైతం ఇదివరకే భూములు ఇచ్చామన్నారు. ఇప్పుడు మిగిలిన అర్ధ ఎకరా, ఎకరా భూములను పరిశ్రమలకు ఇచ్చేస్తే తమ జీవితాలు అంధకారమవుతాయని పేర్కొన్నారు. ఇతర మండలాల్లో భూసేకరణ చేసి పరిశ్రమలు ఏర్పాటుచేయాలని పేర్కొన్నారు. సిఎం చంద్రబాబు నాయుడు అభివృద్ధి పథంలో నడిపిస్తున్న తరుణంలో తమను ఇబ్బందులకు గురి చేయవద్దన్నారు. ఉన్నతాధికారులు స్పందించాలని కోరారు. అనంతరం మణీంద్రం విఆర్వోకు వినతిపత్రం అందించారు.



నిరసన తెలుపుతున్న రైతులు, గ్రామస్తులు

# శాసనమండలి పలుమార్లు వాయిదా

**సచివాలయం,సెప్టెంబర్ 19,ప్రభాతవార్త :** రెండోరోజు శాసనమండలి పలుమార్లు వాయిదా పడిన పరిస్థితి శుక్రవారం నెలకొంది. శాసనమండలి ప్రారంభం కాగానే వైకాపా సభ్యులు మెడికల్ కళాశాలను ప్రైవేటుపరం చేయడంపై ఆందోళనకు దిగడంతో సభను పది నిమిషాల పాటు వాయిదా వేస్తున్నట్లు చైర్మన్ మోషేన్‌రాజు ప్రకటించారు. గతంలో వైసీపీ 17కళాశాలలు రాష్ట్రానికి తీసుకురావడంతో పాటు 5 కళాశాలలు ప్రారంభించిందని ప్రతిపక్ష నేత బొత్స సత్యనారాయణ తెలిపారు. అధికారం చేపట్టిన టిడిపి ప్రభుత్వం మిగిలిన వాటిని పూర్తి చేయకపోగా ప్రైవేటు పరం చేయడం సరికాదని దీనిపై చర్చకు సమయం ఇవ్వాలని కోరారు. దీంతో సభా సమయం వృధా చేయడం సరికాదని ప్రజా సమస్యలపై చర్చించేందుకు తమ ప్రభుత్వం ఎప్పుడూ సిద్దంగా ఉంటుందని శాసనసభ వ్యవహారాల మంత్రి పయ్యావుల కేశవ్ వివరించారు. అదే సమయంలో ప్రతిపక్ష సభ్యులు ప్లకార్డులు ప్రదర్శించి నిరసన వ్యక్తంచేయడంతో సభను సోమవారానికి వాయిదా వేస్తున్నట్లు చైర్మన్ ప్రకటించారు.

# పంచాయతీల్లో పట్టణ స్థాయి ప్రగతి : డిసిఎం పవన్ కల్యాణ్



**విజయవాడ,సెప్టెంబరు 19,ప్రభాతవార్త్తప్రతినిధి:** గ్రామ పంచాయతీల్లో పట్టణ స్థాయి సౌకర్యాల కల్పన లక్ష్యంగా వ్యవస్థలో సమూల మార్పులకు శ్రీకారం చుడుతున్నారురాష్ట్ర ఉపముఖ్యమంత్రి( పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధిశాఖ) పవన్ కళ్యాణ్ అన్నారు.దివంగత రాష్ట్రపతి డాక్టర్ ఏపీజే అబ్దుల్ కలాం గారి కలలను సాకారం చేస్తూ ప్రతి పల్లెలో మౌలిక వసతులు మెరుగుపరచే దిశగా పంచాయతీ కార్యాలయాల్లో పౌర సేవలు సత్వరమే సక్రమంగా అందేలా పాలన వ్యవస్థను పునర్వ్యవస్థీకరణ చేయబోతున్నారు. అందుకోసం గతంలో ఉన్న లోపభూయిష్ట విధానాలను గుర్తించి పూర్తి స్థాయిలో ప్రక్షాళన చేస్తారు. ఈ మేరకు శుక్రవారం శాసన సభలోని ఉపముఖ్యమంత్రి వారి కార్యాలయంలో పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ, సాధారణ పరిపాలన శాఖ, ఆర్థిక, న్యాయ శాఖల ఉన్నతాధికారులుతో పంచాయతీల పునర్వర్గీకరణ, నూతన సంస్కరణల అమలుపై సమీక్షా సమావేశం నిర్వహించారు. ప్రస్తుతం గ్రామ పంచాయతీల్లో అమలు చేస్తున్న విధానాలు, అందులో లోపాలు, చేయాల్సిన మార్పులు చేర్పుల ప్రజెంటేషన్ అధికారులు ఇచ్చారు. ఈ సందర్భంగా పవన్ కళ్యాణ్ నూతనంగా అమలు చేయనున్న ప్రణాళికలపై దిశానిర్దేశం చేశారు.దాదాపు 50ఏళ్ల నాటి సిబ్బంది నమూనాకు మార్పుచేర్పులు కూటమి ప్రభుత్వం మెరుగైన సౌకర్యాల కల్పనకు ప్రాధాన్యత ఇస్తుంది.

# పిపిపి విధానం అనుసరిస్తే ప్రజా ఉద్యమమే

## మెడికల్ కాలేజీలపై వైఎస్సార్సీ యువజన విభాగం అధ్యక్షుడు జక్కంపూడి రాజా



సత్యసాయి జిల్లా పెనుకొండ లో మెడికల్ కళాశాల భవన సముదాయం వద్ద వైసీపీ నాయకులు, కార్యకర్తలు

**అనంతపురం, సెప్టెంబర్ 19, (ప్రభాతవార్త బ్యూరో)** రాష్ట్రంలో మెడికల్ కాలేజీల వ్యవహారంలో పిపిపి మోడల్ లో ముందుకెళ్తే కలిసి కలిసి వచ్చే శక్తులతో కలసి వైసిపి ప్రజా ఉద్యమాన్ని నిర్మిస్తుందని వైసిపి యువజన విభాగం రాష్ట్ర అధ్యక్షుడు జక్కంపూడి రాజా హెచ్చరించారు. శ్రీలంక, నేపాల్, బంగ్లాదేశ్ తరహాలో పాలకులను తరిమి తరిమికొట్టినట్టే సీఎం చంద్రబాబును కూడా తరిమికొట్టే రోజులు దగ్గరలోనే ఉన్నాయని ఆయన హెచ్చరించారు. మెడికల్ కళాశాలలో ప్రైవేట్ పరం చేయడానికి వ్యతిరేకిస్తూ చలో మెడికల్ కళాశాల కార్యక్రమాన్ని శ్రీ సత్యసాయి జిల్లా పెనుకొండ లో శనివారం పెద్ద ఎత్తున చేపట్టారు. పెనుకొండ లో నిర్మాణంలో ఉన్న భవన సముదాయాన్ని ఉమ్మడి అనంతపురం జిల్లా వైసిపి నేతలు పరిశీలించి రాష్ట్ర కూటమి ప్రభుత్వం చర్యలను నిరసిస్తూ నినాదాలు చేశారు.ఈ కార్యక్రమంలో ఉమ్మడి అనంతపురం జిల్లాకు చెందిన అన్ని నియోజకవర్గాల నాయకులు, కార్యకర్తలు, యువజన విభాగం నాయకులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు. శ్రీ సత్యసాయి జిల్లా వైసిపి జిల్లా అధ్యక్షులు ఉషశ్రీ చరణ్, అనంతపురం జిల్లా వైసిపి జిల్లా అధ్యక్షులు అనంత వెంకటరామిరెడ్డి, ఇతర ముఖ్యమైన నాయకులంతా ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు. అసలు కళాశాల నిర్మాణమే లేదన్న అధికార పార్టీ నాయకులు ఒకసారి కళ్ళు తెరిచి చూడాలంటూ మెడికల్ కళాశాల భవనాలను నాయకులు చూపించారు. ఈ సందర్భంగా వైసిపి నేతలు మాట్లాడుతూ దేశ చరిత్రలో ఎప్పుడు ఏ ముఖ్యమంత్రి చేయని విధంగా ఒకేసారి 17 మెడికల్ కళాశాలను తీసుకొచ్చిన ఘనత ఒక వైయస్ జగన్మోహన్ రెడ్డికి మాత్రమే దక్కుతుందన్నారు. అయితే నాలుగుసార్లు ముఖ్యమంత్రి అయిన చంద్రబాబు కనీసం ఒక్క మెడికల్ కళాశాల తీసుకురాకపోగా.. ఉన్న వాటిని కూడా ప్రైవేట్ పరం చేస్తున్నారన్నారు. రేపు ఇదే పద్ధతి కొనసాగితే మిగిలిన అన్ని ప్రభుత్వ విద్యాసంస్థలను ప్రైవేట్ పరం చేస్తారేమోనన్న సందేహాన్ని నేతలు వ్యక్తం చేశారు. ప్రైవేట్ వ్యక్తులు దీనిని తీసుకుంటే ఖచ్చితంగా 2029లో తిరిగి జగన్మోహన్ రెడ్డి ప్రభుత్వం స్వాధీనం చేసుకుంటుందని హెచ్చరించారు. పెనుకొండ మెడికల్ కాలేజీ భవన నిర్మాణ పనులు పరిశీలించిన వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ నేతలలో శ్రీ సత్య సాయి జిల్లా వైసీపీ జిల్లా అధ్యక్షురాలు ఉషాశ్రీచరణ్ , వైసీపీ అనంతపురం జిల్లా అధ్యక్షులు అనంత వెంకట్రామిరెడ్డి , హిందూపురం పార్లమెంటు పరిశీలకులు రమేష్ రెడ్డి , రాప్తాడు సమన్వయకర్త తోపుదుర్తి ప్రకాశ్ రెడ్డి , మడకశిర సమన్వయకర్త లక్కప్ప,, హిందూపురం సమన్వయకర్త డిఎన్ దీపిక , కదిరి సమన్వయకర్త మక్బుల్ , ఉరవకొండ సమన్వయకర్త వై విశ్వేశ్వర్ రెడ్డి, కళ్యాణదుర్గం సమన్వయకర్త తలారి రంగయ్య.

# స్థానిక సంస్థల ఎన్నికల్లో ఆర్డిటి ప్రభావం..

**అనంతపురం, సెప్టెంబర్ 19, (ప్రభాతవార్త బ్యూరో)** ఉమ్మడి అనంతపురం జిల్లాలో రూరల్ డెవలప్మెంట్ ట్రస్ట్ (ఆర్.డి. టీ) లబ్ధిదారుల ఆందోళన కొత్త పుంతలు తొక్కుతోంది. ఈనెల 12, 15 తేదీల్లో అనంతపురం జిల్లా కేంద్రంలో ఆర్డిటి లబ్ధిదారులు ర్యాలీ చేసి జిల్లా కలెక్టరేట్ వద్ద వేలాది మందితో నిర్వహించిన భారీ నిరసనలు చూస్తే వారిలో ఆక్రోశం ఎలా ఉందో అర్థం అవుతుంది. ఊరు వాడ కదిలి వచ్చి ఆర్డిటికీ ఎఫ్ సి ఆర్ ఏ లైసెన్స్ ఇవ్వాల్సిందే, ఎన్డీఏ ప్రభుత్వంలో కీలకంగా ఉన్న సీఎం చంద్రబాబు అనుకుంటే నిమిషాల్లో పని అవుతుందని జాయింట్ యాక్షన్ కమిటీ నాయకులు, వివిధ సంఘాల్లో ఉన్న మహిళ నాయకులు గట్టిగానే డిమాండ్ చేశారు. ఆర్డిటి ఇష్యూలో ప్రజల అగ్రహాన్ని స్వయంగా చూసిన నిఘాధికారులు పరిస్థితులను కేంద్ర, రాష్ట్ర అధికారులకు నివేదించి ఉంటారు. ఎస్సీ ,ఎస్టీ, బీసీ సంఘాలు, ఇతర ప్రజా సంఘాలతో కలిసి సేవ్ ఆర్ డి టి జాయింట్ యాక్షన్ కమిటీ ఏర్పడి ఉద్యమాన్ని తీవ్రతం చేస్తోంది.

అధికార తెలుగుదేశం పార్టీతో పాటు వైసీపీ ,సీపీఐ, సిపిఎం అన్ని రాజకీయ పార్టీల నేతలు తమదైన శైలిలో ఆర్డిటి కీ ఎఫ్ సి ఆర్ ఏ ఐ లైసెన్స్ ఇవ్వాల్సిందే అంటున్నారు. వైసిపి పాదయాత్ర చేయగా టిడిపి తరఫున ఎమ్మెల్యేలు , మంత్రులు రాష్ట్రంలో సీఎంను కలవడంతోపాటు కేంద్రంలో కేంద్ర హోం శాఖ మంత్రి ఆ విషయాన్ని కూడా కలిశారు. ఈ విధంగా రాజకీయ పార్టీల ప్రతినిధులు ఎవరు ప్రయత్నాలు వారు చేసినా ఆర్డిటి ఫైలుకు క్లియరెన్స్ లభించలేదు. ఐదు దశాబ్దాలుగా ఆర్డిటి సంస్థ విశాల దృక్పథంతో చేసిన అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను పరిగణలోకి తీసుకోకుండా సాంకేతిక కారణాలు, చిన్న చిన్న పొరపాట్లు దృష్టిలో పెట్టుకొని ఆర్టీడీకి ఎఫ్ సి ఆర్ ఏ లైసెన్సులు ఇవ్వడంలో జాప్యం చేయడం ఎంతవరకు సబబు అన్నారు.

# హాయ్‌ల్యాండ్‌లో 65 రోజులు ఏం చేశారు?

## - ఎపిపిఎస్సీని ప్రశ్నించిన హైకోర్టు

**విజయవాడ, సెప్టెంబర్ 19:** మంగళగిరి లోని హాయ్‌ల్యాండ్ రిసార్ట్స్‌లో గ్రూప్-1 ప్రధాన పరీక్ష జవాబు పత్రాలను మూల్యాంకనం చేయకపోతే 65 రోజులు అక్కడ ఏం చేశారని ఏపీపీఎస్సీని హైకోర్టు సూటిగా ప్రశ్నించింది. హాయ్‌ల్యాండ్‌లో జరిగిన మూల్యాంకనమే ప్రస్తుత కేసులో కీలకాంశమని వ్యాఖ్యానించింది. అక్కడ మూల్యాంకనానికి రూ.20 లక్షలు ఖర్చుచేశారని, పోలీసు సిబ్బందిని వినియోగించారని గుర్తు చేసింది. హాయ్‌ల్యాండ్‌లో మూల్యాంకనం జరగ్గపోతే త్వరలో ఫలితాలు ప్రకటిస్తామని ఏపీపీఎస్సీ అప్పటి కార్యదర్శి పీఎస్సార్ ఆంజనేయులు ఎందుకు మీడియాకు తెలిపారని ప్రశ్నించింది. మూల్యాంకనంలో అవకతవకలు జరిగాయని హైకోర్టు సింగిల్ జడ్జి తీర్పు ఇచ్చిన వెంటనే విచారణ జరిపించాలని ఏపీపీఎస్సీ పోలీసులకు ఎందుకు ఫిర్యాదు చేయలేదని నిలదీసింది. ఏడాది సమయం ఎందుకు తీసుకుందని ప్రశ్నలు సంధించింది. వాస్తవాలను కోర్టు ముందు ఉంచకుండా ఏపీపీఎస్సీ గోప్యత పాటిస్తోందని...వేల మంది అభ్యర్థుల జీవితాలతో అడ్డుకుంటోందని ఘాటుగా వ్యాఖ్యా నించింది. +గ్రూప్1 నోటిఫికేషన్ (27/218) ప్రధాన పరీక్షను రద్దు చేస్తూ సింగిల్ జడ్జి ఇచ్చిన తీర్పును సవాల్ చేస్తూ ఏపీపీఎస్సీ ఉద్యోగాలకు ఎంపికైన అ భ్యర్థులు దాఖలు చేసిన అప్పీళ్లపై గురువారం హైకోర్టు తుది విచారణలో వాదనలు ముగిసాయి. ఎంపిక కాని అభ్యర్థుల వాదనల కోసం విచారణ శుక్రవారానికి వాయిదా పడింది. న్యాయమూర్తులు జస్టిస్ బట్టు దేవానంద్,జస్టిస్ హరిహరనాథశర్మలతో కూడిన ధర్మాసనం ఈ మేరకు ఉత్తర్వులిచ్చింది. +జవాబుపత్రాల మాన్యువల్ మూల్యాంకనంలో అక్రమాలు చోటు చేసుకున్నాయన్న కారణంతో పరీక్షను రద్దు చేసి తాజాగా నిర్వహించాలని హైకోర్టు సింగిల్ జడ్జి 2024 మార్చి 13న కీలక తీర్పు ఇచ్చిన విషయం తెలిసిందే. ఈ తీర్పును సవాలు చేస్తూ ఏపీపీఎస్సీ ఉద్యోగాలు పొందిన వారు ధర్మాసనం ముందు అప్పీళ్ళు వేశారు. ఏపీపీఓస్సీ తరపున అడ్వకేట్ జనరల్(ఏజీ) దమ్మాలపాటి శ్రీనివాస్ వాదనలు వినిపించారు. అప్పటి కార్యదర్శి పీఎస్సార్ ఆంజనేయులు నేతృత్వంలో హాయ్‌ల్యాండ్‌లో జరిగిన మూల్యాంకనంలో అక్రమాలు జరిగాయన్న ఆరోపణలపై దర్యాప్తు జరిపించాలని ఏపీపీఎస్సీ ఈ ఏడాది ఏప్రిల్‌లో ఫిర్యాదు చేయగా, సిట్ దర్యాప్తు చేస్తోందన్నారు. సిట్ నివేదిక ఇచ్చేవరకు వేచి చూడటం ఉత్తమమని అన్నారు. ఇప్పటికే ఉద్యోగులుగా ఎంపికై విధులు నిర్వహిస్తున్న అభ్యర్థుల తరపున సీనియర్ న్యాయవాదులు సీవీమోహన్‌రెడ్డి,పి.శ్రీరఘురం,ఒ.మనోహరరెడ్డి,న్యాయవాదులు శ్రీకాంత్,జీవీ రెడ్డి తదితరులు వాదనలు వినిపించారు.

# 4 వైద్య కళాశాలలకు పిపిపి పద్ధతిలో టెండర్లు

## - డిబిఎఫ్‌టిఒ విధానంలో నిర్మాణ, నిర్వహణ బాధ్యతలు

**విజయవాడ, సెప్టెంబర్ 19:** ప్రభుత్వ ప్రైవేటు భాగస్వామ్యం(పీపీపీ) విధానంలో తొలిదశలో 4 వైద్యకళాశాలల నిర్మాణానికి రాష్ట్ర ప్రభుత్వం టెండర్లు పిలిచింది. ప్రభుత్వ ఆదేశాలతో ఈ ప్రొక్యూర్‌మెంట్ విధానంలో మార్కాపురం,మదనపల్లె,పులివెందుల,ఆదోని వైద్య కళాశాలల నిర్మాణ,నిర్వహణకు ఆసక్తి గల సంస్థలను ఆహ్వానిస్తూ ఆంధ్రప్రదేశ్ వైద్య సేవలు,మౌలిక సదుపాయాల సంస్థ(ఏపీఎంఎస్ఐడీసీ) టెండరు ప్రకటన విడుదల చేసింది. డిజైన్,బిల్డ్,ఫైనాన్స్,ఆపరేట్ అండ్ ట్రాన్స్ ఫర్(డీబీఎఫ్‌వోటీ) విధానంలో ప్రక్రియ సాగేలా మార్గదర్శకాలు రూపొందించారు. రిక్వెస్ట్ ఫర్ ప్రపోజల్ కింద సంస్థలను ఆహ్వానించారు. ఆసక్తి గల సంస్థలు క్షేత్రస్థాయి పరిస్థితిపై పూర్తి స్థాయి అంచనాకు వచ్చి సంతృప్తి చెందాకే టెండర్లు వేసే వెసులుబాటు కల్పించారు.ఇప్పటికే మదనపల్లె వైద్యకళాశాలల నిర్మాణం 1.15 శాతం,మార్కాపురం 5.85%,ఆదోని 9.86%,పులివెందుల కళాశాలలో 52.5 శాతం మేర పనులు జరిగినట్లు ప్రభుత్వం గుర్తించింది. మిగిలిన పనుల పూర్తికి ఆకృతులు రూపొందించడం,నిధులు సమకూర్చి వైద్యకళాశాలల నిర్మాణం పూర్తి చేయడం,నిర్వహించడం,నిర్దేశిత గడువు పూర్తయ్యాక ప్రభుత్వానికి వైద్య కళాశాలలు అప్పగించే రీతిలో పీపీపీ విధానానికి ప్రభుత్వం రూపకల్పన చేసింది. ఇప్పటి వరకు జరిగిన నిర్మాణాలను పరిగణనలోకి తీసుకొని...ఆదోని వైద్యకళాశాల నిర్మాణం పూర్తికి రూ.410.32 కోట్లు అంచనా వ్యయంగా,మార్కాపురం వైద్యకళాశాలలకు రూ.44.28 కోట్లు,మదనపల్లె వైద్యకళాశాలలకు రూ.446.28 కోట్లు,పులివెందుల వైద్యకళాశాలలకు రూ.168.37 కోట్లు అంచనా వ్యయంగా పేర్కొంది.నిర్మాణానికి బ్యాంకు గ్యారంటీ,సెక్యూరిటీల రూపంలో తీసుకునే డీమ్డ్ ఫెర్ఫార్మెన్స్ సెక్యూరిటీ మొత్తాన్ని ప్రాజెక్ట్ ఖర్చులో 3 శాతంగా నిర్ణయించింది.

+అక్టోబరు 3న ఉదయం 11 గంటలకు ప్రీబిడ్ సమావేశం నిర్వహిస్తారు. బిడ్డర్లు తమ అనుమానాలు,అభ్యంతరాలు 4న సాయంత్రం 5 గంటల్లోగా సమర్పించాలి.వీటికి అక్టోబరు 10 లోగా సమాధానం అందిస్తారు.

+బిల్లు సమర్పించడానికి అక్టోబరు 24 సాయంత్రం 5 గంటల వరకు గడువు విధించారు. 5.30 గంటలకు బిడ్లు తెరుస్తారు.

+పీపీపీ పద్ధతిలో నిర్మించే ఈ నాలుగు వైద్యకళాశాలల్లో 150 చొప్పున ఎంబీబీఎస్ సీట్లు,24 చొప్పున పీజీ సీట్లు,625 పడకల భోధన ఆస్పత్రులకు అనుగుణంగా ప్రభుత్వం నిర్ధేశించిన మార్గదర్శకాల ప్రకారం వైద్యకళాశాలలు,భోధనాస్పత్రులు నిర్మించాలి. అధ్యాపకులు,సిబ్బంది,విద్యార్థుల వసతిగృహాలు ఇలా అన్నింటినీ సకల వసతులతో పూర్తి చేయాలి.ఎవరు ఎక్కువకు టెండరు వేస్తే వారికే ప్రభుత్వం ప్రాధాన్యత ఇస్తుంది. పీజీ మెడికల్ ప్రవేశాలకు ధరఖాస్తుల ఆహ్వానం ప్రస్తుత విద్యా సంవత్సరానికి రాష్ట్రం లోని పలు వైద్య కళాశాలల్లో పీజీ మెడికల్ డిగ్రీ/డిప్లొమా కోర్సుల ఇన్,నాన్ సర్వీస్ కన్వీనర్ కోటా సీట్ల ప్రవేశానికి విజయవాడ లోని ఎనీ టీఆర్ ఆరోగ్య విశ్వవిద్యాలయం ధరఖాస్తులు ఆహ్వానించింది. ఈ మేరకు గురువారం నోటిఫికేషన్ విడుదల చేసింది. 'నీట్ పీజీ ప్రవేశపరీక్ష అర్హత కల్గిన అభ్యర్థులు ఈ నెల 19 నుంచి 25వ తేదీలోగా ధరఖాస్తులను డిఎంటిఆర్.యుహెచ్ఎస్ఎపి.ఇన్ వెబ్‌సైట్ ద్వారా విశ్వవిద్యాలయానికి పంపాలి.ఈ ఏడాది జులై 31 కల్లా ఇంటర్న్‌షిప్ పూర్తి చేసిన ఎంబీబీఎస్ విద్యార్థులే అర్హులు. పూర్తి వివరాలకు 8978780501, 7997710168 నంబర్లలో సంప్రదించాలి'.

## అవినీతి,స్వలాభం కోసమే పిపిపి విధానం - మాజీ మంత్రి బొత్ససత్యనారాయణ

**సచివాలయం,సెప్టెంబర్ 19,ప్రభాతవార్త :** వైసీపీ హయాంలో 17వైద్య కళాశాలలు తెచ్చామని మాజీ మంత్రి బొత్స సత్యనారాయణ అన్నారు.రూ.2,200కోట్లతో 5కళాశాలలు నిర్మాణం పూర్తి చేశామని,వైసీపీ ప్రభుత్వ మెడికల్ కళాశాలల ప్రైవేటి కరణను వ్యతిరేకిస్తూ అసెంబ్లీ వద్ద వైసీపీ ఎమ్మెల్సీలు నిరసన వ్యక్తంచేశారు.రాష్ట్ర వ్యాప్తంగా నూతన మెడికల్ కాలేజీల ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా ఛలో మెడికల్ కాలేజీ కు పిలుపు ఇచ్చిన వైసీపీ విద్యార్థి,యువజన విభాగాలు వారికి సంఘీభావంగా అసెంబ్లీ వద్ద ధర్నా చేపట్టిన ఆపార్టీ ఎమ్మెల్సీలు ఈ సందర్భంగా బొత్స సత్యనారాయణ మాట్లాడుతూ పిపిపి విధానం అంటే దోపిడి అని పేదలకు ఆరోగ్యం దొరుకుతుందా అని ప్రశ్నించారు.ప్రభుత్వఆస్పత్రులను దోచుకోవాలని నీచమైన ఆలోచన.


దక్షిణ మధ్య రైల్వే
Follow us on @SCRailwayIndia
మా వెబ్‌సైట్ www.scr.indianrailways.gov.in పై ద.మ. రైల్వే యొక్క టెండరు ప్రకటనల వివరాలను చూడవచ్చును.

టెండర్ నం. GTL-EM-39-2025-26
తేది: 18.09.2025

భారత రాష్ట్రపతి తరపున సీనియర్ డివిజనల్ ఎలక్ట్రికల్ ఇంజనీర్/నిర్వహణ/గుంతకల్ వారు క్రింది పనులకు ఇ-టెండర్లు కోరుతున్నారు.

టెండర్ నం.: GTL-EM-39-2025-26, పని యొక్క పేరు: గుంతకల్ డివిజన్- శ్రీకాళహస్తి: ABS ఫేజ్-II క్రింద స్టేషన్ స్థాయి పెంపుదల ప్రతిపాదన. 1) ప్రవేశ ద్వార ఆర్చ్ యొక్క ఏర్పాటు. 2) స్టేషన్ భవనం ముఖతలం & పోర్టికో ఏర్పాటు. 3) స్టేషన్ భవనం యొక్క 1వ అంతస్తు నిర్మాణం. 4) కొత్త S&T భవనం వగైరా ఏర్పాటు. 5) విద్యుత్-M పనులు. 6) డిజిటల్ ప్రదర్శనా బోర్డులు, S&T పనులు. 7) విద్యుత్-TRD పనులు. 8) పూర్తి పొడవు COP. 9) రెండవ ప్రవేశం/ఎగ్జిట్ ఎదురుగా, కొత్త బిల్డింగ్‌కు. 10) దివ్యాంగ మరుగుదొడ్లు. 11) PF నం. 2 & 3 పై సరిహద్దు గోడ-విద్యుత్ ఏర్పాట్లు. అంచనా విలువ (రూ): 3,31,72,407.75/-.

ముగింపు తేదీ మరియు సమయం: 10.10.2025 15.00 గం.ల వద్ద.

టెండర్ బిడ్డింగ్ మరియు ఇతర వివరాలకు http://www.ireps.gov.in లాగిన్ అవ్వండి. టెండర్ సవరణ ఏదైనా ఆన్‌లైన్‌లో మాత్రమే జారీ చేయబడును. టెండర్‌దారులు ఉచితంగా http://www.ireps.gov.in నుండి టెండర్ డాక్యుమెంట్‌లు డౌన్‌లోడ్ చేసుకొనవచ్చును.

సీనియర్ డివిజనల్ ఎలక్ట్రికల్ ఇంజనీర్, నిర్వహణ, గుంతకల్

టెండర్ నం. GTL-EM-41-2025-26
తేది: 17.09.2025

భారత రాష్ట్రపతి తరపున సీనియర్ డివిజనల్ ఎలక్ట్రికల్ ఇంజనీర్/నిర్వహణ/గుంతకల్ వారు క్రింది పనులకు ఇ-టెండర్లు కోరుతున్నారు.

టెండర్ నం.: GTL-EM-41-2025-26, పని యొక్క పేరు: గుంతకల్ డివిజన్-మదనపల్లి రోడ్, పీలేరు, మరియు కదిరి రైల్వే స్టేషన్‌ల యొక్క ఫుట్ ఓవర్ బ్రిడ్జ్‌లపై లిఫ్ట్‌ల ఏర్పాటు-విద్యుత్ సరఫరా ఏర్పాట్లు. సుమారు విలువ (రూ): 50,14,935.39/-.

ముగింపు తేదీ మరియు సమయం: 09.10.2025 15.00 గం.ల వద్ద.

టెండర్ బిడ్డింగ్ మరియు ఇతర వివరాలకు http://www.ireps.gov.in లాగిన్ అవ్వండి. టెండర్ సవరణ ఏదైనా ఆన్‌లైన్‌లో మాత్రమే జారీ చేయబడును. టెండర్‌దారులు ఉచితంగా http://www.ireps.gov.in నుండి టెండర్ డాక్యుమెంట్‌లు డౌన్‌లోడ్ చేసుకొనవచ్చును.

గమనిక: ఇ-టెండర్‌లో పాల్గొనడానికి/బిడ్‌కు టెండర్‌దారుడు చెల్లుబాటైన DSC (డిజిటల్ సిగ్నేచర్ సర్టిఫికెట్) కలిగి ఉండవలెను.

సీనియర్ డివిజనల్ ఎలక్ట్రికల్ ఇంజనీర్, నిర్వహణ, గుంతకల్
A1458

తదుపరి టెండరు నిబంధనలు/వివరములు మరియు టెండరు డాక్యుమెంట్ల డౌన్‌లోడింగ్‌కు, దయచేసి వెబ్‌సైట్లు https://ww.ireps.gov.in లేదా www.scr.indianrailways.gov.in చూడవచ్చును.



GREATER VISAKHAPATNAM MUNICIPAL CORPORATION
"e" Procurement Tender Notice
No. 26/2025-26/SE(W-V)/EE-VIII/DB/GVMC, Dt: 19-09-2025
Number of works -01, Value of works Rs. 67.35 Lakhs
Tender Opening Dt.20.09.2025, Closing Date:04.10.2025
Note: Further details at http://www.tender.apeprocurement.gov.in
O/o the EE-VIII, Cell No. 8187899151 For Commissioner

వార్త

కర్తవ్యం లేని వారికి హక్కులుండవు. హక్కులన్నీ కర్తవ్య నిర్వహణ నుండే ఆవిర్భవిస్తాయి.

-మహాత్మాగాంధీ

# తడిసి ముద్దయిన నగరం!

దేశమంతటా క్లౌడ్ బరస్ట్ విస్తృతవానలు కమ్ముకోవడంతో ఆసేతుహిమాచల పర్యంతం భారీ వర్షాలు, ప్రకృతి బీభత్సాలతో సతమతమవుతోంది. ఉత్తరాఖండ్‌లో వరద బీభత్సం కొనసాగుతోంది. చమేలీ జిల్లాలో పదుల సంఖ్యలో జనం మృతి చెందారు. ఒకపక్క ఎడతెగని వానలు, మరొకపక్క కొండ చరియలు విరిగిపడడం ఆ ప్రాంత వాసులకు ప్రాణాంతకంగా పరిణమించింది. రాబోయే కాలంలో వర్షబీభత్సాలు పెద్దసంఖ్యలో ఉంటాయని వాతావరణ హెచ్చరికలు వెలువడుతున్నాయి. అధిక వర్షపాతం రికార్డులన్నీ దాటిపోతున్నాయి. సగటు వాతావరణ ఉష్ణోగ్రతలు బాగా పెరుగుతున్నాయి. గ్లోబల్ వార్మింగ్, గాలిలో తేమ నిల్వ ఉండే పరిస్థితి అధికంగా ఉండి క్యుములో నింబస్ మేఘాలు తీవ్రంగా కమ్ముకున్నాయని, వాతావరణ మార్పుల్ని పరిశీలించుకోవాల్సి ఉంటుందని హెచ్చరికలున్నాయి. పైగా నైరుతి రుతుపవన కాలం జూన్ నుంచి సెప్టెంబరువరకు. కానీ ఆకాల పరిమితుల్లో ఎగుడు దిగుళ్లు కూడా బాగా కనపడుతున్నాయి. కొన్నిసార్లు సాధారణ ఉష్ణోగ్రతలుకూడా అధికంగా నమోదవుతున్నాయి. ఈ అంశాలపై భారత వాతావరణ పరిశోధనా శాఖ పలు విశ్లేషణలు చేపట్టి పర్యవసానాల హెచ్చరికలు అందచేస్తోంది. సమయానుకూలంగా అందించే సూచనలను పాటించాల్సి నఅవశ్యకత ఉంది. గ్లోబల్ వార్మింగ్‌తో సముద్ర ఉపరితలం ఉష్ణోగ్రతలు బాగా పెరిగి వేడెక్కిపోతున్నాయి. అందువల్లనే ఆవిరయ్యే నీటిశాతం పెరుగుతోంది. ఈ ప్రక్రియలకారణంగా తేమతో కూడిన గాలులు అతి నుంచి బాగా విపరీత వర్ష ఆలకు కారణమవుతున్నాయని వాతావరణ శాస్త్రజ్ఞులు పేర్కొంటున్నారు. పర్వత ప్రాంతాల్లోనూ, అల్పపీడన ప్రాంతాల్లోనూ క్యాములో నింబస్ మేఘాలు ఏర్పడడం వలన కుండపోత వర్షాలు విరివిగాపడుతున్నాయి. అంతేకాదు అరేబియా సముద్రం మీదుగా వీస్తున్న రుతుపవనాల్లో అధికతేమ ఉంది. ఇవి కూడా అధిక, భారీ వర్షాలకు కారణాలుగా ఉన్నాయి. వాతావరణ పరిస్థితులు దైవగతం అయినందున రానున్న ప్రకృతి విలయాలను ముందే పసికట్టి అప్రమత్తంగాఉండే బాధ్యత ప్రభుత్వంపై ఉంది. చిన్నపాటి వర్షానికే జంటనగరాల్లో మారుమూల ప్రాంతాలు సైతం వరదనీటిలో మునిగిపోతున్నాయి. కాలనీల్లో చేరిన నీరు ఎటూ కదలక నిలకడగా ఉండిపోతోంది. దాదాపు గత నాలుగు నెలలుగా హైదరాబాద్ ప్రాంత కాలనీలు సైతం నీటిలో నానుతున్నాయి. ఎడతెరిపి వానలకు తడిసి ముద్దవుతున్న ప్రజలు మార్కెట్‌లోకి రావడమే గగనమైపోతోంది. గ్రేటర్ హైదరాబాద్‌ను గత రెండు రోజులుగా భారీ వర్షం ఎడాపెడా ముంచెత్తింది. నగర వాసులు ట్రాఫిక్‌లో చిక్కుకున్నారంటే ఇంటికి చేరాలంటే గంటలు గంటలు పడుతోంది. ఎక్కడ చూసినా కిలో మీటర్ దూరం ట్రాఫిక్ నిలిచిపోయి ఉంటోంది. ప్రజలను వాన తాకిడి నుంచి కాస్తో కూస్తో బయటపడాల్సిన బాధ్యత నెత్తికెత్తుకోవాల్సిన జిహెచ్ఎంసిఅధికారులు కానీ, జలమండలి సిబ్బంది కానీ హైడ్రా అధికారులుకానీ తమ వంతు బాధ్యతను స్వీకరించేందుకు సిద్ధంగా లేరనే అపప్రథ నెత్తినేసుకుంటున్నారు. ఎవరి కష్టాలు వారివి. రావడానికి రాకపోవడానికి మధ్య వెంట్రుక వాసి వ్యత్యాసాలున్నా ప్రజలను ఆదుకునేందుకు వంది మాగదగణం మీనమేషాలు లెక్కిస్తోంది. ఏకధాటిగా కురిసే వాన తీవ్రతతో వరద ముంచెత్తిన నాలాలు, మ్యాన్‌హోల్సు పొంగిపొర్లుతున్నాయి. గంటలతరబడి నీళ్లల్లో మునిగే ఇల్లు, అందులో ఉంటున్న నివాసితులు వరద నీరు ఎప్పుడు వెనక్కిలాగుతుందోనని ఎదురు చూడాల్సిన పరిస్థితి ఉంది. నగర రహదారులు చెరువులను తలపిస్తున్నాయి. నడిచివెళ్లాలన్నా పట్టణవాసులు నడుములోతు నీళ్లలో నడవాల్సి వస్తోంది. ఒకపక్క పల్లె ప్రాంతాల్లో వాగులు వంకలూ పొర్లిపోవడం సాధారణం. కానీ పట్టణాలు, నగరాలు కూడా అదేరకం దృశ్యాలతో నిండిపోయాయి. కొద్దిరోజుల క్రితం తెలంగాణలోని కామారెడ్డి ప్రాంతం యావత్తు ఎన్నడూలేనివిధంగా నీటనానింది. ప్రత్యామ్నాయం ఆలోచించే సమయంకూడా వరుణ దేవుడివ్వలేదు. నష్టం తడిసిముద్దయింది. అనుకోకుండా వచ్చిన వర్ష ఉధృతికాదు. హైదరాబాద్ వాతావరణ శాఖ హెచ్చరికలు ప్రతి ఒక్కరికీ చేరుతూనే ఉన్నాయి. కానీ వెల్లువలా కురిసేవానల బీభత్సం గురించే జనం తెలుసుకో లేకపోతున్నారు. ఏ రహదారి మధ్యలోనో, ట్రాఫిక్‌లోనో చిక్కుకున్న వారి గతి అంతేమరి. నిన్నటి వాన ముచ్చట్లలో జంటనగరాల్లో నడిరోడ్డు మీదనే వర్షానికి కొట్టుకుపోయిన కార్లను గమనించొచ్చు. గత ఆదివారం ముగ్గురు వ్యక్తులు నాలాల్లో పడికొట్టుకుపోయారు. అలా కొట్టుకుపోయిన వారి ఆచూకీ తెలుసుకోవడం కష్టమైపోతోంది. బైకులెన్నో కొట్టుకుపోయాయి. నగరంలోని చాలాప్రాంతాలు ముఖ్యం గా ముషీరాబాద్, హిమాయత్‌నగర్‌లలో కొన్ని అపార్టు మెంట్‌ల సెల్లార్లు గత రెండు రోజులుగా నీట మునిగే ఉన్నాయి. ఖైరతాబాద్, బల్కంపేట, అమీర్‌పేటల్లో కూడా ఇలాంటి దృశ్యాలే. వీటన్నిటికీ కారణం నాలాల నిర్వహణ సక్రమంగా లేకపోవడమే. అవసరాలకు సరిపడా వరద కాల్వల నిర్మాణాన్ని కూడా ప్రణాళికాబద్ధంగా ప్రభుత్వం చేపట్టకపోవడమే. ఈనాటి అసౌకర్యానికి హేతువు. నాలాల్లో పూడిక తీయకపోవడాన్ని ఆప్రాంత వాసులు ప్రధానంగా ఎత్తి చూపిస్తున్నారు. ఏమయితేనేం ప్రధానంగా ప్రకృతి విలయాలు సంభవించినప్పుడు ప్రజల్ని సురక్షిత ప్రాంతాలకు తరలించి కాపాడడం ప్రభుత్వాలముఖ్య బాధ్యత. కానీ ప్రభుత్వాలు తమ బాధ్యతను మరచిపోవడం, సమయాని కి సరైనభద్రతా ప్రణాళికలతో అందుబాటులో లేకపోవడం విచారకం.

అదృష్టాన్ని నమ్ముకోవడం కంటే ధైర్యాన్ని నమ్ముకోవడం మంచిది.



సెనెకా

ఇతరులపై నీ ముందు నిందలు వేసేవాడు, పరుల వద్ద నీపై నిందలు వేయకుండా ఉండలేడు.



సోక్రటీస్

# ప్రజావాక్కు



## మారణహోమం ఆగేదెప్పుడు?

గాజామీద ఇజ్రాయిల్ బాంబుల వర్షం ఎడతెరపి లేకుండా కురిపిస్తూ అక్కడి వేల అమాయక ప్రజలను రక్తంతో తడిపి వేస్తున్నది. దానికితోడు ఆకలిచావులు అధిక మవుతున్నాయి. ఆస్తులు నాశనమవుతున్నాయి. వైద్యం అందించేఆస్పత్రులను కూడా ధ్వసం చేస్తున్నారు. ఉక్రెయిన్ మీదరష్యాదాడులు ఆగడంలేదు. అమెరికా ఇస్తున్న ఆయుధాలతో ఉక్రెయిన్ యుద్ధం కొనసాగిస్తోంది. మధ్యలో అమాయక ప్రజలుహతమవుతున్నారు. ఐక్యరాజ్యసమితి, యూరోపియన్ దేశాలు చోద్యం చూస్తున్నాయి. అందరూ యుద్ధోన్మాదులుగా మారిపోయారా అనిపిస్తోంది. గడచిన రెండు ప్రపంచ యుద్ధాల పర్యవసానాలు, నేర్చిన పాఠాలు మరచిపోయారా? శాంతిని నెలకొల్పి నోబుల్ శాంతి బహుమతిని కొట్టేయాలని ఆశ పడుతున్న అమెరికా అధినేత కూడా చోద్యం చూస్తూ కూర్చోవడం ఆశ్చర్యం.

- ఎన్. రామలక్ష్మి, సికింద్రాబాద్

## ఆటుపోట్ల జీవితం ఆస్వాదిస్తే ఉత్తమం

అతల వితల సుతలాది పద్నాలుగు లోకాలలో భూలోకం అత్యుత్తమమైనది. ఈ భూలోకంలో భారతఖండం ఇంకా ఉత్కృష్టమైనది. ఇక్కడ మానవుడిగా పుట్టడం ఎన్నోజన్మల పుణ్యఫలమంటారు. ఎందుకంటే ఇది ఖర్మభూమి. ఎందరో దేవతలు కొలువై సులభంగా మోక్షం ఇచ్చే భూమి. ఎన్నో ప్రకృతి వనరులకాలవాలమైన భూమి. అయినప్పటికీ ఈ భూమిలో పుట్టిన ప్రతిమనిషికి పోరాటం తప్పదు. కష్టసుఖాలు వెలుగు నీడల్లా వెంటాడుతూనే ఉంటాయి. ఈ పోరాంలో గెలవటం తల్లితండ్రులు, గురువులు నేర్పిస్తారు, ఓడిపోతే ధైర్యంగా ఎలా బతకాలో సమాజం నేర్పిస్తుంది.

- కాల్వ నిఖిత, సిద్ధిపేట

## పుస్తకాలు చదివించాలి

రాష్ట్ర గ్రంథాలయశాఖ ఆధ్వర్యంలో ప్రతి ఏటా గ్రంథాలయ వారోత్సవాలుజరుపుతారు. గ్రంథాలయాల అభివృద్ధి, పాఠకుల ప్రేరణ, పుస్తకాల విలువనుచెప్పే పలు అంశాలు ఉంటాయి. ఇటీవల విద్యార్థులు చాలా సమయం మొబైల్ వినియోగంతో వృధా, అనారోగ్యం చదువులో వెనుకబాటు జరుగుతోంది. ఈ జాడ్యం బాగా విస్తరించింది. దీనిని కొంతవరకు తగ్గించేందుకు తల్లితండ్రులు మొదట దృష్టి సారించాలి. పుస్తకాలు చదివించాలి.

- బొల్లోజు మేఘనాథం, విశాఖపట్నం

## సమన్వయం అత్యవసరం

మణిపూర్‌లో నెలలుగా కొనసాగుతున్న అల్లర్లు, హింస వల్ల రాష్ట్రం గందరగోళ పరిస్థితులను ఎదుర్కొంటోంది. కుకీలు, మైతీలు అనే రెండు వర్గాల మధ్య చెలరేగిన ఘర్షణలు అనేక ప్రాణాలను బలితీసుకోవడంతో పాటు, వేలాది కుటుంబాలను నిరాశ్రయులను చేశాయి. ఈనేపథ్యంలో ప్రధాని నరేంద్ర మోదీ రెండువర్గాల ప్రతినిధులను కలుసుకొని, శాంతిని నెలకొల్పాలని పిలుపునివ్వడం ఒక సానుకూల పరిణామం. అయితే, కేవలం హింసకుదూరంగా ఉండమని పిలుపునివ్వడమే సరిపోదు. పరస్పర అవిశ్వాసాన్ని తొలగించేలా చర్చలు జరగాలి. ఇరువర్గాలకూ భద్రతా హామీలు, పునరావాస సౌకర్యాలు, న్యాయం అందేలా చర్యలు అవసరం. రాష్ట్రశాంతి సమన్వయం పునరుద్ధరించడంలో ప్రభుత్వం దీర్ఘకాలిక వ్యూహంతో ముందుకు సాగితేనే శాంతి సుస్థిరంగా నిలుస్తుంది.

-తిప్పర్తి శ్రీనివాస్, చొప్పదండి

## పునరావృతం కాకూడదు

నేపాల్‌లో, లండన్‌లో ట్యూనిషియా ఇలా చాలా చోట్ల ఉద్యమాలు జరుగుతున్నవి. అయితే ఈఉద్యమాలకు మూలకారణం స్థిరమైన పాలన అందించకపోవడంఅలాగే ప్రజలకు రాజ్యాంగ బద్ధంగా రావాల్సిన స్వేచ్ఛఅలాగే విమర్శించే హక్కును అణిచివేత చేయడం ఈ సందర్భంలో సుప్రీం కోర్టు మాజీ ప్రధాన న్యాయమూర్తి చంద్రచుడ్ చెప్పినమాట ఒకటి గుర్తుకు వస్తుంది విమర్శను తొక్కిపెట్టాలి అనుకుంటే అది ప్రెషర్ కుక్కర్ లాగా పేలవచ్చు అనేది ఆయన వాఖ్యలుసారాంశం. ఇకపోతే ఇందులో రెండు కోణాలు ఉన్నాయి. ఒకటి ప్రజలు తమ ప్రాథమిక సమస్యలు పరిష్కారం కాకపోతే తిరుగబడడంలో లేదా తిరుగుబాటు చెయడంలో ఎటువంటి ఇబ్బంది లేదు.

-భారత అవినాష్, జనగామ

## వినోదమే వ్యసనం

ఆధునిక డిజిటల్ యుగంలో ఆన్‌లైన్ గేమ్స్ అనేవి కోట్లాది యువతను ఆకర్షిస్తున్న వినోద వేదికలుగా మారాయి. పబ్జ్, ఫైర్, మిన్ క్రాఫ్ట్, వంటి గేమ్స్ కేవలం ఆటలు మాత్రమే కాదు, అంతర్జాతీయ స్థాయిలో మల్టీబిలియన్ డాలర్ల పరిశ్రమగా ఎదిగాయి. ఆధునిక గ్రాఫిక్స్, శబ్దప్రభావాలు, రివార్డ్స్, లీడర్ బోర్డ్స్ వంటిఅంశాలు యువతను మరింతగా ఆకట్టుకుంటున్నాయి. కానీవినోదంవెనుకదాగిఉన్న మానసిక, శారీరక, సామాజిక ప్రమాదాలను సమాజంసీరియస్‌గా పరిగణించాల్సి నఅవసరం ఉంది.

-వెంకటరమణ, గిలకత్తుల

మనవి ఎడిట్ పేజీకి..

ఆర్థిక, సామాజిక, రాజకీయ విశ్లేషణాత్మక రచనలు పంపగోరు రచయితలు మాకు పంపే వ్యాసాలు ఇతర పత్రికలకు కూడా పంపడం సరైన విధానం కాదు. సహకరిస్తారని ఆశిస్తాం. -ఎడిటర్

(e-mail: editpage@vaartha.com)

# రైతు బతుకుతో ఆటలాడొద్దు

**తలతాకట్టుపెట్టి అప్పోసొప్పో చేసి పెట్టుబడి పెట్టి ఫలితం పొందలేక రుణభారంతో కృంగిపోతూ ఇల్లు గడవక, అప్పుపుట్టక దేశంలో ఎన్ని కోట్ల కుటుంబాలు హృదయవేదనతో ఆత్మాభిమానాన్ని చంపుకొని అవమానాలు భరిస్తూ జీవచ్ఛవంలా బతుకు వెళ్లదీస్తున్నాయో చెప్పలేం. పాలకులు అన్నదాతల విషయంలో మనసుపెట్టి ఆలోచించాలి. ఇతరత్రా ఎంత అభివృద్ధి సాధించినా మనిషి జీవనానికి ఆహారం తప్పనిసరి అనే విషయాన్ని విస్మరించరాదు. ఇంతపెద్ద జనాభాకు కావాల్సిన పంటలు రైతుల 'చెమట'పుణ్యమేనని గుర్తుంచుకోవాలి. రైతులు ఆత్మ విశ్వాసం కోల్పోవడం ఏ కోణంలో చూసినా దేశానికి క్షేమంకాదు. వారికున్న ఏకైక ఉపాధి వారిపాలిట మృత్యువుగా పరిణమించకుండా చూడాల్సిన బాధ్యత పాలకుల అందరిపై ఉంది.**

దామెర్ల సాయిబాబ

బాధపడడమే తప్ప బాధించడం తెలియని అన్నదాతల్లో ఇటీవల కాలంలో సహనం, ఓర్పు సన్నగిల్లి ఆందోళన బాటలు పడుతున్నారు. తమకెంతటి నష్టం జరిగినా, ఎవరు ఎంతగా మోసగించినా, తమలో తాము కుళ్లి, కుళ్లి మనసులోనే బాధపడి చివరకు ప్రాణత్యాగం చేయడానికైనా సిద్ధపడతారే తప్ప తమను దగా చేసినవారిపై కక్షకట్టి దాడులు చేసేందుకు సాహసించకపోయేవారు. ఫిర్యాదు చేయడానికి కూడా వెనుకంజ వేసే పరిస్థితుల్లో ఉండేవారు. పంటలకు గిట్టుబాటు ధర రాకపోయినా, దళారుల హస్తలాఘవంతో కోలుకోలేని దగాకు గురవుతున్నా తమ కర్మకు తామే బాధపడుతూ మౌన రోదనతో ఇంటిముఖం పట్టేవారు. ఇటవల కాలంలో తమకు జరిగిన అన్యాయాన్ని, దగాను ఎలుగెత్తి చాటడానికి ధర్నాలు, నిరసనలు లాంటి కార్యక్రమాలు తెలిపేందుకు స్వచ్ఛందంగా ముందుకు వస్తున్నారు. ఇవి అక్కడక్కడ అప్పుడప్పుడు జరుగుతున్నాయే తప్ప సంఘటితంగా జరుగుతున్న సంఘటనలు లేవనే చెప్పొచ్చు. ఆరుగాలం అష్టకష్టాలుపడి, పండించి తెచ్చిన పంటలను అమ్ముకోవడంలో వారు పడుతున్న ఇబ్బందులు అన్నీఇన్నీ కావు. దేశవ్యాప్తంగా చూసినా అధిక శాతం మార్కెట్ యార్డుల్లో దళారులదే రాజ్యం. కొలతల్లో మోసం, ధరలు నిర్ణయించడంలో దగా, ఒకటేమిటి ఎక్కడవీలైతే అక్కడ చేతివాటం ప్రదర్శించేందుకు దళారులు నిత్యం పొంచి ఉంటూనే ఉన్నారు. హాలికులు మోసపోతూనే ఉన్నారు. మోసపోయేవారు ఉన్నంతకాలం మోసం చేసేవారు ఉంటారన్నట్టే ఈ దళారీ వ్యవస్థ ఉన్నంత కాలం రైతులకు ఈ బాధలు తప్పవు. విత్తె దగ్గర నుంచి విక్రయించేవరకు అన్ని స్థాయిల్లో దగా జరుగుతున్నది. దీన్ని నిరోధించేందుకు పాలకులు ఎప్పటికప్పుడు చర్యలు చేపడుతున్నా ఫలితాలు కన్పించడం లేదు. ఇందుకు కారణాలెన్నో ఉన్నాయి కారకులు ఎందరో ఉన్నారు. కొన్ని ప్రాంతాల్లో కొందరు రాజకీయ నాయకులు కూడా ఈ నకిలీ వ్యాపారులకు ప్రత్యక్షంగానో పరోక్షంగానో అండగా నిలుస్తున్నారు. పేర్లు రాసి వారిని ఇబ్బంది పెట్టడం ఎందుకు కానీ ఆయా ప్రాంతాల్లో అందరికి తెలిసిందే. వ్యవసాయానికి మూలం విత్తనాలు. ఆ విత్తనాలే నకిలీవో, నాసిరకమో అయితే రైతులు కుప్పకూలిపోతున్నారు. ఈ ఖరీఫ్ సీజన్‌లో కూడా ఈ నకిలీ నాసిరకం విత్తనాలు రైతులను పెద్దఎత్తునే ముంచాయి. ములుగులో ఈ ఖరీఫ్ సీజన్‌లోనే నాసిరకం మొక్కజొన్న విత్తనాలు సరఫరా చేసి ఏజెన్సీ ప్రాంతంలో ఉన్న అమాయక గిరిపుత్రులను దగా చేసిన మల్టీనేషనల్ కంపెనీల ప్రతినిధులను మెడలు వంచి నష్టపరిహారం ఇప్పించడంలో ఆ జిల్లా కలెక్టర్ తీసుకున్న చర్యలు పట్ల హర్షాతిరేకాలు వ్యక్తమవుతున్నాయి. అదే సమయంలో ఇంత పెద్ద ఎత్తున దగాకు పాల్పడి ముగ్గురు అమాయక గిరిజన రైతుల ఆత్మహత్యలకు కారకులైన వారిపై ఎందుకు క్రిమినల్ చర్యలు చేపట్టలేకపోయారో అర్థం కావడం లేదు. ములుగు జిల్లాలో వాజేడు, వెంకటాపురం, కన్నాయిగూడా తదితర మండలాల్లో కంపెనీ రైతులకు మొక్కజొన్న విత్తనాలు సరఫరా చేసింది. పెట్టుబడి అంతా పెట్టి శ్రమ చేసిన తర్వాత మొక్కజొన్న కంకులు అయితే వచ్చాయి, వాటికి పూత ఉంది, ఖాత కాయలేదు. కానీ వాటిల్లో గింజలు లేకపోవడంతో ఆ గిరిజన రైతులు మోసపోయామని గ్రహించి రోడ్డెక్కారు. అటు పెట్టుబడి ఇటు రాత్రింబవళ్లు చేసిన శ్రమంతా బూడిదలో పోసిన పన్నీరు కావడంతో ముగ్గురు గిరిపుత్రులు ఆత్మహత్య చేసుకొన్నారు. ఢిల్లీ పీఠానికి మొక్కజొన్న రైతుల ఆర్తనాదాలు తాకడంతో అధికార వర్గాల్లో కదలిక వచ్చింది. పరిస్థితి కలెక్టర్ దృష్టికి వెళ్లడంతో ఆయన ప్రత్యేక శ్రద్ధ తీసుకొని గిరిజన ప్రాంతంలో ఉన్న చట్టాలను ఉపయోగించి నష్టం చేసిన కంపెనీలతో బక్క రైతులకు దాదాపు నాలుగు కోట్ల రూపాయలకుపైగా నష్టపరిహారం ఇప్పించారు. బహుశా రాష్ట్ర చరిత్రలో ఇలా ఇంత పెద్ద ఎత్తున నష్టపరిహారం ఇప్పించిన దాఖలాలు ఇటీవల కాలంలో లేవనే చెప్పొచ్చు. ఎంత వరకు నిజమో ఏమో కానీ రాజకీయ రంగు పూసి కొందరు నేతలు మోకాలొడ్డడంతోనే క్రిమినల్ చర్యలకు అడ్డుకట్టపడిందని ఆరోపణలు విన్పిస్తున్నాయి. ఆ కలెక్టర్‌పై చర్యలు తీసుకొనేందుకు పావులు కదుపుతున్నట్లు ప్రచారం జరుగుతున్నది. దీంతో వందలాది మంది గిరిజన రైతులు కలెక్టర్‌కు మద్దతుగా మొన్న రోడ్డుపైకి వచ్చి నిరసన ప్రదర్శనలు నిర్వహించారు. ఇంత బహిరంగంగా నకిలీ, నాసిరకం విత్తనాలతో అన్నదాతలను దగా చేసిన వారిపై చట్ట ప్రకారం చర్యలు తీసుకోకపోవడం పట్ల తీవ్ర విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. ఇలాంటి సంఘటనలు నకిలీ వ్యాపారులకు బలం చేకూర్చుతాయి. ఏదిఏమైనా రైతుల బతుకులతో రాజకీయలాట లాడడం ఏ మాత్రం ధర్మం కాదు. ఇక కూరగాయలకు సంబంధించిన నకిలీ విత్తనాలకు అదుపే లేకుండా పోతున్నది. రసీదులు, బిల్లులు ఎలాంటి ఆధారాలులేకుండా వేలాది క్వింటాళ్ల కూరగాయల విత్తనాలు ఇతర రాష్ట్రాల నుంచి వివిధ మార్గాల ద్వారా తెలుగు రాష్ట్రాలకు తెప్పించుకొని ఇష్టానుసారంగా అమ్ము కుంటున్నారు. వీటికి ఎలాంటి రసీదులు కానీ, ఆధారాలు లేకుండా చర్యలు తీసుకుంటు న్నారు. ఈ వ్యాపారం బాహాటంగా జరుగుతున్నా అధికారులందరికి తెలిసినా మౌనంగా ఉండిపోతున్నారు. రైతులు ఎవరైనా ఫిర్యాదు చేసినప్పుడు అన్నదాతలనే సముదాయించి రాజీ మార్గాలను అన్వేషిస్తున్నారే తప్ప చట్టప్రకారం నిర్దిష్టమైన చర్యలవైపు అడుగులు వేయలేకపోతున్నారు. ఎక్కడో మారుమూల గ్రామాల్లో ఈ నకిలీ వ్యాపారం జరగడం లేదు. రాష్ట్ర రాజధానులతో సహా నగరాలు, పట్టణాలు అంతటా విస్తరించిపోయింది. ప్రభుత్వ పరంగా ఎన్ని చర్యలు తీసుకుంటున్నా విత్త నాల కొరత దృష్ట్యా ఈ నకిలీ వ్యాపారులపై ఆధారపడక తప్పడం లేదు. మరొక పక్క పోలీసులన్నా, చట్టాలన్నా వ్యవసాయశాఖ అధికారులన్నా పాలకులు చేసే హెచ్చరికలన్నా నకిలీ, నాసిరకం విత్తనాలు అమ్మేవ్యాపారుల్లో భయ భక్తులు లేకుండాపోయాయి. ఇందుకు ఇతర కారణాల కంటే అసలు విత్తన చట్టమే లోపభూయిష్టంగా ఉంది. రైతుల కంటే దళారులకే ప్రయోజనకరంగా ఉండడం వల్లనే ఈ పరిస్థితి దాపురిస్తున్నది. కొత్త పటిష్టమైన చట్టం కావాలని ఏనాటి నుంచో రైతులు కోరుతున్నా కార్యరూపం దాల్చడం లేదు. భారతదేశంలో విత్తన చట్టం 1966 నాటిది. 1983లో విత్తన నియంత్రణ ఉత్తర్వులు అప్పుడు కేంద్ర ప్రభుత్వం జారీ చేసింది. పర్యావరణాన్ని పరిరక్షించాల్సిన చట్టం 1986లో తీసుకువచ్చారు. కొత్త చట్టం అవసరం ఉన్న మాటవాస్తవమే అయినా ఉన్న చట్టాలను కూడా త్రికరణశుద్ధిగా అమలు చేయడం లేదు. అసలు మనదేశం లో విత్తనాలు ఎలా తయారు చేస్తున్నారు? వారికున్న వనరులు ఏమిటి? సిబ్బంది ఎంత? తదితర వివరాలు ఏవీ ప్రభుత్వం పట్టించుకోవడం లేదు. తనిఖీలు కూడా అంతం త మాత్రమే. విదేశాల్లో విత్తనాల మోసాలను పకడ్బందీగా నియంత్రించడమే కాదు. రైతులను మోసగిస్తే తీవ్రమైన చర్యలు తీసుకుంటున్నారు. పొరుగునున్న చైనా లాంటి దేశాల్లో వారు తీసుకుంటున్న చర్యల కారణంగా నకిలీ, నాసిరకం విత్తనాలు పూర్తిగా అదృశ్యమైపోయాయి. ప్రభు త్వమే ఉచితంగా నాణ్యమైన విత్తనాలను రైతులకు అంది స్తుంది. మనదేశంలో ఆ పరిస్థితులు లేవు. దేశంలో జరుగుతున్న ఆత్మహత్యల్లో విత్తనాల్లో మోసపోయినవారే అధికశాతం ఉన్నారు. నిజమైన భారతదేశం గ్రామాల్లోనే ఉందని, గ్రామ స్వరాజ్యం సాధించిన రోజే స్వాతంత్ర్య ఫలాలు అందినట్లని మహాత్ముడు చేసిన ప్రవచనం ఈనా టికీ ప్రామాణికమైనదే. మనదేశానికి సేద్యమే జీవనాధారమ న్నారు. వాస్తవాన్ని గ్రహించి పాలకులు ఆ మేరకు అడు గులు వేయాలి. నకిలీ, నాసిరకం వ్యాపారంపై ఉక్కుపాదం మోపుతామని అన్నదాతలను దగా చేస్తే సహించేది లేదని, వాచా వాత్సల్యం చూపుతున్నారు. ఐదేళ్లలో రైతుల ఆదాయం రెట్టింపు చేస్తామని కేంద్ర పెద్దలు ఇచ్చిన హామీలు కాగితాలకే పరిమితమయ్యాయి. ఆదాయం రెట్టింపు సంగతి దేవుడెరుగు పెట్టుబడి మాత్రం మూడు, నాలుగింతలు పెరిగిపోయింది. ఏదిఏమైనా తలతాకట్టుపెట్టి అప్పోసొప్పో చేసి పెట్టుబడి పెట్టి ఫలితం పొందలేక రుణభారంతో కృంగిపోతూ ఇల్లు గడవక, అప్పుపుట్టక దేశంలో ఎన్ని కోట్ల కుటుంబాలు హృదయవేదనతో ఆత్మాభిమానాన్ని చంపుకొని అవమానాలు భరిస్తూ జీవచ్ఛవంలా బతుకు వెళ్లదీస్తున్నాయో చెప్పలేం. పాలకులు అన్నదాతల విషయంలో మనసు పెట్టి ఆలోచించాలి. ఇతరత్రా ఎంత అభివృద్ధి సాధించినా మనిషి జీవనానికి ఆహారం తప్పనిసరి అనే విషయాన్ని విస్మరించరాదు. ఇంతపెద్ద జనాభాకు కావాల్సిన పంటలు రైతుల 'చెమట' పుణ్యమేనని గుర్తుంచుకోవాలి. రైతులు ఆత్మవిశ్వాసం కోల్పోవడం ఏ కోణంలో చూసినా దేశానికి క్షేమంకాదు. వారికున్న ఏకైక ఉపాధి వారి పాలిట మృత్యువుగా పరిణమించకుండా చూడాల్సిన బాధ్యత పాలకుల అందరిపై ఉంది. ●

## ఒక్క మాట

# దేశ రక్షణలో దృఢ కవచం రైల్వే భద్రతా దళం


రామ కిష్టయ్య సంగన భట్ల

ప్రతిసంవత్సరం సెప్టెంబర్ ఇరవై తేదీన రైల్వే భద్రతా దళ వ్యవస్థాపక దినోత్సవాన్ని ఘనంగా జరుపుకుంటారు. ఇది కేవలం ఒక ఆచార పూర్వక ఉత్సవం మాత్రమే కాకుండా, దేశ ప్రజల రక్షణలో ఈ దళం చేసిన సేవలను స్మరించుకునే చారిత్రక సందర్భం. భారతీయ రైల్వేలు దేశ ఆర్థిక వ్యవస్థకు, సామాజిక జీవనానికి వెన్నెముక వంటివి. రోజూ దాదాపు రెండు కోట్లు ముప్పై లక్షల మంది రైళ్లలో ప్రయాణిస్తారు. ఈ విస్తారమైన రవాణా వ్యవస్థ సజావుగా నడవడానికి భద్రత అత్యంత కీలకాంశం. ఆ భద్రతనుకాపాడే బాధ్యతను మోసేది రైల్వే భద్రతా దళమే. రైల్వేభద్రతా దళ చరిత్రను పరిశీలిస్తే ఇది ఒక శతాబ్దానికి పైగా వ్యాపించినదని గ్రహించవచ్చు. 1850ల కాలంలోనే బ్రిటిష్ పాలకులు రైల్వేలు విస్తరించడంతో దొంగతనాలు, దాడులు ఎక్కువ కావడం గమనించి ప్రత్యేక భద్రతా సిబ్బందిని నియమించారు. కాలక్రమేణా ఈ అవసరం మరింత పెరిగింది. చివరకు 1957లో భారత పార్లమెంట్ రైల్వేప్రొటెక్షన్ ఫోర్స్ చట్టాన్ని ఆమోదించి దీనికి చట్టబద్ధ హోదాకల్పించింది. ఆ సమయంలో ప్రధాన కర్తవ్యం రైల్వే ఆస్తులను రక్షించడం మాత్రమే. కానీ ప్రయాణీకుల సంఖ్య పెరుగుతుండటంతో, నేరాల విస్తరణ ఎక్కువ కావడంతో ఈ దళం పనితీరు మరింత విస్తరించింది. 1985లో పార్లమెంట్ చట్ట సవరణల ద్వారా రైల్వే భద్రతా దళం కేంద్ర సాయుధ బలగ హోదాను పొందింది. 1999లో కేంద్రప్రభుత్వం దీనికి పరామిలిటరీ బలగ స్థాయి కల్పించింది. ఈరోజు దాదాపు డెబ్బైఐదు వేలమందికి పైగా సిబ్బందితో ఈ దళం భారతీయ రైల్వేలను కాపాడుతోంది. రైల్వే భద్రతాదళ ప్రధాన బాధ్యత ప్రయాణికులు, వారి ఆస్తులు, రైల్వే ఆస్తులు సురక్షితంగా ఉండేలా చూడడం. రైళ్లలో దొంగతనాలు, దోపిడీలు, మహిళలపై వేధింపులు, స్మగ్లింగ్, మాదక ద్రవ్యాల రవాణా, ఉగ్రవాద కార్యకలాపాలను అరికట్టడం వీరిప్రధాన కర్తవ్యం. మహిళలు, పిల్లలు, వృద్ధుల రక్షణకు ప్రత్యేక శ్రద్ధ చూపుతూ ఆపరేషన్ యాత్రి సురక్ష, మెరా సురక్షా, సురక్షిత్ సఫర్‌వంటి ప్రత్యేక కార్యక్రమాలను అమలు చేస్తున్నారు. తప్పిపోయిన పిల్లలను కనుగొని తల్లిదండ్రులకు అప్పగించడం, రైల్వే ప్రాంగణంలో నిరుపేదలకు సహాయం చేయడం వంటి మానవతా సేవలను కూడా ఈ దళం చేస్తోంది. రైల్వే పట్టాలు, స్టేషన్లు, సిగ్నలింగ్ వ్యవస్థలు వంటి ఆస్తులను విధ్వంసక చర్యల నుండి కాపాడడం కూడా వీరి ప్రధాన కర్తవ్యాల్లో ఒకటి. ఆధునిక సాంకేతిక పరిజ్ఞానం అందుబాటులోకి రావడంతో రైల్వే భద్రతా దళం తన పనితీరులో విప్లవాత్మక మార్పులు తెచ్చుకుంది. సీసీటీవీ పర్యవేక్షణ, ఆధునిక ఆయుధాలు, కుక్కలదళం, సైబర్ నేరాల పర్యవేక్షణ వంటి ఆధునిక పద్ధతులు వినియోగిస్తున్నారు. ఉగ్రవాద ముప్పులు, బాంబు బెదరింపులు వంటి పరిస్థితులను ఎదుర్కోవడంలో వీరి పాత్ర విశేషం. రైల్లో ప్రమాదాలు సంభవించినప్పుడు ప్రాణాలను రక్షించడం, బాధితులకు సహాయం చేయడం, ప్రజలను సురక్షిత ప్రాంతాలకు తరలించడవంటి బాధ్యతలనుకూడా వీరు నిర్వర్తిస్తున్నారు. వ్యవస్థాపక దినోత్సవం సందర్భంగా దేశవ్యాప్తంగా ఈ దళం ఘనంగా వేడుకలు జరుపుకుంటుంది. ప్రధాన కార్యాలయం నుండి జోనల్ కార్యాలయాల వరకు కవాతులు, విన్యాసాలు, సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహిస్తారు. విధుల్లో విశేష సేవలు అందించిన సిబ్బందికి పతకాలు, బహుమతులు ప్రదానం చేస్తారు. భారతీయ రైల్వేలు ప్రతిరోజు కోట్లాదిమంది ప్రయాణికుల జీవితాన్ని ముడిపెట్టుకున్నాయి. ఈవిస్తారమైన వ్యవస్థ కాపాడే రైల్వే భద్రతా దళంప్రాముఖ్యత అపరిమితమైనది. ప్రజల భద్రత -దేశ భద్రత అన్న నినాదంతో క్రమశిక్షణ, ధైర్యం, సేవాతపనలతో పనిచేస్తూ ఈదళం దేశానికి రక్షణ కవచంగా నిలుస్తోంది. ●

# కేన్సర్ పై యుద్ధం ప్రకటనకే పరిమితం కావొద్దు

పి.వి.రావు

రాష్ట్రంలో క్యాన్సర్‌పై యుద్ధం ప్రకటించామని తెలంగాణ రాష్ట్ర, వైద్య ఆరోగ్య శాఖ మంత్రి దామోదర రాజనర్సింహ ప్రకటించటం హర్షించదగ్గ విషయం. క్యాన్సర్ మహమ్మారి దేశంలో, రాష్ట్రంలో క్రమక్రమంగా పెరుగుతుంది. సంగారెడ్డి మెడికల్ కళాశాల నుంచి రాష్ట్రవ్యాప్తంగా ఉన్న 34 మెడికల్ కళాశాలలో క్యాన్సర్ డే కేర్ సెంటర్లను వర్చువల్‌గా ప్రారంభించిన ఆయన పైప్రకటన చేశారు. ఇది ప్రకటనలకే పరిమితం కాకుండా క్యాన్సర్ రోగులకు గరిష్ట ప్రయోజనం కలిగేలా యంత్రాంగాన్ని సమాయత్త పర్చాల్సిన అవసరం ఉంది. 2030 నాటికి ప్రపంచ వ్యాప్తంగా మరణాలకు క్యాన్సర్ ప్రధాన కారకంగా మారుతుంది అనేది అనేక సర్వేలు వెల్లడిస్తున్నాయి. ఈ నేపథ్యంలో క్యాన్సర్‌పై తెలంగాణ ప్రభుత్వం ప్రత్యేక దృష్టిపెట్టినట్టు కనిపిస్తోంది. ఇప్పుడు అందుతున్న సమాచారం ప్రకారం రాష్ట్రంలో50 వేల మంది వివిధ రకాల క్యాన్సర్లతో బాధపడుతున్నట్లు తెలుస్తోంది. రానున్న కొద్ది రోజుల్లో ఈ సంఖ్య 70వేలకు పెరుగుతుందన్న విష యం ఆందోళన కలిగించక మానదు. వ్యాధిని ప్రారంభ దశలోనే గుర్తించడంద్వారా అది మరింత ముదురిపోయి ప్రాణాంతకంగా మారకుండా చూసుకునే అవకాశం కలుగుతుంది. ఆదిశగా తెలంగాణ వైద్య, ఆరోగ్యశాఖ అడుగు లేయడం మంచి పరిణామం. రాష్ట్రంలోని అన్ని గ్రామాలకు మొబైల్ క్యాన్సర్ స్క్రీనింగ్ వాహనాలను పంపి స్క్రీనింగ్ నిర్వహించే ప్రక్రియకు శ్రీకారం చుట్టబోతోంది. ఇది ఎంత తొందరగా ప్రారంభమైతే అంతమంచిది. రాష్ట్రంలో ప్రస్తుతం నిమ్స్, ఎంజీఎం ఆసుపత్రులలో 80 పడకల క్యాన్సర్ ప్రత్యేక విభాగాలు కొనసాగుతున్నాయి. ఇది కాక త్వరలో మహబూబ్‌నగర్, ఖమ్మం, సంగారెడ్డి, వరంగల్ జిల్లాలలో రేడియేషన్ బంకర్లతో కూడిన క్యాన్సర్ సెంటర్లను ఏర్పాటు చేసేందుకు వైద్య ఆరోగ్యశాఖ సిద్ధమవుతోంది. క్యాన్సర్ సోకిందంటే ఆస్తులు అమ్ముకోవాల్సిందే అనిదిగాలు పడే కుటుంబాలకు ప్రభుత్వం తీసుకున్న నిర్ణయాలు కొండంత అండగా చెప్పుకోవచ్చు. దేశంలో ప్రతి ఏటా 15.6 లక్షల మంది వివిధ క్యాన్సర్ల బారిన పడుతున్నారు. అందులో పది లక్షల మంది మృత్యుఒడిలోకిచేరుతున్నారు. తెలంగాణలో కూడా క్యాన్సర్ రోగలసంఖ్య పెరుగుతుండటం, మరణాల సంఖ్య కూడా అధికంగా కనిపిస్తుంటడంతో ప్రభు త్వం దీనిపై ప్రత్యేక చొరవ చూపిస్తోంది. రాష్ట్రం నుండి క్యాన్సర్ మహమ్మారిని తరిమికొట్టేందుకు ప్రపంచ ప్రఖ్యాత క్యాన్సర్ నిపుణుడు నోరిదత్తాత్రేయుడిని ప్రభుత్వం సలహా దారుగా నియమించుకుంది. ఆయన సలహా సూచనలతో క్యాన్సర్‌పై సమరానికి విధి విధానాల రూపకల్పనకు



ప్రభు త్వం ఓ ముందడుగు వేసింది. ఈ సందర్భంగా దత్తాత్రేయుడు చేసిన కొన్ని సూచనలు చాలా విలువైనవిగా కన్పి స్తున్నాయి. క్యాన్సర్‌ను 'నోటిఫైబుల్ డిసీజ్'గా గుర్తిస్తూ ప్రభుత్వం వెంటనే ఒక ప్రకటన చేయాలన్నారాయన. దీనివల్ల వ్యాధి బారినపడిన వారిని గుర్తించి సమాచారం సేక రించడానికి ఉపయోగపడుతుందన్నారు. అంతేకాదు క్యాన్సర్ నివారణ, చికిత్సలకు ప్రాంతీయ ప్రణాళికలు అవసరమన్నారు. రాష్ట్రంలోని ప్రభుత్వ ,ప్రైవేటు ఆసుపత్రిలలో అందుబాటులో ఉన్న క్యాన్సర్ పరీక్ష చికిత్స సేవలు ఇతర సమాచారంతో డాష్‌బోర్డ్ ఏర్పాటు చేయాలని కూడాదత్తాత్రేయుడు సూచించారు. రాష్ట్ర ప్రభుత్వం ఈసూచనలను పరిగణలోకి తీసుకొని ఆచరణలో పెట్టగలిగితే రాష్ట్ర ప్రభుత్వం ఆశించిన లక్ష్యం కొంతలో కొంత ఫలిస్తుంది. విషయం ఏమంటే దేశంలో రెండు మూడు రాష్ట్రాలు తప్ప చాలా రాష్ట్రాలు క్యాన్సర్‌ను 'నోటిఫయబుల్'గా ప్రకటించలేదు. అయితే ఇటీవల పార్లమెంటు స్థాయి సంఘం ఈ అంశాన్ని కేంద్రానికి సిఫార్ చేయడం శుభపరిణామం. రాష్ట్రప్రభుత్వం కూడా వెంటనే దీనిపై ఒక ప్రకటన చేయాల్సిన అవసరం ఉంది. దీనివల్ల కొత్త కేసులు నమోదైనప్పుడు డయాగ్నస్టిక్స్ సెంటర్లు, ఆసుపత్రులు ఆ విషయాన్ని ప్రభుత్వం దృష్టికి తీసుకొస్తాయి. పూర్తి వివరాలు ప్రభుత్వం దగ్గర ఉంటే క్యాన్సర్ కమాండ్ అండ్ కంట్రోల్ సెంటర్‌ని ఏర్పాటు చేసుకుని సమన్వయం చేసుకునే అవకాశం ప్రభుత్వానికి కలుగుతుందని నిపుణులు చెప్తున్నారు. దేశంలో రాష్ట్రంలోమహిళల్లో రొమ్ము క్యాన్సర్ అనేది బాగా విస్తరిస్తుంది. దేశంలో వచ్చే క్యాన్సర్లలో దాదాపు 30శాతం రొమ్ము క్యాన్సర్లే అనికూడా ఒక నివేదికలో వెల్లడైంది. గత పదేళ్ల కాలంలో పెద్ద పేగు క్యాన్సర్లు బాగా పెరిగిపోయాయి. గతంలో ఏడవ అత్యంత సాధారణ క్యాన్సర్‌గా పరిమితమైన ఈ క్యాన్సర్ ఇప్పుడు మూడవ స్థానానికి ఎగబాకటం ఆందోళన కలిగించే అంశం. యువతలో పెద్దపేగు క్యాన్సర్ ఈమధ్య బాగా బయటపడుతుందని వైద్య నిపుణులు చెప్తున్నవిషయం మరింత కలవరపెడుతుంది. 40ఏళ్ల వయస్సు ఉన్నజనాభాలో నోటి క్యాన్సర్ కూడా ఇప్పుడు బాగా ప్రభలుతోంది. జీవన విధానం, ఆహారపు అలవాట్లు, పొగాకు వినియోగం, ఇతర అలవాట్లు వివిధ రకాల క్యాన్సర్లకు కారణమవుతున్నాయి. క్యాన్సర్లను గుర్తించడం, చికిత్సలు అందించడం క్యాన్సర్ బారిన పడిన వారిని రక్షించడమేకాదు, క్యాన్సర్‌పై ప్రజల్లో విస్తృత అవగాహన కల్పించడంకూడా యుద్ధప్రాతిపదికన చేయాలి. వంద కంటే ఎక్కువ రకాల క్యాన్సర్లు ఇప్పుడు మానవులను ప్రభావితం చేస్తున్న రోజుల్లో నిజంగా రాష్ట్రప్రభుత్వం క్యాన్సర్ పై యుద్ధం ప్రకటించడం అనివార్యమే. భారతదేశంలోని ప్రధాన క్యాన్సర్ సంస్థఅయిన ఢిల్లీ ఎయిమ్స్ ఆధ్వర్యంలో హర్యానాలోని ఝుజ్జర్‌లో 2,035 కోట్లవ్యయంతో నేషనల్ క్యాన్సర్ ఇనిస్టిట్యూట్‌ను స్థాపించింది. క్యాన్సర్ పరిశోధన, నివారణ, అత్యాధునిక చికిత్సలు అందించడం దీనిలక్ష్యంగా ఉంది. క్యాన్సర్ రహిత రాష్ట్రంగా తెలంగాణను తీర్చిదిద్దుకోవాలంటే ఈతరహా ఇనిస్టిట్యూట్ ఏర్పాటుకు పూనిక వహించాలి. నోరి దత్తాత్రేయుడిని సలహాదారునిగా నియమించుకోవడమే కాదు ఆయన నేతృత్వంలో ఈతరహా ఇనిస్టిట్యూట్‌ను నెలకొల్పుకుని దేశానికే మార్గదర్శకంగా నిలవాలి. ●

# అఫ్ఘానిస్థాన్‌లోని ఎయిర్‌బేస్ మళ్లీ తీసుకుంటాం

## చైనాను కట్టడి చేసేందుకే వ్యూహం: ట్రంప్

**వాషింగ్టన్, సెప్టెంబరు 19:** అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ సంచలన వ్యాఖ్యలు చేశారు. అఫ్గానిస్థాన్‌లోని బగ్రామ్ వైమానిక స్థావరానికి మళ్లీ అమెరికా సైన్యాన్ని పంపే అంశంపై కసరత్తు చేస్తున్నామని ఆయన వెల్లడించారు. అఫ్గాన్ సమీపంలోని తమ ప్రత్యర్థి చైనాకు కౌంటర్ చేసేందుకే ఈ ఆలోచన చేస్తున్నట్లు తెలిపారు. యూకే పర్యటనను ముగిస్తున్న సందర్భంగా బ్రిటన్ ప్రధానమంత్రి కీర్ స్టార్మర్‌తో కలిసి నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఈవిషయాన్ని ట్రంప్ వెల్లడించారు. అఫ్గానిస్థాన్‌లోని బగ్రామ్ వైమానిక స్థావరాన్ని తిరిగి పొందేందుకు ప్రయత్నాలు చేస్తున్నామని చెప్పారు. దీన్నొక బ్రేకింగ్ న్యూస్‌గా ఆయన అభివర్ణించారు. ఉక్రెయిన్‌పై రష్యా దండయాత్ర ఎప్పటిలోగా ముగిసే అవకాశం ఉందని విలేకరులు అడిగిన ప్రశ్నకు బదులిస్తూ, ట్రంప్ ఈ వ్యాఖ్యలు చేయడం గమనార్హం. తాలిబన్ పాలకులకు అమెరికాతో చాలా పనులు ఉన్నాయని, అందుకే తాము బగ్రామ్ వైమానిక స్థావరాన్ని తిరిగి పొందాలని భావిస్తున్నామని వెల్లడించారు. ఆర్థిక, సైనిక రంగాల్లో అమెరికాతో పోటీపడుతున్న చైనాకు సమీపంలో ఉన్నందు వల్ల ఆ ఎయిర్‌బేస్‌కు ఎక్కువ ప్రాధాన్యం ఉందని ట్రంప్ పునరుద్ఘాటించారు. చైనా అణ్వాయుధాలు తయారుచేసే యూనిట్‌కు కేవలం గంట దూరంలో ఉండటం వల్ల కూడా తాము బగ్రామ్ ఎయిర్‌బేస్‌ను కోరుకుంటున్నామని చెప్పారు. ఇప్పుడు చాలా కొత్తకొత్త విషయాలు



జరుగుతున్నాయని ఆయన వ్యాఖ్యానించారు. మాజీ అధ్యక్షుడు జో బైడెన్ వైఫల్యం వల్లే అఫ్గానిస్థాన్‌లో అమెరికా సమర్థిత ప్రభుత్వం కూలిపోయింది. నేను చేసిన తరహా పనులేవీ బైడెన్ చేయలేకపోయారు. కనీసం అమెరికా నాయకత్వాన్ని కూడా ఆయన గౌరవించలేదు. పుతిన్ విషయానికొస్తే, రష్యా గతంలో అకారణంగా అఫ్ఘనిస్తాన్‌ను సర్వనాశనం చేసింది. కానీ మేం వాళ్లను గౌరవంగా వదిలేశాం. ప్రపంచంలోనే అతిపెద్ద బగ్రామ్ ఎయిర్ బేస్‌ను ఉచితంగానే ఆఫ్ఘనిస్తాన్‌కు ఇచ్చాం. త్వరలో మేం మళ్లీ దాన్ని తీసుకుంటాం. రన్‌వే బలం, విస్తీర్ణం విషయాల్లో ఆ వైమానిక స్థావరం చాలా శక్తివంతమైంది. అక్కడ ఏదైనా ల్యాండ్ చేయొచ్చు. పెద్ద గ్రహాన్ని కూడా ఆ ఎయిర్ బేస్‌పై దింపొచ్చు. బైడెన్ అసమర్థత వల్లే గతంలో బగ్రామ్ వైమానిక స్థావరాన్ని అమెరికా ఆర్మీ వదులుకుందని ట్రంప్ పేర్కొన్నారు. బగ్రామ్ ఎయిర్ బేస్‌కు సంబంధించి ట్రంప్ చేసిన ఈ వ్యాఖ్యలపై అమెరికా వైట్‌హౌస్ ఇంకా స్పందించలేదు. ఆ వైమానిక స్థావరాన్ని తిరిగి పొందేందుకు వైట్‌హౌస్ లేదా పెంటగాన్ (అమెరికా రక్షణ విభాగం) ఏదైనా ప్లాన్‌ను రెడీ చేశాయా అని విలేకరులు అడిగిన ప్రశ్నకు బదులివ్వలేదు. దీనిపై ఆఫ్ఘనిస్తాన్‌లోని తాలిబన్ ప్రభుత్వంతో అమెరికా ప్రత్యక్షంగా లేదా పరోక్షంగా చర్చలు జరుపుతోందా లేదా అనేది తెలియరావడం లేదు. అయితే 2021లో అధికారంలోకి వచ్చినప్పటి నుంచి ఆర్థిక సంక్షోభం, అంతర్జాతీయ గుర్తింపు లభించకపోవడం, అంతర్గత సైనిక తిరుగుబాట్ల తలనొప్పిని తాలిబన్ సర్కారు ఎదుర్కొంటోందని ట్రంప్ చెబుతున్నారు. ఈ కారణాలతోనే మళ్లీ అమెరికాకు బగ్రామ్ ఎయిర్ బేస్‌ను అప్పగించేందుకు తాలిబన్లు సిద్ధమై ఉండొచ్చనే అంచనాలు వెలువడుతున్నాయి.



# కృత్రిమమేథలో లక్షకోట్ల డాలర్ల ప్రయోజనం

## మోర్గాన్ స్టాన్లీ సమగ్ర అధ్యయనం



**వాషింగ్టన్, సెప్టెంబరు 19:** కృత్రిమ మేథ(ఏఐ) ప్రపంచవ్యాప్తంగా వ్యాపార, ఉద్యోగ రంగాల్లో పెను మార్పులు తెచ్చిపెడుతుందని ప్రముఖ ఆర్థిక సేవల సంస్థ మోర్గాన్ స్టాన్లీ తన అధ్యయన నివేదికలోస్పష్టం చేసింది. ఏఐ వాడకం వల్ల ఆర్థిక వ్యవస్థకు ట్రిలియన్ల డాలర్ల ప్రయోజనం చేకూరనుండగా, దాదాపు 90 శాతం ఉద్యోగాల తీరుతెన్నులు మారిపోతాయని అంచనా వేసింది. సంస్థ అధ్యయనం ప్రకారం ఎస్అండ్‌పీ 500 సూచీ(అమెరికా స్టాక్ మార్కెట్‌లో లిస్ట్ అయిన 500 కంపెనీలు) లోని కంపెనీలు పూర్తిస్థాయిలో ఏఐని విని యోగిస్తే ఏటా సుమారు 920 బిలియన్ డాలర్ల నికర ప్రయోజనం పొందవచ్చు. ఇందులో అధిక భాగం, అంటే 490 బిలియన్ డాలర్లు మానవ ప్రమేయం లేకుండానే నిర్ణయాలు తీసుకుని పను లు పూర్తిచేసే 'ఏజెటిక్ ఏఐ' సాఫ్ట్‌వేర్ల ద్వారా సమకూరుతుందని పేర్కొంది. మిగిలిన 430 బిలియన్ డాలర్లు హ్యూమనాయిడ్ రోబోల వంటి 'ఎంబాడీడ్ ఏఐ' ద్వారా లభిస్తుందని వివరించింది. ఈ ఉత్పాదకత విప్లవం దీర్ఘకాలంలో ఎస్అండ్‌పీ 500 మార్కెట్ విలువను ఏకంగా 13 నుంచి 16 ట్రిలియన్ డాలర్ల మేర పెంచగలదని అంచనా వేసింది. ఉద్యోగాల భవిష్యత్తుపై ఈ నివేదిక ఆసక్తికరమైన విశ్లేషణను అందించింది. ఏఐ వల్ల ఉద్యోగాలకు ముప్పు వాటిల్లుతుందన్న ఆందోళనల నడుమ, సానుకూల దృక్పథాన్ని ప్రదర్శించింది. ఏఐ వల్ల కొన్ని పనులు ఆటోమేషన్ పరిధిలోకి వెళ్లినా, అనేక కొత్త ఉద్యోగాలు పుట్టుకొస్తాయని తెలిపింది. ఈ అంశంపై మోర్గాన్ స్టాన్లీ అమెరికా ఆర్థికవేత్త హీథర్ బెర్గర్ మాట్లాడుతూ కొన్ని ఉద్యోగాలు ఆటోమేషన్ బారిన పడినా, ఏఐ సాయంతో మరికొన్ని ఉద్యోగాల సామర్థ్యం పెరుగుతుంది. అంతేకాదు, ఏఐ పూర్తిగా కొత్త తరహా ఉద్యోగాలను కూడా సృష్టిస్తుందని వివరించారు. ప్రధానంగా మూడు రంగాల్లో ఏఐ విప్లవాత్మక మార్పులు తీసుకురానుందని మోర్గాన్ స్టాన్లీ గుర్తించింది. రిటైల్, వినియోగ వస్తువుల పంపిణీ, రియల్ ఎస్టేట్ నిర్వహణ, రవాణా రంగాలపై దీని ప్రభావం అధికంగా ఉండనుంది. రిటైల్‌లో సప్లైచైన్ నిర్వహణ నుంచి మొద లుకొని, రియల్ ఎస్టేట్‌లో హ్యూమనాయిడ్ రోబోల సహాయం, రవాణాలో అటానమస్ డెలివరీ వ్యవస్థల వరకు ఏఐ వినియోగం గణనీయంగా పెరగనుందని నివేదిక పేర్కొంది.

# మా ప్రధాన స్థావరం ధ్వంసం నిజమే: లష్కరే కమాండర్ అంగీకారం

**ఇస్లామాబాద్, సెప్టెంబరు 19:** ఇన్నాళ్లూ ఆపరేషన్ సిందూర్‌లో తమ పౌరులపై భారత్ దాడి చేసిందని పాక్ చెబుతున్నవన్నీ కట్టుకథలే అని తేలిపోతోంది. తాజాగా లష్కరే తయ్యిబా (ఎల్ఇటి) టాప్ కమాండర్ ఒకరు ఈ విషయాన్ని అంగీకరించారు. దీనిని సంబంధించిన విడియో వైరల్‌గా మారింది. దీనిలో లష్కరే కమాండర్ ఖాసిమ్ మాట్లాడుతూ మే 7వ తేదీన ఆపరేషన్ సిందూర్ సందర్భంగా మురిద్కేలో దెబ్బతిన్న ప్రధాన కార్యాలయాన్ని గతంలో కంటే భారీగా నిర్మిస్తామని పేర్కొన్నాడు. 'నేను మురిద్కేలో భారత్ జరిపిన దాడిలో ధ్వంసమైన మర్కజ్ తయ్యిబా శిథిలాలపై ఉన్నారు. దేవుడి దయ వల్ల గతంలో కంటే భారీగా నిర్మిస్తాం' అని తెలిపాడు. ధ్వంసమైన భవనంలో గతంలో చాలా మంది ముజాహిద్దీన్‌లు (ఉగ్రవాదులు) శిక్షణ పొందినట్లు వెల్లడించారు. మరో విడియోలో ఇదే ఉగ్రవాది పాకిస్థానీ యువత ఇక్కడ ఉగ్రశిక్షణ (దౌరా ఇ సుఫా)లో భాగం కావాలని కోరారు. దీనిలో మతం, జిహాదీ శిక్షణ ఇస్తారు.

మరో విడియోలో లష్కరే డిప్యూటీ చీఫ్ సైఫుల్లా కసూరీ మాట్లాడుతూ పాకిస్థాన్ ప్రభుత్వం, సైన్యం తమకు ఉగ్రస్థావరాలు పునర్ నిర్మాణానికి నిధులు ఇచ్చినట్లు వెల్లడించారు. భారత్ ఆపరేషన్ సిందూర్‌లో ధ్వంసం చేసిన తొమ్మిది ఉగ్ర శిబిరాల్లో మురిద్కే క్యాంప్ కూడా ఒకటి. పహల్గాంలో 26 మంది



అమాయకులను ఉగ్రవాదులు హత్య చేయడానికి ప్రతీకారంగా భారత్ ఈ దాడులు చేపట్టింది.

మరోవైపు పాకిస్థాన్‌లోని ఉగ్ర సంస్థలు 2026 ఫిబ్రవరి 5న కాశ్మీర్‌లోని సంఘీభావ దినోత్సవంపై దృష్టి పెట్టినట్లు భారత నిఘా వర్గాలు పసిగట్టాయి. అప్పటికల్లా మురిద్కేలోని ఉగ్ర కాంప్లెక్స్‌ను పునర్ నిర్మించి సభ నిర్వహించాలని భావిస్తున్నట్లు తెలుస్తోంది. ఇక్కడ నిర్మించబోయే భవనమే మరోసారి ఉగ్రశిక్షణ, ఆపరేషనల్ ప్లానింగ్‌కు కేంద్రంగా మారనుంది. ఇటీవల జైషే కమాండర్ ఇలియాస్ కాశ్మీర్ కూడా ఓ ప్రసంగంలో మాట్లాడుతూ సిందూర్‌లో మసూద్ అజర్ కుటుంబం చిన్నాభిన్నమైందని అంగీకరించిన విషయం తెలిసిందే.

# పాక్-సౌదీ రక్షణ ఒప్పందంలోకి మరిన్ని దేశాలు



**ఇస్లామాబాద్, సెప్టెంబరు 19:** సౌదీతో తమ దేశం కుదుర్చుకున్న రక్షణ ఒప్పందంలోకి మరిన్ని దేశాలు చేరే అవకాశం ఉందని పాక్ రక్షణ మంత్రి ఖవాజా ఆసిఫ్ వెల్లడించారు. ఇందుకు గల అవకాశాలను తాము మూసివేయలేదని పేర్కొన్నారు. అరబ్ దేశాలు కూడా ఈ డీల్‌లో భాగం అవుతాయా? అని జియో న్యూస్ విలేకరి అడిగిన ప్రశ్నకు ఆయన స్పందించారు. 'ముందస్తుగా దీనికి నేనేమీ సమాధానం చెప్పలేను. కానీ, ద్వారాలు మూసుకుపోలేదని కచ్చితంగా చెప్పగలను' అని ఆయన వెల్లడించారు. పాకిస్థాన్‌కు బలహీనతలు ఉండటంతో నాటో వంటి ఏర్పాట్లు ఉండాలని తాను చాలాకాలంగా చెబుతున్నానన్నారు. ముఖ్యంగా ముస్లిం ప్రజలు, దేశాలు ఉన్నచోట సమష్టిగా దేశాలను కాపాడుకోవాల్సిన అవసరం ఉందని పేర్కొన్నారు.

ఇక తాజాగా సౌదీతో చేసుకొన్న ఒప్పందంలో మూడో దేశం చేరకుండా లేదా మరో దేశంతో ఇలాంటి అగ్రిమెంట్ చేసుకోకూడదని ఎటువంటి క్లాజు లేదని ఆసిఫ్ చెప్పారు. ఈ ఒప్పందం కింద అణ్వాయుధాలు వాడకూడదన్న నిబంధనేమీ లేదన్నారు. తమకు ఉన్న అన్ని సామర్థ్యాలను వినియోగిస్తామని చెప్పారు. తమ దేశం అణ్వాయుధ తనిఖీలకు ఎప్పుడూ సహకరిస్తుందని నిబంధనల ఉల్లంఘనలకు పాల్పడదని పేర్కొన్నారు. అయితే ఇది కేవలం రక్షణాత్మక ఒప్పందం మాత్రమే అని పేర్కొన్నారు. చాలా యేళ్లుగా తాము సౌదీ సైనికులకు శిక్షణ ఇస్తున్న విషయాన్ని గుర్తు చేశారు. దానికి పొడిగింపుగా ఈ ఒప్పందాన్ని వర్ణించారు. ఇరు దేశాల్లో దేనిపై దాడి జరిగినా సమష్టిగా ఎదుర్కొంటాయని అన్నారు. ఇక అఫ్ఘానిస్థాన్ అమెరికా వీడి వెళ్లిపోయాక ఆ పరిణామాలను తాము అనుభవిస్తున్నామని ఆసిఫ్ వెల్లడించారు. పాకిస్థాన్-సౌదీ అరేబియా మధ్య ఇటీవల ఓ రక్షణ ఒప్పందం జరిగింది. దీని ప్రకారం ఇరువురిలో ఏ దేశంపై దాడి జరిగినా రెండింటిపై దాడిగా భావించి ఎదుర్కొంటారు. కొన్ని నెలల క్రితం భారత్-పాక్ మధ్య ఉద్రిక్తతలు చోటుచేసుకున్న సంగతి తెలిసిందే. పహల్గాం ఉగ్రదానికి బదులుగా మన బలగాలు పాక్‌లోని ఉగ్రమూకలను మట్టుబెట్టాయి. దాని తర్వాత రెండు దేశాల మధ్య కొన్నిరోజుల పాటు ఘర్షణ జరిగింది. ఈ నేపథ్యంలో ఒప్పందం జరగడం ప్రాధాన్యం సంతరించుకుంది.

# గాజాపై భద్రతా మండలిలో తీర్మానాన్ని అడ్డుకున్న అమెరికా

**న్యూయార్క్, సెప్టెంబరు 19:** ఐక్యరాజ్యసమితి భద్రతా మండలిలో ప్రవేశపెట్టిన గాజాలో తక్షణ కాల్పుల విరమణ తీర్మానాన్ని అమెరికా అడ్డుకుంది.వీటో చేయడంతో ఆతీర్మానం వీగిపోయింది. భద్రతా మండలిలో తక్షణమే కాల్పులు విరమణ పాటించాలని, శాశ్వతప్రాతిపదికన ఈ విరమణ ఉండాలని, అలాగే అదుపులోకి తీసుకున్న గాజా వాసులను వెంటనే విడుదలచేయాలని ప్రతిపాదించిన తీర్మానాన్ని అమెరికా మోకాలొడ్డింది.తనకున్న విటో అధికారాన్ని ఉపయోగించింది. సమితి భద్రతామండలిలోని మరో 14 మంది సభ్యులు ఈ తీర్మానానికి మద్దతుగా ఓటు వేసారు. అన్ని ఆంక్షలను వెంటనే ఎత్తివేసి మానవతా సాయం అందించాలని, 2.1 మిలియన్ల పాలస్తీనియన్లకు ఆహారం అం దించాలని తీర్మానం ప్రవేశపెట్టారు. అయితే ఈతీర్మానంలో హమాస్ వైఖరిని ఖండించిన దాఖలాలు లేవని అందుకే వీటో చేసినట్లు అమెరికా చెపుతోంది. రెండేళ్లుగా కొనసాగుతున్న గాజా యుద్ధంలో అమెరికా, ఇజ్రాయెల్ రెండూ కూడా ప్రపంచదేశాల విజ్ఞప్తులను పెడచెవినపెడుతూ వచ్చాయి. యూఎన్ సర్వప్రతి నిధుల సభకు కొన్ని రోజులు ముందే ఈ తీర్మానం వీగిపోవడంపై ఇపుడు తీవ్రస్థాయిలో చర్చకు దారితీసింది. అమెరికా మిత్రదేశాలు కొన్ని ఇప్పటికే పాలస్తీనాను స్వతంత్ర దేశంగా గుర్తించాలని




యత్నిస్తున్నాయి. 5 దేశాల సభ్యత్వం గల ఐక్యరాజ్యసమితి భద్రతా మండలిలో 14 దేశాలు అనుకూలంగా ఓటు వేయగా అగ్రరాజ్యం మాత్రమే వ్యతిరేకించింది. దీంతో ఈ తీర్మానం వీగిపోయింది. గాజాలో మారణ హోమం ఆపాలని, వెంటనే యుద్ధానికి ముగింపు పలకాలని డిమాండ్ చేస్తూ భద్రతా మండలి తీర్మానం చేసింది. అయితేదీనిని అమెరికా తీవ్రంగా వ్యతిరేకించింది.ఆమోదయోగ్యం కాని ఈ తీర్మానాన్ని అమెరికా తిరస్కరిస్తున్నదని భద్రతా మండలిలో యూఎస్ కౌన్సెలర్ మోర్గాన్ ఓర్టాగస్ వెల్లడించారు.

# భారీ డ్రోన్లపై కిమ్ దృష్టి..

## ఇకపై కృత్రిమ మేథను వాడాలని ఆదేశాలు

**ప్యాంగ్‌యాంగ్, సెప్టెంబరు 19:** అత్యాధునిక ఆయుధాల అభివృద్ధి పనులు సజావుగా సాగుతోందో, లేదోనని ఉత్తరకొరియా అధ్యక్షుడు కిమ్ జోంగ్ ఉన్ మరోసారి తనిఖీలు చేశారు. తాజాగా రాజధాని ప్యాంగ్‌యాంగ్‌లోని అన్‌మ్యాన్డ్ ఏరోనాటికల్ టెక్నాలజీ కాంప్లెక్స్‌ను ఆయన కీలక అధికారులతో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా మల్టీపర్పస్ డ్రోన్ల, మానవరహిత నిఘా విమానాల పనితీరు పరీక్షలను నిర్వహించారు. ఈ విషయాన్ని కొరియన్ సెంట్రల్ న్యూస్ ఏజెన్సీ శుక్రవారం వెల్లడించింది. సరికొత్తగా అందుబాటులోకి వచ్చిన కృత్రిమ మేథ టెక్నాలజీని వేగంగా అందిపుచ్చుకోవడమే తొలి ప్రాధాన్యం కావాలని కిమ్ పేర్కొన్నారు. మానవ రహిత ఆయుధ వ్యవస్థలను పెంచడానికి ఇది చాలా కీలకమని అభిప్రాయపడ్డారు. కొంతకాలం క్రితమే ఆయన ఘన ఇంధన రాకెట్ పరీక్షలను కిమ్ పర్యవేక్షించారు. దీనిని ఖండాంతర బాలిస్టిక్ క్షిపణుల్లో వినియోగించనున్నారు. ఇది ఉత్తరకొరియా అణుశక్తి విస్తరణలో అత్యంత కీలకమైందని పేర్కొన్నారు. ప్రస్తుతం ఆ దేశం వద్ద బాలిస్టిక్, క్రూజ్ మిస్సైల్స్ సహా అణుక్షిపణులు ఉన్నాయి. ఇటీవల నిఘా ఉపగ్రహాల తయారీపై పనిచేస్తోంది.

**రష్యాకు భారీగా సాయం..**

ఉక్రెయిన్‌పై యుద్ధం కోసం ఉత్తర కొరియా నుంచి రష్యాకు భారీగా సాయం అందింది. వీటిల్లో ఆయుధాలు, సైనికులు ఉన్నట్లు జర్మనీకి చెందిన 'ది ఫ్రెడ్రిక్ న్యూమన్న ఫౌండేషన్ ఫర్ ఫ్రీడమ్' అనే సంస్థ ఇచ్చిన నివేదిక పేర్కొంది. ప్యాంగ్‌యాంగ్ నుంచి మాస్కోకు అందిన ఆయుధాలు, మందుగుండు విలువ 9.8 బిలియన్ డాలర్లు ఉంటుందని అంచనా వేసింది. దీనికి అదనంగా సైనికులను పంపిందని పేర్కొంది. దీనికి ప్రతిగా రష్యా నుంచి ఆహారం, చమురు, ఎయిర్ డిఫెన్స్ వ్యవస్థలు, జీపీఎస్ జామర్ల రూపంలో 1.2 బిలియన్ డాలర్ల వస్తువులు మాత్రమే వచ్చినట్లు తెలిపింది. వీటిల్లో ఫైటర్ జెట్లు కూడా ఉండే అవకాశం ఉందని చెప్పింది.

# పాక్ సొంత ఇల్లులా ఉంది

## శామ్ పిట్రోడా వివాదాస్పద వ్యాఖ్యలు



**న్యూఢిల్లీ, సెప్టెంబరు 19:** కాంగ్రెస్ పార్టీ ఓవర్సీస్ చైర్మన్ శామ్ పిట్రోడా మరోసారి వార్తల్లో నిలిచారు. పొరుగు దేశాలకు ప్రాధాన్య మిచ్చేలా మన విధానాలు ఉండాలని సూచించిన ఆయన పాకిస్థాన్‌కు వెళ్లినప్పుడు తనకు సొంత ఇంట్లో ఉన్న భావన కలిగిందంటూ వివాదాస్పద వ్యాఖ్యలు చేశారు. మీడియా సంస్థతో మాట్లాడుతూ సొంత పార్టీని ఇరకాటంలో పెట్టారు. మన విదేశాంగ విధానంలో మొదట మన పొరుగుదేశాలపై దృష్టి పెట్టాలన్నది నా అభిప్రాయం. పొరుగుదేశాలతో మనం సంబంధాలను గణనీయంగా మెరుగుపర్చుకోగలమా? ఇక్కడ మీకో విషయం చెప్పాలని అనుకుంటున్నాను. పాకిస్తాన్‌కు వెళ్లినప్పుడు ఇంట్లో ఉన్న భావన కలిగిందని రాహుల్ గాంధీ ఎంతో ఇష్టపడే వ్యక్తి శామ్ పిట్రోడా చెప్పారు. 26/11 మారణహోమం తరువాత కూడా కాంగ్రెస్ నేతృత్వంలోని అప్పటి యుపిఎ ప్రభుత్వం పాక్‌పై ఎలాంటి కఠిన చర్యలు తీసుకోలేదు అని బిజెపి అధికార ప్రతినిధి భండారి మండిపడ్డారు. తరచూ సొంత పార్టీని ఇరకాటంలో పెట్టేలా శామ్ పిట్రోడా తన అభిప్రాయాలను వ్యక్తం చేస్తుంటారు. ఎన్నికల సమయంలో కాంగ్రెస్ నేత శామ్ పిట్రోడా వారసత్వ పన్ను విధానంపై చేసిన వ్యాఖ్యలు తీవ్ర దుమారం రేపిన సంగతి తెలిసిందే. అమెరికాలోని ఓ విధానాన్ని ఉటంకిస్తూ ఒక వ్యక్తి దగ్గర 100 మిలియన్ల డాలర్ల విలువైన సొత్తు ఉందనుకుంటే ఆ వ్యక్తి మరణం తర్వాత అందులో సుమారు 45 శాతం మాత్రమే వారసులకు బదలీ అవుతుంది. మిగిలిన 55 శాతాన్ని ప్రభుత్వం స్వాధీనం చేసుకుంటుంది అని వ్యాఖ్యానించడం తీవ్ర చర్చనీయాంశమైంది. గతంలో చైనా గురించి మాట్లాడిన మాటలపై కూడా విమర్శలు వ్యక్తమయ్యాయి. తన వ్యాఖ్యలతో కాంగ్రెస్ పార్టీపై విమర్శలు రావడంతో పిట్రోడా తన పదవికి రాజీనామా చేశారు. తర్వాత హస్తం పార్టీ ఆయన్ను అదే పదవిలో నియమించడం గమనార్హం.

# లలిత్ మోడీ సోదరుడు సమీర్ మోడీ అరెస్టు

**న్యూఢిల్లీ, సెప్టెంబరు 19:** ప్రముఖ వ్యాపారవేత్త, ఐపీఎల్ మాజీ ఛైర్మన్ లలిత్ మోడీ సోదరుడు సమీర్ మోడీ తీవ్రమైన ఆరోపణలతో చిక్కుల్లో పడ్డారు. అత్యాచారం, క్రిమినల్ బెదిరింపుల కేసులో ఢిల్లీ పోలీసులు ఆయనను అరెస్ట్ చేశారు. నిన్న సాయంత్రం ఢిల్లీలోని ఇందిరా గాంధీ అంతర్జాతీయ విమానాశ్రయంలో ఆయనను అదుపులోకి తీసుకున్నట్లు అధికారులు తెలిపారు. ఐదు రోజుల క్రితం ఓ మహిళ సమీర్ మోదీపై పోలీసులకు ఫిర్యాదు చేశారు. గతంలో తనపై సమీర్ అత్యాచారానికి పాల్పడ్డారని, బెదిరింపులకు గురిచేశారని ఆమె తన ఫిర్యాదులో పేర్కొన్నారు. ఈ ఫిర్యాదు ఆధారంగా పోలీసులు అత్యాచారం, క్రిమినల్ బెదిరింపుల కింద కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. అనంతరం విమానాశ్రయంలో సమీర్ మోదీని అరెస్ట్ చేసినట్లు ఓ సీనియర్ పోలీస్ అధికారి వెల్లడించారు. సమీర్ మోదీ, ప్రముఖ డైరెక్ట్ సెల్లింగ్ సంస్థ మోడీకేర్ వ్యవస్థాపకుడు, మేనేజింగ్ డైరెక్టర్‌గా ఉన్నారు.





## వీధి వ్యాపారి నుంచి కార్పొరేట్ దాకా

# చేరువలో టెక్నాలజీ

## ప్రధాని నరేంద్ర మోడీ

**న్యూఢిల్లీ, సెప్టెంబరు 19:** దేశంలో టెక్నాలజీయే అతిపెద్ద ఈక్వలైజర్ (సమానత్వ సాధనం) అని, ఇది వీధి వ్యాపారి నుంచి కార్పొరేట్ ఎగ్జిక్యూటివ్ వరకు ప్రతి ఒక్కరికీ సాధికారతను అందించిందని ప్రధాని నరేంద్ర మోదీ పేర్కొన్నారు. కేంద్ర ఐటీ, ఎలక్ట్రానిక్స్ శాఖ మంత్రి అశ్విని వైష్ణవ్ రాసిన ఓ వ్యాసానికి ఆయన సోషల్ మీడియా ప్లాట్‌ఫామ్ 'ఎక్స్'లో స్పందించారు. గతంలో ప్రభుత్వ పత్రం కావాలంటే ఆఫీసుల చుట్టూ తిరగాల్సి వచ్చేదని, ఇప్పుడు టెక్నాలజీ పుణ్యమా అని అన్నీ మొబైల్ ఫోన్‌లోనే అందుబాటులోకి వచ్చాయని అశ్విని వైష్ణవ్ తన వ్యాసంలో వివరించారు. దీనిపై ప్రధాని స్పందిస్తూ, 'ఇండియా స్టాక్, యూపీఐ, జామ్ ట్రినిటీ, కోవిన్ వంటి కార్యక్రమాలతో ఆవిష్కరణలు, సమ్మిళిత వృద్ధి ప్రజల జీవితాలను మార్చాయి. పాలన మెరుగుపడటంతో పాటు ప్రపంచ వేదికపై భారత్ స్థానాన్ని బలోపేతం చేశాయి' అని మోదీ తెలిపారు. అంతకుముందు తన వ్యాసంలో ప్రధాని మోదీ దార్శనికతతో టెక్నాలజీ ఎలాంటి అంతరాలు లేవని అశ్విని వైష్ణవ్ పేర్కొన్నారు. ముంబైలోని ఒక వీధి వ్యాపారి, ఒక కార్పొరేట్ ఎగ్జిక్యూటివ్ ఇద్దరూ ఒకే యూపీఐ చెల్లింపుల వ్యవస్థను వాడుతున్నారు. ఇదే అసలైన సమానత్వం. క్యూలో నిల్చున్న చివరి వ్యక్తికి కూడా ఫలాలు అందాలనే 'అంత్యోదయ' స్ఫూర్తితోనే ప్రతి డిజిటల్ కార్యక్రమం రూపుదిద్దుకుంది" అని ఆయన పేర్కొన్నారు. గుజరాత్ ముఖ్యమంత్రిగా మోదీ ప్రారంభించిన ప్రయోగాలు, దేశవ్యాప్త డిజిటల్ విప్లవానికి పునాది వేశాయని ఆయన అభిప్రాయపడ్డారు. గుజరాత్ సీఎంగా ఉన్నప్పుడు జ్యోతిగ్రామ్, నర్మదా కాలువపై సోలార్ ప్యానెళ్లు, ఇఖర, స్వాగత్ వంటి పథకాలతో టెక్నాలజీని పాలనలో భాగం చేశారని వైష్ణవ్ గుర్తుచేశారు. 2014లో ప్రధాని అయ్యాక గుజరాత్ అనుభవాన్ని దేశవ్యాప్తంగా అమలు చేశారని అన్నారు. దీనిలో భాగంగా ప్రపంచంలోనే అతిపెద్ద డిజిటల్ మౌలిక సదుపాయాలైన ఖిఇండియా స్టాక్‌ఖికు రూపకల్పన జరిగిందని తెలిపారు. జామ్ (జన్ ధన్‌ఆధార్‌మొబైల్) త్రయంతో 53 కోట్లకు పైగా ప్రజలను బ్యాంకింగ్ వ్యవస్థలోకి తీసుకువచ్చారని వివరించారు. ఆధార్ ద్వారా 142 కోట్ల మందికి డిజిటల్ గుర్తింపు లభించిందని, ప్రభుత్వ సేవలు సులభతరం అయ్యాయని చెప్పారు. ప్రత్యక్ష నగదు బదిలీ (డీబీటీ) విధానంతో దళారుల వ్యవస్థకు తెరపడిందని, దీనివల్ల ఇప్పటివరకు రూ. 4.3 లక్షల కోట్లకు పైగా ప్రజాధనం ఆదా అయిందని ఆయన తన వ్యాసంలో స్పష్టం చేశారు.

# మాజీ ప్రధాని మన్మోహన్‌పై యాసిన్ మాలిక్ సంచలన ఆరోపణలు



**న్యూఢిల్లీ, సెప్టెంబరు 19:** టెర్రర్ ఫండింగ్ కేసులో జీవిత ఖైదు అనుభవిస్తున్న జమ్మూ కశ్మీర్ లిబరేషన్ ఫ్రంట్ (జేకేఎల్ఎఫ్) ఉగ్రవాది యాసిన్ మాలిక్ భారత మాజీ ప్రధాని మన్మోహన్ సింగ్‌పై సంచలన ఆరోపణలు చేశారు. 2006లో తాను పాకిస్థాన్‌లో లష్కరే తోయిబా వ్యవస్థా పకుడు, 26/11 ముంబై దాడుల సూత్రధారి హాఫీజ్ సయీద్‌ను కలిసిన తర్వాత స్వయంగా మన్మోహన్ సింగ్ తనకు కృతజ్ఞతలు తెలిపారని మాలిక్ పేర్కొన్నారు. ఈ మేరకు ఆగస్టు 25న ఢిల్లీ హైకోర్టులో దాఖలు చేసిన ఒక అఫిడవిట్‌లో ఆయన ఈ వివరాలను వెల్లడించారు. హాఫీజ్ సయీద్‌తో తన భేటీ వ్యక్తిగత నిర్ణయం కాదని, పాకిస్థాన్‌తో తెరవెనుక శాంతి చర్చల్లో భాగంగా భారత నిఘా వర్గాల ఉన్నతాధికారుల కోరిక మేరకే అది జరిగిందని మాలిక్ తన అఫిడవిట్‌లో తెలిపారు. 2005లో కశ్మీర్‌లో భూకంపం వచ్చిన తర్వాత తాను పాకిస్థాన్ పర్యటనకు వెళ్లే ముందు అప్పటి ఐబీ స్పెషల్ డైరెక్టర్ వి.కె. జోషి తనను ఢిల్లీలో కలిశారని పేర్కొన్నారు. పాక్‌లోని రాజకీయ నాయకులతో పాటు, హాఫీజ్ సయీద్ వంటి ఉగ్రవాద నాయకులతో కూడా మాట్లాడి శాంతి ప్రక్రియకు సహకరించాలని జోషి తనను కోరినట్లు తెలిపారు. ఆయన కోరిక మేరకే తాను పాకిస్థాన్‌లో హాఫీజ్ సయీద్‌తో పాటు యునైటెడ్ జిహాద్ కౌన్సిల్ నాయకులను కలిశానని, హింసను వీడి శాంతి మార్గాన్ని ఎంచుకోవాలని వారికి సూచించానని మాలిక్ వివరించారు. పాకిస్థాన్ నుంచి తిరిగి వచ్చిన వెంటనే జాతీయ భద్రతా సలహాదారు ఎం.కె. నారాయణన్ సమక్షంలో తాను ప్రధాని మన్మోహన్ సింగ్‌ను కలిశానని తెలిపారు. తన ప్రయత్నాలకు ప్రధాని ప్రశంసించారని, ఓపికకు, నిబద్ధతకు కృతజ్ఞతలు చెప్పారని ఆరోపించారు. అంతేకాకుండా, మన్మోహన్ సింగ్ తనను కశ్మీర్‌లో అహింసా ఉద్యమ పితామహుడిగా అభివర్ణించారని కూడా మాలిక్ పేర్కొన్నారు.తన అఫిడవిట్‌లో వాజ్‌పేయి, సోనియా గాంధీ, చిదంబరం వంటి పలువురు అగ్ర నాయకులతో గతంలో జరిగిన సమావేశాల గురించి కూడా ప్రస్తావించారు. ప్రస్తుతం యాసిన్ మాలిక్ చేసిన ఈ ఆరోపణలు దేశ రాజకీయాల్లో తీవ్ర చర్చకు దారితీసే అవకాశం ఉంది.

## సంక్షిప్తంగా..

# టివికె విజయ్ ఇంట్లో భద్రతా వైఫల్యం



**చెన్నై, సెప్టెంబరు 19:** రాజకీయాల్లోకి ప్రవేశించి, కేంద్ర ప్రభుత్వం నుంచి వై ప్లస్ కేటగిరీ భద్రత పొందిన ప్రముఖ నటుడు, తమిళగ వెట్రి కళగం (టీవీకే) అధ్యక్షుడు విజయ్ ఇంట్లో భద్రతా వైఫల్యం చోటుచేసుకుంది. చెన్నైలోని నీలంకరైలో ఉన్న ఆయన నివాసంలోకి ఓ యువకుడు ప్రవేశించి కలకలం సృష్టించాడు. ఇంటి టెర్రస్‌పై తిరుగుతున్న అతడిని గమనించిన భద్రతా సిబ్బంది వెంటనే అప్రమత్తమై పట్టుకున్నారు. ఈ ఘటనపై సమాచారం అందుకున్న పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని నింది తుడిని అదుపులోకి తీసుకున్నారు. విచారణలో ఆ యువకుడి పేరు అరుణ్ (24) అని, అతడు గత నాలుగేళ్లుగా మానసిక సమస్యలతో బాధపడుతున్నాడని ప్రాథమికంగా గుర్తించినట్లు పోలీసులు తెలిపారు. అనంతరం మెరుగైన చికిత్స కోసం అతడిని ఆసుపత్రికి తరలించారు. ఈ ఘటనతో విజయ్ అభిమానులు తీవ్ర ఆందోళనకు గురవుతున్నారు.ఆయనకు భద్రతను మరింత కట్టుదిట్టం చేయాలని సోషల్ మీడియా వేదికగా కోరుతున్నారు.

# వాయనాడులో ప్రియాంక కుటుంబం బస



**వాయనాడు, సెప్టెంబరు 19:** కేరళలోని వయనాడ్ లోక్‌సభ నియోజకవర్గం శుక్రవారం రాజకీయ కార్యకలాపాలకు కేంద్ర బిందువుగా మారింది. కాంగ్రెస్ అగ్రనేతలు సోనియా గాంధీ, రాహుల్ గాంధీ ఇక్కడికి చేరుకోవడంతో రాజకీయ వాతావరణం వేడెక్కింది. గతవారం నుంచే తన నియోజకవర్గంలో పర్యటిస్తున్న నూతన ఎంపీ ప్రియాంక గాంధీ వాద్రాను వారు కలిశారు. ఈ పర్యటన పూర్తిగా వ్యక్తిగతమైనదని చెబుతున్నప్పటికీ, దీని వెనుక రాజకీయ ప్రాధాన్యత కూడా ఉందని విశ్లేషకులు భావి స్తున్నారు. 2019, 2024 ఎన్నికల్లో వయనాడ్ నుంచి గెలిచిన రాహుల్ గాంధీ, రాయ్‌బరేలీ స్థానాన్ని అట్టిపెట్టుకుని వయనాడ్‌కు రాజీనామా చేసిన విషయం తెలిసిందే. ఆ సమయంలో ఆయన వయనాడ్ ప్రజలకు ఒక హామీ ఇచ్చారు. 'ఇకపై వయనాడ్‌కు ఇద్దరు ఎంపీలు ఉంటారు' అని ప్రకటించారు. ఆ మాటను నిలబెట్టుకుంటూ ఇప్పుడు సోదరి ప్రియాం కతో కలిసి ఆయన నియోజకవర్గంలో పర్యటిస్తుండటం ప్రాధాన్యతను సంతరించుకుంది.

# నిరుద్యోగ యువతకు బీహార్ సిఎం ఎన్నికల వరాలు



**పాట్నా,సెప్టెంబరు 19:** బీహార్‌లో అసెంబ్లీ ఎన్నికలకు సమయం దగ్గరపడుతున్న వేళ ముఖ్యమంత్రి నితీశ్ కుమార్ ప్రభుత్వం యువతను ఆకట్టుకునే దిశగా కీలక నిర్ణయం తీసుకుంది. రాష్ట్రంలో ఇప్పటికే అమలులో ఉన్న ముఖ్యమంత్రి స్వయం సహాయ భృతి పథకం పరిధిని విస్తరిస్తున్నట్లు ప్రకటిం చింది. ఈ నిర్ణయంతో ఇకపైడిగ్రీపూర్తి చేసి ఉద్యోగం కోసం ఎదురుచూస్తున్న నిరుద్యోగ యువతకు కూడా ఆర్థికంగా అండలభించనుంది. ప్రభుత్వం తీసుకున్న ఈ కొత్తనిర్ణయం ప్రకారం ఆర్ట్స్, సైన్స్,కామర్స్ విభాగాల్లో డిగ్రీపూర్తి చేసిన నిరుద్యోగులకు నెలకు రూ.1000 చొప్పున గరిష్ఠంగా రెండేళ్ల పాటు భృతి అందించనున్నారు. ఇప్పటివరకు ఈపథకం కేవలం ఇంటర్మీడియట్ పూర్తిచేసిన నిరుద్యోగులకుమాత్రమేవర్తించేది.ప్రభుత్వ నిశ్చయ్‌కార్యక్రమంలో భాగంగా ఈపథకాన్నిఅమలు చేస్తున్నారు.

# ఐఫోన్ కొత్త సిరీస్17 కోసం కస్టమర్ల తోపులాట



**ముంబయి, సెప్టెంబరు 19:** ముంబైలోని యాపిల్ స్టోర్ వద్ద శుక్రవారం ఉదయం భారీ ఎత్తునకస్టమర్లు గుమిగూడారు. ఐఫోన్ 17 సిరీస్ సొంతంచేసుకోవాలన్న అత్యుత్సాహంతో తోసుకు వచ్చిన కస్టమర్లతో తొక్కిసలాట జరిగింది. కొత్త ఫోన్‌ను అందరికంటే ముందు సొంతం చేసుకోవాలనే ఆత్రుతతో వచ్చిన వినియోగదారులు, టెక్ ప్రియుల మధ్య తీవ్ర వాగ్వివాదం జరిగి, అది కాస్తా తోపులాటకు దారితీసింది. ఇందులో వందలాది మంది స్టోర్ బయట కిక్కిరిసిపోయి ఉండటం, ఒకరిపై ఒకరు చేయి చేసుకోవడం స్పష్టంగా కనిపిస్తోంది. ఓ ఎర్ర చొక్కా వ్యక్తిని సెక్యూరిటీ సిబ్బంది బలవంతంగా పక్కకు లాక్కెళ్లగా, అతను వారిపైనే దాడికి ప్రయత్నించాడు. మరో వ్యక్తిని కూడా సాయుధ గార్డులు గుంపు నుంచి బయ టకు తీసి పంపించివేశారు. ఈ గందరగోళం జరుగుతున్నంత సేపూ సెక్యూరిటీ సిబ్బంది చేతిలో లాఠీ పట్టుకుని నిస్సహాయంగా చూస్తూ ఉండిపోయారు. భద్రతా వైఫల్యం కారణంగానే ఈ గందరగోళం జరిగిందని కొందరు కొనుగోలుదారులు ఆరోపించారు.

# అద్దె ఇంట్లోకి మాజీ ప్రధాని కెపిశర్మ ఓలి



**ఖాట్మండు, సెప్టెంబరు 19:** నేపాల్‌లో యువత ఆందోళనల కారణంగా ప్రధానమంత్రి పదవికి రాజీనామా చేసిన కేపీ శర్మ ఓలీ పది రోజుల తర్వాత తొలిసారిగా బయటి ప్రపంచానికి కనిపించారు. తీవ్ర నిరసనల మధ్య సైనిక శిబిరంలో తలదాచుకున్న ఆయన, గురువారం సైనిక హెలికాప్టర్‌లో భద్రత నడుమ భక్తపూర్‌లోని ఓ అద్దె ఇంటికి మారారు. ఆయన తన కొత్త నివాసానికి చేరుకున్నప్పుడు కొంతమంది మద్దతుదారులు మాత్రమే ఆయనకు స్వాగతం పలికారు.

## టిటిడి మొబైల్ ఫాస్ట్‌ఫుడ్ వాహనం



తిరుమల, సెప్టెంబర్ 19 ప్రభాతవార్త ప్రతినిధి: శ్రీవేంకటేశ్వరస్వామి దర్శనార్థం తిరుమలకు వచ్చిన భక్తులకు మరింతగా అన్నప్రసాదాలు అందించేందుకు వీలుగా దాత మొబైల్ ఫాస్ట్‌ఫుడ్ వాహనాన్ని విరాళమిచ్చాడు. బెంగళూరు ఎంఎస్ రామయ్య విద్యాసంస్థలకు చెందిన ఎంఎస్ సుందర్‌రామ్ రూ.14 లక్షల విలువైన బడా దోస్త్ మొబైల్ ఫాస్ట్‌ఫుడ్ వాహనాన్ని విరాళంగా అందించాడు. శుక్రవారం ఆలయం ముందు ఈ వాహనానికి ప్రత్యేక పూజలు నిర్వహించి వాహన రికార్డులను టీటీడీ అదనపు ఈవో వెంకయ్యచౌదరికి, ఆలయ డిప్యూటీ ఈవో లోకనాథంకు అందజేశారు. భక్తులకు అన్నప్రసాదాలు పంపిణీ చేసేందుకు వీలుగా స్వామివారిపై విశ్వాసాలతో అందించానని దాత తెలిపారు. డీఈ వెంకటాద్రినాయుడు పాల్గొన్నారు.

## ఏ ఆధారాలతో విష్ణుమూర్తి విగ్రహమన్నారు

- టీటీడీ ఛైర్మన్‌గా మీ హయంలో ఎందుకు పట్టించుకోలేదు
- ఇప్పుడు రాద్ధాంతం ఎందుకు చేశారు
- వైసీపీ నేత భూమనకు పోలీసులు ప్రశ్నలు



తిరుపతి, సెప్టెంబర్ 19 ప్రభాతవార్త ప్రతినిధి: రెండు దశాబ్దాల కిందట అలిపిరి లింకుబస్టాండ్ ప్రాంతంలో పడివున్న విగ్రహం మహావిష్ణువు విగ్రహమేనని ఎలా తేల్చారు? అక్కడ ఎంతకాలంగా విగ్రహం ఉంది. ఇప్పుడే ఎందుకు పట్టించుకోవాల్సి వచ్చింది అనే ప్రశ్నల వర్షం వైసీపీ నేత భూమన కరుణాకర్‌రెడ్డికి పోలీసులు సంధించినట్లు తెలిసింది. గతంలో రెండు సార్లు టీటీడీ ఛైర్మన్‌గా ఉన్నపుడు మీరు ఎందుకు ఈ విగ్రహం గురించి పట్టించుకోలేదు? ఇప్పుడు ఎవరి ప్రమేయంతో రాద్ధాంతం చేశారు అని ప్రశ్నించినట్లు సమాచారం. తాజాగా అదీ శనీశ్వరుని విగ్రహంగా చెబుతున్నా విష్ణుమూర్తి విగ్రహమేనని ఎందుకు రచ్చ చేస్తున్నారు, దీనివెనుక రాజకీయ కుట్ర ఉందా? అంటూ సమాధానాల్ని రాబట్టే ప్రయత్నాన్ని పోలీసులు విచారణ చేశారు. ఇటీవల అలిపిరి లింకుబస్టాండు ప్రాంతంలో పడివున్న శనీశ్వర విగ్రహాన్ని బదులు విష్ణుమూర్తి విగ్రహమంటూ దుష్ప్రచారం చేయడం, టీటీడీ ధర్మకర్తల మండలిపై ఆరోపణలు చేసిన విషయం విదితమే. దీనిపై టీటీడీ డిప్యూటీ ఈవో గోవిందరాజన్ ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు. విచారణకు 41ఏ నోటీసులు జారీచేసిన విషయం విదితమే. శుక్రవారం తిరుపతి డీఎస్పీ భక్తవత్సలం ఎదుట విచారణకు హాజరయ్యారు. అయితే భక్తునిగా, సనాతన ధర్మాన్ని పరిరక్షించడమే తన కర్తవ్యమని భూమన సమాధానమిచ్చినట్లు సమాచారం.

### శ్రీవారి బ్రహ్మోత్సవాలకు

# జాతీయ దృక్పథం తీసుకొస్తాం

- అన్నిశాఖలతో సమన్వయం
- సామాన్య భక్తులకు వసతి, దర్శనం అధిక ప్రాధాన్యత
- 1.16లక్షల ఎస్ఈడీ టిక్కెట్లు విక్రయం
- 8లక్షల లడ్డూలు నిల్వ
- టీటీడీ ఈవో ఏకే సింఘాల్



తిరుమల, సెప్టెంబర్ 19 ప్రభాతవార్త ప్రతినిధి: అఖిలాండకోటి బ్రహ్మాండనాయకుడు తిరుమల శ్రీవేంకటేశ్వరస్వామికి ఏడాదిలో తొమ్మిదిరోజులు నిర్వహించే బ్రహ్మోత్సవాలకు జాతీయ స్థాయిలో ఒక దృక్పథం(ఔట్‌లుక్) తీసుకువచ్చే ఉద్దేశ్యంతో అన్ని రాష్ట్రాల కళాబృందాలకు అవకాశం కల్పించామని టీటీడీ ఈవో అనిల్ కుమార్ సింఘాల్ వెల్లడించారు. నభూతోనభవిష్యతి అనే రీతిలో జరిగే దేవదేవుని బ్రహ్మోత్సవాలకు ఆలయ మాఢవీధుల్లో గ్యాలరీల్లో 2లక్షలమంది భక్తులు వాహనసేవలు వీక్షించే అవకాశం ఉందన్నారు. ఇంకా గరుడసేవరోజు ప్రతి మాఢవీధి మూలల్లో 45నిమిషాలు పాటు గరుడసేవ వీక్షించేలా ఏర్పాట్లు చేశామన్నారు. పెరటాసి మాసం, దసరా సెలవులు రావడంతో ఈ ఏడాది అశేష సంఖ్యలో భక్తులు తిరుమలకు చేరుకునే అవకాశం ఉందన్నారు. భక్తుల రద్దీని క్రమబద్ధీకరించడానికి, మాఢవీధుల్లోని గ్యాలరీల్లో ఉదయం, సాయంత్రం వేచివుండే భక్తులకు సకల సౌకర్యాలు కల్పిస్తున్నామన్నారు. టీటీడీ అదనపు ఈవో చిరుమామిళ్ళ వెంకయ్యచౌదరి, జేఈవో వీరబ్రహ్మం, తిరుపతి జిల్లా కలెక్టర్ డాక్టర్ ఎస్.వెంకటేశ్వర్, జిల్లా ఎస్పీ లంకెల సుబ్బరాయుడు, టీటీడీ సీవీఎస్‌వో కేవీ మురళీకృష్ణ, తిరుపతి కమిషనర్ మౌర్య, పోలీసులు, టీటీడీ విజిలెన్స్ విభాగాలతో కలసి అందరూ టీమ్‌గా భక్తులకు అవసరమైన సేవలందిస్తారని ఈవో తెలిపారు. సాలకట్ల వార్షిక బ్రహ్మోత్సవాల్లో ఏర్పాట్లు, భక్తులకు సౌకర్యాలు, కల్పించిన సదుపాయాలపై శుక్రవారం మధ్యాహ్నం అన్నమయ్య భవనంలో మీడియా ప్రతినిధులకు వివరించారు. 24వ తేదీ బుధవారం నుండి ఆలయ మాఢవీధుల్లో స్వామివారి వాహన సేవలు మొదలవుతాయన్నారు. ఉదయం, రాత్రి వేళల్లో మలయప్పస్వామి వాహనసేవల్లో అన్ని శాఖలు సిబ్బంది, అధికారులు టీమ్‌గా గ్యాలరీల్లోని భక్తులకు అన్నప్రసాదాలు, బిస్కెట్లు, పాలు పంపిణీ చేస్తామని ఈవో సింఘాల్ తెలిపారు. ఉదయం 8గంటల నుండి రాత్రి 11గంటల వరకు వెంగమాంబ అన్నప్రసాద భవనంలో భక్తులకు అన్నప్రసాదాలు అందుబాటులో ఉంటుందన్నారు. ఈ ఏడాది బ్రహ్మోత్సవాల వాహనసేవల్లో 28 రాష్ట్రాల నుండి 290 కళాబృందాలతో కళా ప్రదర్శనాలు ఏర్పాటు చేశామన్నారు.

### వాహనసేవల వీక్షణకు సర్వం సిద్ధం

కలియుగ వైకుంఠం తిరుమలలో బ్రహ్మోత్సవాలకు సర్వం సిద్ధమవుతోందని టీటీడీ ఈవో అనిల్ కుమార్ సింఘాల్ మీడియాకు తెలిపారు. బ్రహ్మోత్సవాలను సజావుగా, విజయవంతంగా నిర్వహించేందుకు అన్ని ఏర్పాట్లు పూర్తిచేశామని చెప్పారు. ఈనెల 24వ తేదీ సాయంత్రం ధ్వజారోహణంతో స్వామివారి బ్రహ్మోత్సవాలు ఆరంభమవుతాయని, ఆ రోజు సాయంత్రం సీఎం చంద్రబాబు దంపతులు స్వామివారికి పట్టువస్త్రాలు సమర్పిస్తారన్నారు. తొలివాహనంగా ఆ రోజు రాత్రి పెద్దశేషవాహనం జరుగుతుందన్నారు. బ్రహ్మోత్సవాలు జరిగే తొమ్మిది రోజులు వీఐపీ బ్రేక్ దర్శనాలు, గదుల ముందస్తు బుకింగ్ కేటాయింపులపై కీలక ప్రకటన చేశారు. బ్రహ్మోత్సవాలలో సిఫార్సులేఖలపై బ్రేక్ దర్శనాలు, గదులు కేటాయింపు రద్దుచేశామని, అన్ని ఆర్జితసేవలు రద్దు చేశామన్నారు. సామాన్య భక్తులకు అధిక ప్రాధాన్యత నిచ్చేందుకు ఈ నిర్ణయం తీసుకున్నట్లు ఈవో వెల్లడించారు. ఇప్పటికే తొమ్మిది రోజులుకు గాను 1.16లక్షలు 300 రూపాయలు ఎస్ఈడీ దర్శన టిక్కెట్లు విక్రయించామన్నారు. 8లక్షల లడ్డూలు ముందస్తుగా నిల్వ చేశామన్నారు. గ్యాలరీల్లోకి రాలేని భక్తులు తిరుమలలో పలు ప్రాంతాల్లో ఉండి వాహన సేవలు వీక్షించేందుకు వీలుగా 36 ఎల్ఈడీ స్క్రీన్లు ఏర్పాటు చేశామన్నారు. 20 హెల్ప్‌డెస్క్‌లు, ఐదు భాషల్లో భక్తులకు సమాచార వ్యవస్థను కల్పించామన్నారు. గరుడసేవ జరిగే 28వ తేదీ రాత్రి మాఢవీధుల్లో భక్తులకు అన్నప్రసాదాలు, సుండల్, టీ, కాఫీ అందించే ఏర్పాటు చేశామన్నారు. సీనియర్ అధికారుల పర్యవేక్షణలో మాఢవీధుల్లో సౌకర్యాలు ఉంటాయన్నారు.

### మాఢవీధుల మూలల్లో గరుడసేవ వీక్షణం

ఈ ఏడాది సాలకట్ల వార్షిక బ్రహ్మోత్సవాల్లో అత్యంత విశేషమైన గరుడసేవ జరిగే 28వ తేదీ రాత్రి ఆలయ మాఢవీధుల మూలల్లో గరుడసేవ వాహనాన్ని నిలిపి ఉంచి భక్తులకు దర్శనం కల్పిస్తామని అదనపు ఈవో చిరుమామిళ్ళ వెంకయ్యచౌదరి తెలిపారు. 45 నిమిషాలు నిలబెడతామన్నారు. తిరుమలనంబి, వసంత మండపం, వరాహస్వామి ఆలయ మూల ప్రాంతాల్లో గ్యాలరీల్లోకి చేరుకోలేని వెలుపల నిరీక్షించే భక్తులకు దాదాపు 40వేల మందికి ఈ వాహనసేవ వీక్షణం సౌకర్యం కల్పిస్తామని తెలిపారు. టీటీడీపై అసత్య ప్రచారాలు, దుష్ప్రచార వార్తలు ప్రసారం చేసే వారిపై కఠిన చర్యలు తప్పవని ఈవో హెచ్చరించారు. బ్రహ్మోత్సవాలను మరింత విస్తృతంగా వ్యాప్తిచేసేందుకు, ప్రచారం చేసేందుకు సామాజిక మాధ్యమాల వినియోగం పెంచామన్నారు. ఈ మీడియా సమావేశంలో టీటీడీ సీపీఆర్‌వో డాక్టర్ తలారి రవి, పీఆర్‌వో నీలిమ, తిరుమల అదనపు ఎస్పీ రామకృష్ణ, డీఎస్పీ విజయశేఖర్, వీఎస్‌వో ఎన్‌టీవీ రామ్‌కుమార్, సురేంద్ర పాల్గొన్నారు.

## తిరుమల సమాచారం



### అన్నప్రసాదం విరాళాల డిపాజిట్ల

## వడ్డీ రూ.270 కోట్లు

తిరుమల,సెప్టెంబర్ 19 ప్రభాతవార్త ప్రతినిధి: శ్రీ వేంకటేశ్వరస్వామి దర్శనార్థమ్ తిరుమలకు వస్తున్న లక్షలాది మంది భక్తులకు ఆకలి అనేది తెలియకుండా రుచిగా, శుచిగా అన్నప్రసాదాలు అందిస్తున్న ట్రస్ట్‌కు దాతలు భారీగా ఇస్తున్న విరాళాల ద్వారా ఈ ఏడాది వడ్డీ 270 కోట్ల రూపాయలు చేరింది. అన్నప్రసాదం విరాళాలు డిపాజిట్లు సుమారు రూ.2,300 కోట్లకు పైగానే ఉంది. ఈ విరాళాల డిపాజిట్ల ద్వారా ఏటా వడ్డీ రూపంలో నగదు అందుతోంది. దీని ద్వారానే ప్రతిరోజూ ఉచిత అన్నప్రసాదాలను లక్షమందికిపైగా భక్తులకు రుచిగా శుచిగా అందిస్తున్నారు. 2023–24లో కార్పస్ రూ.1,854 కోట్లు కాగా, 2024–25లో రూ.2,127 కోట్లు, 2025 ఆగస్టు నెల వరకు రూ.2,263 కోట్లకు చేరింది. టీటీడీ గణాంకాల ప్రకారం వడ్డీల రూపంలో 2024లో రూ.221 కోట్లు, 2025లో రూ.270 కోట్లకు పెరిగింది. ప్రస్తుతం వార్షిక వ్యయం రూ.150 కోట్లుగా ఉంది.



### బాలాజీ ఆరోగ్య వరప్రసాదినికి రూ.10 లక్షలు విరాళం

తిరుమల, సెప్టెంబర్ 19 ప్రభాతవార్త ప్రతినిధి: టీటీడీ నిర్వహిస్తున్న ట్రస్ట్‌ల్లో బాలాజీ ఆరోగ్య వరప్రసాదిని ట్రస్ట్‌కు ఓ దాత తనవంతు విరాళమందించారు. హైదరాబాద్‌కు ఆదిత్య పోలెపల్లి శుక్రవారం ఉదయం రూ.10,11,116ల డీడీని టీటీడీ అదనపు ఈవో చిరుమామిళ్ళ వెంకయ్యచౌదరికి అందజేశారు.

### వెంకన్న దర్శనంలో వామనాశ్రమస్వామి

కలియుగప్రత్యక్షదైవం తిరుమల శ్రీవేంకటేశ్వరస్వామిని శుక్రవారం ఉదయం హాల్దీపురం మఠం పీఠాధిపతి వామనాశ్రమస్వామి దర్శించుకున్నారు. ఉదయం శిష్యులతో కలసి వచ్చిన స్వామికి ఆలయ అధికారులు మహాద్వారం వద్ద స్వాగతం పలికారు. తొలుత ధ్వజస్తంభానికి నమస్కరించిన స్వామి శ్రీవేంకటేశ్వర స్వామిని దర్శించుకున్నారు. ఆశీస్సులందుకున్నారు. రంగనాయకుల మండపంలో వేదపండితులు వేదాశీర్వచనం చేశారు. శ్రీవారి తీర్థప్రసాదాలు అందజేశారు.

## ప్లాస్టిక్ వ్యర్థాలు వేస్తే రూ.5 ప్రోత్సాహక నగదు



తిరుమల, సెప్టెంబర్ 19 ప్రభాతవార్త ప్రతినిధి: చెత్తనుండి ఆదాయం సంపాదించడం విన్నాం... వ్యర్థపదార్థాలు, ప్లాస్టిక్ వస్తువులు ఇస్తే ఒకపూట భోజనం పెట్టడం, కూరగాయలు ఇవ్వడం విన్నాం. అయితే అందుకు భిన్నంగా తిరుమల పుణ్యక్షేత్రంలో టీటీడీ వినూత్నంగా ఏర్పాటుచేసిన ప్లాస్టిక్ వ్యర్థాల రీ సైక్లింగ్ యంత్రం ద్వారా భక్తులు తిరుమలలో ప్లాస్టిక్ వ్యర్థాలు యంత్రంలోని రింగ్‌లో వదిలితే వారికి ప్రోత్సాహకంగా 5 రూపాయలు నగదు లభిస్తుంది. ఈ యంత్రం యాత్రికుల వసతి సముదాయం–5 (వెంకటాద్రి నిలయం)లో టీటీడీ ఏర్పాటుచేసింది. ఈ యంత్రం పర్యావరణ పరిరక్షణకు దోహదపడుతుందని టీటీడీ ఈవో అనిల్‌కుమార్ సింఘాల్, అదనపు ఈవో వెంకయ్యచౌదరి తెలిపారు. శుక్రవారం ఈ యంత్రం పనితీరును స్వయంగా ఇద్దరు అధికారులు పరిశీలించారు.



## 25న పీఏసీ-5 ప్రారంభం

### - అత్యాధునిక సౌకర్యాలతో నిర్మాణం

తిరుమల, సెప్టెంబర్ 19 ప్రభాతవార్త ప్రతినిధి: తిరుమలకు వస్తున్న భక్తులకు అదనంగా 4వేల మందికి వసతి కల్పించేందుకు పీఏసీ–5 (యాత్రికుల వసతి సముదాయం) వేంకటాద్రి నిలయం సిద్ధమైంది. ఈ వసతి సముదాయాన్ని 25న సీఎం చంద్రబాబు ప్రారంభించనున్నారు. శుక్రవారం మధ్యాహ్నం ఈ వసతి సముదాయాన్ని టీటీడీ ఈవో అనిల్‌కుమార్ సింఘాల్, అదనపు ఈవో వెంకయ్య చౌదరి, సీవీఎస్‌వో మురళీకృష్ణ, సీఈ సత్యనారాయణ, సీపీఆర్‌వో డాక్టర్ తలారి రవితో కలసి అత్యాధునిక సౌకర్యాలను పరిశీలించారు. విశాలమైన హాళ్ళు, డార్మిటరీలు, లాకర్లు ఉన్నా యన్నారు. 216 మరుగుదొడ్లు, 216 స్నానపు గదులు, రెండు కల్యాణకట్టలు, జలప్రసాదాలు, ప్రథమ చికిత్సా కేంద్రాలు, అన్నప్రసాద భవనం సౌకర్యం ఉంది.

## ప్రాధాన్యతా క్రమంలో నీటి ప్రాజెక్టుల పూర్తి

విజయవాడ,సెప్టెంబరు 19, ప్రభాతవార్త ప్రతినిధి: రాష్ట్రంలో ప్రాధాన్యతా క్రమంలో సాగునీటి ప్రాజెక్టుల నిర్మాణం చేస్తున్నామని జలవనరుల శాఖ మంత్రి నిమ్మల రామానాయుడు వెల్లడించారు. జలవనరుల శాఖపై శాసన సభలో స్వల్పకాలిక చర్చ జరిగింది. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ... కూటమి అధికారంలోకి వచ్చాక 10 లక్షల కోట్ల రూపాయాలు అప్పులు వారసత్వంగా వచ్చాయన్నారు. ఒక్క సంవత్సరం వర్షాలు బాగాపడితే రెండు మూడేళ్లు కరవు బారిన పడకుండా ప్రజలను కాపాడుకోవచ్చు అని సీఎం అంటారని తెలిపారు. పోలవరాన్ని గత ప్రభుత్వం ప్రశ్నార్థకం చేసిందని విమర్శించారు. టీడీపీ 72 శాతం పూర్తి చేయగా వీరు అయిదేళ్లలో 2 శాతం పూర్తి చేశారన్నారు. 2027 డిసెంబర్ నాటికి ఆ ప్రాజెక్టు పూర్తి చేయాలని సీఎం ఆదేశాలు ఇచ్చారని తెలిపారు. హంద్రీ–నీవా ద్వారా కృష్ణా జలాలను 700కు పైగా కిలో మీటర్లు తీసుకువెళ్లామన్నారు. 2026 జులైకి వెలుగొండ పూర్తి చేయాలని నిర్ణయించినట్లు మంత్రి నిమ్మల రామానాయుడు చెప్పారు. రెండేళ్లలో ఉత్తరాంధ్రలోని ప్రాజెక్టులు పూర్తి చేయాలని నిర్ణయించామన్నారు. ప్రాజెక్టులు, రిజర్వాయర్లు మెయింటెనెన్స్ లేకపోతే ఇబ్బంది ఉంటుందన్నారు. గత ప్రభుత్వం గ్రీజు కూడా పెట్టలేదని... దీని వల్ల ప్రాజెక్టులు, గేట్లు కొట్టుకుపోయాయని అన్నారు. మెయింటెనెన్స్ నిమిత్తం మూడు విడతల్లో రూ.800 కోట్లు సీఎం ఇచ్చారని సభలో తెలిపారు. ఐడీసీ లిఫ్ట్ ఇరిగేషన్లలో 1040 ఉంటే వాటిలో 140 మాత్రమే ఇప్పుడు పనిచేస్తున్నాయన్నారు. దీనికి కారణం కూడా గత ప్రభుత్వ నిర్లక్ష్యమే, వాటిని సరిచేస్తున్నామని చెప్పారు. ఏపీని కరవు రహిత రాష్ట్రంగా మార్చాలని ఇరిగేషన్ శాఖను ప్రక్షాళన చేసి ముందుకు తీసుకువెళుతున్నామని మంత్రి రామానాయుడు పేర్కొన్నారు.

## అమరావతిని ప్రపంచ స్థాయి నగరంగా తీర్చిదిద్దుతాం

### పురపాలక శాఖ మంత్రి నారాయణ



విజయవాడ, సెప్టెంబర్ 19 ప్రభాతవార్త ప్రతినిధి: అమరావతి ప్రాపర్టీ ఫెస్టివల్ కేవలం ప్రదర్శన మాత్రమే కాదని, ఇది రేపటి రాజధాని నగర భవిష్యత్తు ఎలా ఉండబోతోందో చూపిస్తుందని మున్సిపల్ పరిపాలన మంత్రి నారాయణ అన్నారు. విజయవాడలోని ఎ కన్వెన్షన్‌లో జరుగుతున్న అమరావతి ప్రాపర్టీ ఫెస్టివల్- 2025ను శుక్రవారం సందర్శించిన ఆయన అమరావతి మోడల్స్, ప్రాజెక్టులపై ఆసక్తిని వ్యక్తం చేశారు. నారాయణ మాట్లాడుతూ అమరావతిని ప్రపంచ స్థాయి నగరంగా తీర్చి దిద్దడమే ప్రభుత్వ లక్ష్యం అన్నారు. అనుమతుల ప్రక్రియ సులభ తరం చేశామని, పెట్టుబడి దారులకు అనుకూలమైన విధానాలు తీసుకొచ్చామని తెలిపారు. రియల్ ఎస్టేట్ అంటే కేవలం భవనాలు కాదని, ఇది ఉపాధి కల్పిస్తుంది, ఆర్థిక వృద్ధికి ఊతమిస్తుంది. అభివృద్ధి దిశగా ప్రభుత్వం పూర్తి సహకారం అందిస్తుంది అని స్పష్టం చేశారు. మంత్రి నారాయణ ప్రత్యేకంగా ఫెస్టివల్‌లో ఏర్పాటు చేసిన మాలక్ష్మీ గ్రూప్ స్టాల్‌ను ప్రారంభించారు. ఆయనతో పాటు సంస్థ సీఈవో సందీప్ మండవ ఉన్నారు. అంతకు ముందు ఉదయం ఈ ప్రాపర్టీ ఫెస్టివల్‌ను విజయవాడ ఎంపీ కేశినేని శివనాథ్, ఎమ్మెల్యే గద్దె రామ్మోహన్ దీపప్రజ్వలన చేసి ప్రారంభించారు. ఎంపీ శివనాథ్ మాట్లాడుతూ, సొంతింటి కల సాకారం చేసుకోవాలనుకునే వారికి ఈ ప్రాపర్టీ షో గొప్ప వేదిక కానుందన్నారు. ఒకే చోట ఇందరు బిల్డర్స్, డెవలపర్స్, బ్యాంకులు రావడం అరుదైన విషయ మన్నారు. అమరావతి రూపుదిద్దుకుంటున్న దిశలో ఈ ప్రదర్శన ఒక పెద్ద మైలురాయి అవుతుందని తెలిపారు. అమరావతి త్వరలోనే దేశంలోనే అందమైన నగరంగా నిలుస్తుందని ఇక్కడ పెట్టుబడి పెట్టే వారికి మంచి భవిష్యత్ ఉంటుందని వివరించారు. నారెడ్కో అధ్యక్షుడు గద్దె చక్రధర్ మాట్లాడుతూ, అమరావతి దిశగా ఇది మైలురాయి అని అన్నారు. సెంట్రల్ జోన్ అధ్యక్షుడు సందీప్ మండవ మాట్లాడుతూ రియల్ ఎస్టేట్ అభివృద్ధి అనేక రంగాలకు ఊతమిస్తుందని చెప్పారు. ఫెస్టివల్ చైర్మన్ కిరణ్ పరుచూరి మాట్లాడుతూ, 100కి పైగా బిల్డర్స్, డెవలపర్స్, ఫైనాన్స్ సంస్థలు పాల్గొనడం ప్రత్యేకత అని చెప్పారు. ఈ ఫెస్టివల్‌లో ప్రభుత్వ కాంప్లెక్సులు, రోడ్లు, బ్రిడ్జిలు, భవిష్యత్ ప్రాజెక్టుల మినియేచర్ మోడల్స్ ఆకర్షణగా నిలిచాయి. ప్రజలు అమరావతి మాస్టర్ ప్లాన్‌ను దగ్గరగా చూసే అవకాశం పొందుతున్నారు. నేరెడ్కో సెంట్రల్ జోన్ కార్యదర్శి ఎస్.వి. రామణ, ఖజానాదారు పి.వి. కృష్ణ, వంశీ వాసిరెడ్డి, కోడే జగన్, హరిప్రసాద్ రెడ్డి సహా పలువురు పాల్గొన్నారు.


### ఒమ్మి రాంమూర్తి చిట్‌పై కేసు

## హైకోర్టు తీర్పుపై సుప్రీంలో అప్పీలు

విజయవాడ,సెప్టెంబరు 19, ప్రభాతవార్త ప్రతినిధి: ఒమ్మి రాంమూర్తి చిట్స్, ఇన్వెస్ట్‌మెంట్స్ ప్రైవేట్ లిమిటెడ్, వీవీ సింహాద్రి శ్రీవిష్ణులపై ఏపీ డిపాజిటర్ల ఫైనాన్షియల్ ఎస్టాబ్లిష్‌మెంట్ రక్షణ చట్టం, తదితర సెక్షన్ల క్రింద విశాఖపట్నం కోర్టులో నడుస్తున్న కేసును కొట్టేస్తూ ఈ ఏడాది ఫిబ్రవరిలో హైకోర్టు ఇచ్చిన తీర్పును సుప్రీం కోర్టులో సవాలు చేయాలని రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయించింది. రాష్ట్ర హోంశాఖ ముఖ్య కార్యదర్శి కుమార్ విశ్వజిత్ గురువారం ఈ మేరకు జీవో జారీ చేశారు. సుప్రీం కోర్టులో ఎస్ఎల్‌పీ వేసేందుకు చర్యలు తీసుకోవాలని ప్రత్యేక అధికారి, అడ్వకేట్ ఆఫ్ రికార్డును కోరారు. విశాఖపట్నం ఐదో పట్టణ పోలీసు స్టేషన్‌లో, ఐపీసీ సెక్షన్లు 420, 406, 120బితో పాటు డిపాజిటర్ల చట్టం, చిట్ ఫండ్ చట్టం కింద ఒమ్మి రాంమూర్తి చిట్స్ సంస్థపై 2005లో కేసు నమోదు చేశారు. ఈ వ్యవహారం విశాఖపట్నం కోర్టులో 2008 నుంచి పెండింగ్‌లో ఉంది. తమపై కేసును కొట్టేయాలని నిందితులు హైకోర్టును ఆశ్రయించగా ఈ ఏడాది ఫిబ్రవరి 13న కేసును కొట్టేసింది.

### సుప్రసిద్ధ సాహితీవేత్త డాక్టర్ జి.వి.పూర్ణచందుకు

## బోయి భీమన్న స్మారక పురస్కారం



డాక్టర్ జి.వి.పూర్ణచందుకు బోయి భీమన్న స్మారక పురస్కారం అందిస్తున్న మంత్రి కందుల దుర్గేష్

విజయవాడ,సెప్టెంబరు 19,ప్రభాతవార్త ప్రతినిధి: సమాజ రుగ్మతులను తన రచనల ద్వారా ఎత్తిచూపిన మహాకవి, పద్మభూషణ్ పురస్కార గ్రహీత డాక్టర్ బోయి భీమన్న ప్రాతఃస్మరణీయులని మంత్రి కందుల దుర్గేష్ అన్నారు. ఆంధ్రప్రదేశ్ భాషా సాంస్కృతిక శాఖ ఆధ్వర్యంలో విజయవాడ కలెక్టరేట్‌లోని పింగళి వెంకయ్య సమావేశ మందిరంలో జిల్లా కలెక్టర్ జి. లక్ష్మీశ అధ్యక్షతన నిర్వహించిన డాక్టర్ బోయి భీమన్న 114వ జయంతి వేడుకల్లో ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా మంత్రి కందుల దుర్గేష్ మాట్లాడుతూ నేడు మనం మానవ హక్కులు, దళిత హక్కుల గురించి మాట్లాడుతున్నామన్నారు. అస్పృశ్యత తీవ్రంగా ఉన్న రోజుల్లోనే వీటి గురించి బోయి భీమన్న ప్రస్తావించడం గొప్ప విషయం అని అన్నారు. ఆయన నికార్సైన జాతీయవాదని చెప్పారు. ఆనాడు ఎదురవుతున్న సమస్యలను, విద్యను అభ్యసించడానికి ఉన్న ఇబ్బందులను తెలుపుతూ "జానపదుల జాబులు" అనే రచన చేశారని చెప్పారు. కుల, మత, వర్గ విభేదరహితమైన భారతజాతి ఆవిర్భావించాలనేదే తన ధ్యేయమని ప్రకటించిన భీమన్నది మహోన్నత వ్యక్తిత్వం అని, ఆయన మాట, బాట అందరికీ అనుసరణీయమని అన్నారు. ప్రపంచ తెలుగు రచయితల మహాసభలకు ఆరు పర్యాయాలు ప్రధాన కార్యదర్శిగా వ్యవహరించిన, "తెలుగే ప్రాచీనం", "తెలుగు కోసం" వంటి పరిశోధన గ్రంథాలతో పాటు సాహిత్య, వైజ్ఞానిక రచనలు, 150 కి పైగా రచనలు చేసిన డాక్టర్ జీవీ పూర్ణచందుకు బోయ భీమన్న పురస్కారం ఇవ్వడం భీమన్న గారికి సరైన నివాళి అని చెప్పారు. భీమన్న సతీమణి సుప్రసిద్ధ రచయిత్రి బోయి హైమావతి మాట్లాడుతూ... వైద్యులు, శతాధిక గ్రంథకర్త డాక్టర్ జీవి పూర్ణ చంద్ ను ఈ పురస్కారానికి ఎంపిక చేయటం సముచితమన్నారు. పురస్కార గ్రహీత జీవీ పూర్ణచందు మాట్లాడుతూ..... మానవత్వమే భీమన్న గారి తారక మంత్రమని చెప్పారు. కులాల అడ్డుగోడలను తొలగించడానికి కులాంతర వివాహాన్ని ఒక పరిష్కారంగా భీమన్న సూచించారని తెలిపారు. అవార్డుకు తన పేరు సూచించినందుకు భీమన్న సతీమణి హైమవతికి కృతజ్ఞతలు తెలిపారు. అనంతరం మంత్రి దుర్గేష్ పూర్ణ చందును దుశ్శాలువాతో సత్కరించి, పురస్కారం అందజేశారు. జి వి పూర్ణ చందు రచించిన భువనవిజయం పుస్తకాన్ని ఆవిష్కరించి, బహుమతిగా స్వీకరించారు. ఈ కార్యక్రమంలో ఏపీ నాటక అకాడమీ ఛైర్మన్ గుమ్మడి గోపాలకృష్ణ, రాష్ట్ర జానపద కళలు, సృజనాత్మకత అకాడమీ ఛైర్మన్ వి. గంగులయ్య, ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్ జి.లక్ష్మీశ. డీఆర్‌వో లక్ష్మీనరసింహం, సాంస్కృతిక శాఖ సంచాలకులు మల్లికార్జునరావు, బోయి భీమన్న కుటుంబ సభ్యులు, భాషా సాంస్కృతిక శాఖ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.



కాటేసిన పాము



బాధితుడు వెంకటేశ్

## నువ్వు కాటేస్తే వదలి పెడతానా?

- తల కొరికి తినేసిన బాధితుడు
- పడకపై పక్కన పెట్టుకొని నిద్రించిన వైనం

తొట్టంబేడు,సెప్టెంబర్ 19 ప్రభాతవార్త: తిరుపతి జిల్లా తొట్టంబేడు మండలం చియ్యవరం గ్రామానికి చెందిన ఓ బెల్దార్ పనులు చేసుకొని కుటుంబాన్ని పోషించుకుంటున్న వెంకటేష్(45) గురువారం రాత్రి తిరిగి ఇంటికి వెళ్ళే సమయంలో దారిలో పాము కాటేసింది. 'నువ్వు కాటేస్తే నిన్ను వదలి పెడతానా అంటూ ఆ పాము తలను కొరికి చంపి ఇంటికి వెళ్ళి తన పడక మీద పడుకోబెట్టుకున్నాడు. ఉదయం చూసుకున్న కుటుంబ సభ్యులు లబోదిబోమన్నారు. వెంటనే శ్రీకాళహస్తి ఏరియా ఆస్పత్రికి తరలించారు. ఇక్కడ సాధ్యం కాదనటంతో తిరుపతి రుయాకు తరలించి చికిత్స అందిస్తున్నారు. వివరాలిలా ఉన్నాయి.తొట్టంబేడు మండలం చియ్యవరం గ్రామం శ్రీకాళహస్తికి సుమారు 15 కిలో మీటర్ల దూరంలో ఉంది. ఈ గ్రామానికి చెందిన వెంకటేష్ ప్రతి రోజూ శ్రీకాళహస్తికి వచ్చి మేస్త్రీ పనులు చేసి నాలుగు రూకలు సంపాదించుకొని తిరిగి ఇంటికి వెళ్ళేవాడు. పగలంతా కష్టపడి పని చేసిన వెంకటేష్ రాత్రి ఇంటికి వెళ్ళే సమయంలో చేమూరు గ్రామంలోని మద్యం దుకాణం వద్ద మద్యం సేవించేవాడు. అలాగే గురువారం రాత్రి కూడా అక్కడ మద్యం సేవించాడు. నడచుకుంటూ వెళుతుండగా విద్యుత్ సబ్‌స్టేషన్ వద్ద ఓ పాము అతడిని కాటేసింది. మద్యం మత్తులో ఉన్న వెంకటేష్ 'నువ్వు కాటేస్తే వదలి పెట్టాలా?' అంటూ దానిని పట్టుకున్నాడు. పాము తల కొరికి తినేసాడు. అంతటితో ఆగలేదు. మిగతా పామును తనతో తీసుకెళ్ళాడు తను పడుకునే మంచంపై పక్కనే పడుకోబెట్టుకున్నాడు. ఉదయం బంధువులు చూసి బిత్తరపోయారు. లబోదిబోమంటూ బెంబేలెత్తారు. అప్పటికే వెంకటేష్ నోటి నుంచి నురుగ రావటంతో వెంటనే ఆస్పత్రికి తరలించారు.

## నేడు ఢిల్లీకి మంత్రి సవిత

విజయవాడ,సెప్టెంబరు19,ప్రభాతవార్త ప్రతినిధి: రాష్ట్ర బీసీ సంక్షేమ శాఖ మంత్రి ఎస్.సవిత శనివారం ఢిల్లీ పర్యటించనున్నారు. న్యూఢిల్లీలోని ఓక్ హాల్‌లో జరిగే కార్యక్రమంలో స్కోచ్ అవార్డును మంత్రి సవిత అందుకోనున్నారు. మెగా డీఎస్సీ, సివిల్ సర్వీసెస్ పోటీ పరీక్షలకు బీసీ స్టడీ సర్కిల్ ఆధ్వర్యంలో బీసీ నిరుద్యోగ యువతకు బీసీ సంక్షేమ శాఖ ఉచిత శిక్షణ అందజేసిన విషయం విధితమే. 6,470 మందికి ఉచిత శిక్షణ అందించగా, వారిలో 241 మంది టీచర్లగా ఎంపికయ్యారు. 83 మందికి సివిల్ సర్వీసెస్ ఉచిత కోచింగ్ అందజేయగా, వారిలో గ్రూప్ 2 మెయిన్స్‌కు 12 మంది, ఆర్.ఆర్.బి లెవల్–1కు పది మంది ఎంపికయ్యారు. మరికొన్ని ప్రభుత్వ ఉద్యోగాలకు మరికొందరు అర్హత సాధించారు. బీసీ నిరుద్యోగ యువతకు పోటీ పరీక్షల్లో ఉచిత శిక్షణ అందజేసినందుకు ప్రతిష్టాత్మక స్కోచ్ అవార్డు బీసీ సంక్షేమ శాఖకు వరించింది.

### 8వ వేతన సంఘాన్ని ఏర్పాటు చేయాలి

## లేదంటే... ఉద్యమం ఉధృతం



గుంతకల్లు రైల్వే, సెప్టెంబరు 19 ప్రభాతవార్త: కేంద్ర ప్రభుత్వం 8వ వేతన సంఘాన్ని తక్షణం ఏర్పాటు చేయాలని లేనిపక్షంలో కార్మికోద్యమాన్ని ఉధృతం చేస్తామని దక్షిణ మధ్య రైల్వే మజ్దూర్ యూనియన్ గుంతకల్లు డివిజన్ కార్యదర్శి డిఎస్ విజయకుమార్ ప్రకటించారు. అఖిల భారత రైల్వే కార్మిక సమాఖ్య (ఏఐఆర్ఎఫ్), దక్షిణ మధ్య రైల్వే మజ్దూర్ యూనియన్ ఇచ్చిన పిలుపు మేరకు శుక్రవారం గుంతకల్లు రైల్వే డివిజన్‌లోని యూనియన్ అన్ని బ్రాంచీలు, వర్క్‌షాప్‌ల వద్ద ధర్నాలు జరిగాయి. ఈ సందర్భంగా డీఎస్ విజయకుమార్, రిటైర్డ్ రైల్వే ఎంప్లాయిస్ ఫెడరేషన్ డివిజనల్ కార్యదర్శి మస్తాన్ వలీ, డివిజనల్ కోశాధికారి శ్రీనివాస్ శర్మ, సహాయ కార్యదర్శులు అశ్విని, శ్రీనివాసులు, పలువురు మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వ సిబ్బంది వేతనాలకు, పెన్షనర్ల పెన్షన్ సంబంధించి కరువు భత్యం 50శాతం దాటిన పక్షంలో వేతన సవరణ చేయాలని వారు డిమాండ్ చేశారు. ఇప్పటికే కేంద్ర ప్రభుత్వం నిర్లక్ష్యం కారణంగా తీవ్ర జాప్యం జరిగిందని ఇప్పటికైనా కేంద్రం స్పందించి 8వ కేంద్ర వేతన సంఘాన్ని ఏర్పాటు చేయాలని లేనిపక్షంలో రాబోయే రోజుల్లో కార్మికోద్యమాన్ని ఉధృతం చేస్తామన్నారు. ఈ ధర్నాలలో అధ్యక్ష, కార్యదర్శులు, అధిక సంఖ్యలో రైల్వే కార్మికులు, ఉద్యోగులు పాల్గొన్నారు.

## తెలంగాణ విద్యావిధానంలో టి-శాట్‌ను భాగస్వామిని చేస్తాం

### సిఎం సలహాదారు వేం నరేందర్‌రెడ్డి

**హైదరాబాద్, సెప్టెంబరు 19, ప్రభాతవార్త:** రాష్ట్ర ప్రభుత్వం రూపొందించబోనున్న తెలంగాణ విద్యా విధానం(టిఈపి)లో టి-సాట్ (తెలంగాణ స్కిల్స్ అకడమిక్స్ అండ్ ట్రైనింగ్)ను భాగస్వామిని చేస్తామని ముఖ్యమంత్రి సలహాదారు వేం నరేందర్ రెడ్డి ప్రకటించారు. శుక్రవారం హైదరాబాద్ జూబ్లీహిల్స్‌లోని టి-సాట్ కార్యాలయాన్ని వేం నరేందర్ రెడ్డి సందర్శించారు. టి-సాట్ సీఈవో బోదనపల్లి వేణుగోపాల్ రెడ్డి ఆయనకు ఘనస్వాగతం పలికారు. కార్యాలయంలోని విభాగాలన్నీ కలియ తిరిగిన వేం నరేందర్ రెడ్డి... టి-సాట్ పనితీరును పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు. ఆధునిక సాంకేతికతకు అనుగుణంగా స్టూడియోను అభివృద్ధి చేస్తామని హామీ ఇచ్చారు. అనంతరం జరిగిన సమీక్షలో నరేందర్ రెడ్డి మాట్లాడుతూ .. ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్ రెడ్డి తెలంగాణాలో విద్యా రంగాన్ని ప్రపంచ స్థాయికి తీసుకెళ్లాలనే కృత నిశ్చయంతో ఉన్నారన్నారు. అందులో భాగాంగానే విద్యాశాఖలో అనేక మార్పులు, చేర్పులు చేపట్టారని వివరించారు. తెలంగాణా రాష్ట్రంలో అమలు చేయబోయే నూతన విద్యావిధానంలో టి-సాట్ నెట్వర్క్‌ను భాగస్వామిని చేసి నెట్వర్క్ సేవలను విస్తృత పరుస్తామని హామీ ఇచ్చారు. ఫలితంగా డివిజల్ విద్యా భోదనలో రాష్ట్రంలోని విద్యార్థులకు మరిన్ని సేవలందించేందుకు అవకాశం లభిస్తుందని ఆశాభావం వ్యక్తం చేశారు. ఆన్‌లైన్ ద్వారా డిజిటల్ బోధనలు అందిస్తూ విద్యాప్రసార ఛానళ్లలో దేశంలోనే మొదటి స్థానంలో నిలిచిన టి-సాట్‌ను వేం నరేందర్ రెడ్డి అభినందించారు. శాటి లైట్, కేబుల్ నెట్వర్క్, ఓటీటీ వేదికల ద్వార 4.8 మిలియన్ యూజర్స్‌తో రెండవ స్థానం నుండి మొదటి స్థానంలో నిలపడం పట్ల టి-సాట్ సీఈవో బోదనపల్లి వేణుగోపాల్ రెడ్డి కృషిని అభినందించారు. విద్యా ఛానళ్లలో దేశంలోనే మొదటి స్థానాన్ని పదిలపరుచుకుని, రాష్ట్రంలోని విద్యార్థులకు, యువతతో పాటు ఇతర రంగాలకు సేవలందించేందుకు రాష్ట్ర ప్రభుత్వం పక్షాన పూర్తి సహాకరం ఉంటుందని నరేందర్ రెడ్డి హామీ ఇచ్చారు.



ఎన్‌సిఆర్‌బి డిప్యూటీ డైరెక్టర్‌గా నియమితులైన రెమా రాజేశ్వరి

## ఎన్‌సిఆర్‌బి డిప్యూటీ డైరెక్టర్‌గా రెమా రాజేశ్వరి

**హైదరాబాద్, సెప్టెంబరు 19, ప్రభాతవార్త:** జాతీయ నేర రికార్డుల బ్యూరో (ఎన్‌సిఆర్‌బి) డిప్యూటీ డైరెక్టర్‌గా తెలంగాణ కేడర్ ఐపిఎస్ అధికారిణి రెమా రాజేశ్వరి నియమితులయ్యారు. 2009 బ్యాచ్ ఐపిఎస్ అధికారిణి అయిన రెమా రాజేశ్వరి ప్రస్తుతం రాష్ట్ర మహిళా భద్రతా విభాగంలో డిఐజిగా వున్నారు. ఆమెను ఎన్‌సిఆర్‌బి డిప్యూటీ డైరెక్టర్‌గా నియమిస్తూ కేంద్ర హోం శాఖ శుక్రవారం ఆదేశాలు జారీ చేసింది. దీనికి సంబంధించిన ఉత్తర్వులను రాష్ట్రానికి పంపడంతోపాటు వెంటనే ఆమెను రిలీవ్ చేయాలని కోరింది. ఈ పోస్టులో ఆమె మూడేళ్లపాటు పని చేయనున్నారు. ఎన్‌సిఆర్‌బి కేంద్ర హోం శాఖ పరిధిలో న్యూఢిల్లీ కేంద్రంగా పనిచేస్తుంది.

# రైతన్న సేవలకు విద్యార్థులు ముందుండాలి



స్నాతకోత్సవంలో పాల్గొన్న గవర్నర్ జిష్ణుదేవ్‌వర్మ, మేనేజింగ్ డైరెక్టర్ డా. మీనేష్ షా, వర్సిటీ ఉపకులపతి డా. జ్ఞాన ప్రకాష్ తదితరులు

### పశువైద్య విభాగం అభివృద్ధి, పశుసంపద సంక్షేమానికి తోడ్పాడాలి

### పశువైద్య విశ్వవిద్యాలయం స్నాతకోత్సవంలో గవర్నర్ జిష్ణుదేవ్‌వర్మ

**హైదరాబాద్ (అత్తాపూర్) సెప్టెంబరు 19, ప్రభాతవార్త:** దేశంలోని రైతులకు సేవలం దించేందుకు విద్యార్థులు ముందుండాలని క్షేత్రస్థాయిలో రైతలకు అవగాహన కల్పించి తోడ్పాడాలని గవర్నర్ జిష్ణుదేవ్‌వర్మ పేర్కొన్నారు. శుక్రవారం పివి నరసింహారావు తెలంగాణ పశువైద్య విశ్వవిద్యాలయం 5వ స్నాతకోత్సవాన్ని వ్యవసాయ విశ్వవిద్యాలయం ఆడిటోరియంలో గవర్నర్ జిష్ణుదేవ్ అధ్యక్షతన నిర్వహించారు. గవర్నర్ మాట్లాడుతూ... తెలంగాణ బిడ్డ, మాజీ ప్రధాని పి.వి. నర్సింహారావు పేరు మీద ఏర్పాటైన ఈ విశ్వవిద్యాలయం ఐదో స్నాతకోత్సవానికి అధ్యక్షత వహించడం నాకు గర్వకారణమని, ఆయన ఆదర్శాలు విశ్వవిద్యాల యాన్ని ఎల్లప్పుడు సన్మార్గంలో నడిపిస్తుంటా యని పేర్కొన్నారు. ముందుగా ఈ అద్భుత మైలురాయిని చేరుకున్నం దుకు పట్టభద్రులైన విద్యార్థులందరినీ అభినందించి, ఇది వారి విద్యా ప్రయాణం ముగింపును కాక కొత్త ఆరంభానికి నాందిని సూచిస్తుందిని పేర్కొన్నారు. విద్యార్థులు పశువైద్య విభాగం అభివృద్ధికి, పశుసంపద సంక్షేమానికి తోడ్పడాలని వారిని కోరారు. ముఖ్యఅతిథిగా విచ్చేసిన జాతీయ పాడిపరిశ్రమ అభివృద్ధి బోర్డు (ఎన్‌డిడీబీ), ఆనంద్, గుజరాత్ చైర్మన్ మేనేజింగ్ డైరెక్టర్ డా. మీనేష్ షా మాట్లా డుతూ.. గ్రాడ్యుయేట్లు, పోస్ట్‌గ్రాడ్యుయేట్లు, డాక్టోరల్ పట్టా గ్రహీతలకు హృదయ పూర్వక అభినందనలు తెలుపుతూ, వారి కృషి, అంకిత భావంతోపాటు కుటుంబ సభ్యులు, అధ్యాపకుల సహకారం కూడా ప్రశంసించారు. విశ్వవిద్యా లయ ఉపకులపతి డా. జ్ఞానప్రకాష్ మాట్లాడుతూ.. యూనివర్సిటీ సాధించిన విజయాలు, పశువైద్య విద్య, పరిశోధన, విస్తరణ సేవలలో నైపుణ్యాన్ని పెంపొందించడానికి ఉన్న నిబద్ధతను వివరించారు. ఈ స్నాతకోత్సవంలో 2023-24లో పట్టభద్రులైన మొత్తం 524 మంది విద్యార్థులకు డిగ్రీలు ప్రదానం చేశారు. వీరిలో 16 మంది పీహెచ్.డి. పట్టభద్రులు , 69 మంది మాస్టర్ ఆఫ్ వెటర్నరీ సైన్స్ (ఎంవిఎస్‌సీ) పట్టభద్రులు, 345 మంది బ్యాచ్ లర్ ఆఫ్ వెటర్నరీ సైన్స్ అండ్ యానిమల్ హస్బెండ్రీ (బీవి ఎస్ సీ ఎహె చ్) పట్టభద్రులు, 54 మంది బి. టెక్ (డైరీ టెక్నాలజీ) పట్టభద్రులు, 40 మంది బాచిలర్ ఆఫ్ ఫిషరీ సైన్స్ పట్టభద్రులు, వివిధ విభాగాలలో విశిష్ట ప్రతిభ కనబరిచిన ప్రతిభావంతులైన విద్యార్థులకు 25 బంగారు పతకాల ప్రదానంతోపాటు అధ్యాపకుల కృషిని గుర్తించి రెండు విశ్వవిద్యాలయ మెరిటోరియస్ టీచర్ అవార్డులు ప్రదానం చేశారు.

# మహిళా సాధికారతకు పెద్దపీట

### మహిళలకు ఉచిత నైపుణ్య శిక్షణతోపాటు వ్యాపారాలకు వడ్డీలేని రుణాలు

### మంత్రి సీతక్క

**హైదరాబాద్, సెప్టెంబరు 19, ప్రభాతవార్త:** కూకట్పల్లి దుర్గాబాయి మహిళా శిశువికాస మహిళా ప్రాంగణంలో మహిళా ట్రైనింగ్ సెంటర్‌ను రాష్ట్ర పంచాయతీరాజ్ గ్రామీణ అభివృద్ధి, మహిళా శిశు సంక్షేమ శాఖ మంత్రి సీతక్క శుక్రవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా మంత్రి సీతక్క మాట్లాడుతూ, 'ప్రతి మహిళ మహారాణి కావాలంటే ఆర్థిక స్వావలంబన అవసరమని, చేతిలో డబ్బు ఉన్నప్పుడే మహిళలకు స్వేచ్ఛ, గౌరవం లభిస్తుందన్నారు. కుటుంబాభివృద్ధి, పిల్లలకు మంచి విద్య అందించాలంటే మహిళలు ఆర్థికంగా బలపడాలి' అన్నారు. కూకట్‌పల్లి మహిళా ప్రాం గణంలో ఉచిత శిక్షణతో పాటు రవాణా సౌకర్యం కల్పిస్తున్నామని, మహిళలు దీన్ని సద్వినియోగం చేసుకోవాలని పిలుపునిచ్చారు. డ్రైవింగ్ శిక్షణ పూర్తి చేసుకున్న మహిళల గ్రీన్ ఆటోలను జెండా ఊపి ప్రారంభించిన ఆమె, టు వీలర్, త్రీ వీలర్ ట్రైనింగ్ పూర్తి చేసిన మహిళలకు సర్టిఫికెట్లు అందజేశారు. శిక్షణ పూర్తయ్యాక వడ్డీ లేని రుణాలు అందించేందుకు ప్రభుత్వం కృషి చేస్తోందని మంత్రి తెలిపారు. మహిళా సంఘాల ద్వారా సోలార్ విద్యుత్ ఉత్పత్తి కేంద్రాలు, మహిళా శక్తి క్యాంటీన్లు, ఆర్టీసీ సేవల నిర్వహణ వంటి అవకాశాలను కల్పిస్తున్నామని, కోటి మంది మహిళలను కోటీశ్వరులుగా తీర్చిదిద్దడమే సీఎం రేవంత్‌రెడ్డి లక్ష్యమని మంత్రి సీతక్క అన్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే అరికెపూడి గాంధీ మాట్లాడుతూ, మహిళా సాధికారతకు తెలంగాణ ప్రభుత్వం పెద్దపీట వేస్తోంది. శేర్లింగంపల్లి నియోజక వర్గంలోఉన్న ఐటి కంపెనీల సిఎస్ఆర్ నిధులను మహిళా శిక్షణ కార్యక్రమాలకు వినియోగించేలా చర్యలు తీసు కుంటామని, అదేవిధంగా ప్రభుత్వ పాఠశాలల విద్యార్థుల యూనిఫాంలు కుట్టే అవకాశాన్ని కూకట్పల్లి మహిళా ప్రాంగణానికి అప్పగిస్తా మన్నారు. ఈ కార్యక్రమంలో ఉమెన్ కార్పొరేషన్ ఛైర్‌పర్సన్ బండ్రు శోభారాణి, మహిళా సంక్షేమ శాఖ సెక్రటరీ సీతారామచంద్రన్, ఉమెన్ కార్పొ రేషన్ ఎండి చంద్రకాంత్ రెడ్డి, అల్విన్ కార్పొరేటర్ వెంకటేష్ గౌడ్ తదితరులు పాల్గొన్నారు.




శుక్రవారం గాంధీభవన్‌లో మీడియాతో మాట్లాడుతున్న ఎంపి చామల కిరణ్‌కుమార్

## చంద్రబాబును బూచిగా చూపుతూ రేవంత్‌పై అసత్యప్రచారం

### ఎంపి చామలకిరణ్‌కుమార్‌రెడ్డి

**హైదరాబాద్, సెప్టెంబరు 19, ప్రభాతవార్త:** బనకచర్ల, చంద్రబాబును బూచిగా చూపుతూ రేవంత్‌పై అసత్యప్రచారం చేశారని ఎంపి చామల కిరణ్ కుమార్‌రెడ్డి విమర్శించారు. శుక్రవారం గాంధీభవన్‌లో విలేఖరుల సమావేశంలో మాట్లాడుతూ బనకచర్ల, ఆల్మట్టి విషయంలో కాంగ్రెస్ ప్రభుత్వం అలసత్వంగా లేదని తెలిపారు. పోతిరెడ్డి పాడుకు గండి కొట్టడానికి సహకరించింది బిఆర్‌ఎస్ ప్రభుత్వం అని ఆయన నిందించారు. కృష్ణా నీళ్లను ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం తరలించుకు పోతుంటే పదేండ్లు తెలంగాణ తొలి ముఖ్యమంత్రి కెసిఆర్ ఎందుకు సైలెంట్ ఉన్నారు? అని ప్రశ్నించారు. నేను మాట్లాడిన దాంట్లో కొంత భాగం తీసి ప్రచారం చేస్తున్నారునాపై ట్రోల్ చేస్తే భయపడి సైలెంట్ ఉంటానని బిఆర్‌ఎస్ నాయకులు భ్రమపడు తున్నారు కానీ నేను అలాంటి అసత్య ప్రచారాలకు వెరువను అని సమాధానం చెప్పారు. నేను ఒక్కరోజు ప్రెస్ మీట్ పెడితే బిఆర్‌ఎస్ సోషల్ మీడియా 3 రోజులు ప్రచారం చేస్తోందని ఇది ఒకందుకు నాకు లాభమేనని ఆయన అన్నారు. ఇరిగేషన్ ప్రాజెక్టుల విషయంలో బిఆర్‌ఎస్ నాయకులు తెలంగాణ ప్రజలను తప్పుదోవ పట్టిస్తున్నారని ఆయన ఆరోపించారు.

# తెలంగాణను ఎకో టూరిజం హాబ్ చేయాలి

### ఆలయాల వద్ద ఆధ్యాత్మిక పద్ధతిలో పర్యాటక రంగం అభివృద్ధి

### స్క్రీనింగ్ కమిటీ భేటీలో మంత్రి కొండా సురేఖ

**హైదరాబాద్, సెప్టెంబరు 19, ప్రభాతవార్త:** తెలంగాణను ఎకో టూరిజం హాబ్‌గా తీర్చిదిద్దేం దుకు తాము కృషి చేస్తున్నామని. రాష్ట్రంలోని పలు ప్రాంతాల్లో ఇప్పటికే ఎకో టూరిజం కోసం గుర్తించిన సైట్లలో సమగ్రంగా అభివృద్ధి చేపట్టాలని రాష్ట్ర అటవీ, పర్యావరణ, దేవాదాయ శాఖ మంత్రి కొండా సురేఖ అన్నారు. తెలంగాణ రాష్ట్రాన్ని జాతీయ, అంతర్జాతీయ పర్యాటక రంగంలో ఒక ప్రత్యేక ఎకోటూరిజం హబ్‌గా అభివృద్ధిచేయడం రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన లక్ష్యమన్నారు. తెలంగాణ టూరిజం పాలసీలో అంశాలను మనం ఎంత వరకు ఉపయోగించి. ఎకో టూరిజాన్ని మన రాష్ట్రంలో డెవలప్ చేయొచ్చన్న విషయాలను మంత్రి ప్రత్యేకంగాఅడిగి తెలుసుకున్నారు. శుక్రవారం డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ సచివాలయంలో ఎకోటూరిజం ప్రాజెక్టు స్క్రీనింగ్ కమిటీ సమావేశం మంత్రి అధ్యక్షతన జరిగింది. ఈ స్క్రీనింగ్ కమిటీ భేటీలో అనంతగిరి(వికారాబాద్), కనకగిరి(ఖమ్మం), నందిపేట్(నిజామాబాద్), మన్ననూర్ జంగల్ రిసార్టు(నాగర్ కర్నూల్), ముచ్చెర్ల ఎకో పార్కు(నల్గొండ), వైజాగ్ కాలనీ(నల్గొండ), మంజీరా(సంగారెడ్డి), అమరగిరి(నాగర్ కర్నూల్) తదితర ప్రాంతాల్లో ఎకో టూరిజం ప్రాజెక్టు అమలుపై సుదర్ఘీ చర్చ జరిగింది. ఎక్కడికక్కడ ఆయా ఎకో టూరిజం సెంటర్లలో స్థానిక



గిరిజనులు, ఇతర ప్రాంతాల ప్రజల ఆచార వ్యవహారాలు, సంస్కృతి, సాంప్రదాయాల ప్రకారం ఎకో టూరిజం ప్రాజెక్టులను అమలు చేయాలని సూచించారు. ఎకో టూరిజం డెవలప్ చేస్తున్న ప్రాంతాల్లో టెంపుల్స్ ఉంటే వాటిని కూడా ఆ మేరకు డెవలప్ చేయాలని సూచించారు. ఆధ్యాత్మిక పద్ధతిలో అభివృద్ధి చేయాల్సిన అవసరం ఉందన్నారు. మధ్యప్రదేశ్ లోని భీమ్‌బెక్కా కొండల తరహాలో నీలాద్రి కొండలపై ప్రాచీన కాలం నాటి గుర్తులు ఉన్నందున పర్యాటక ప్రాంతంగా ఎకో టూరిజం ప్రాంతంగా డెవలప్ చేయాలన్నారు.

ఈ ప్రాం తాన్ని ఎకో టూరిజం హబ్ గా డెవలప్ చేయా ల్సిన అవసరం ఉందని మంత్రి పేర్కొన్నారు. అవసరమైన నిధులు టూరిజం డిపార్టుమెంటు, ఎండోమెంటు శాఖ నుంచి తీసుకొని అయినా డెవలప్ చేయాలన్నారు. వికారాబాద్ అనంతగిరి హిల్స్ మొదటి దశ పనులు పూర్తయ్యాయని, రెండో దశలో కారవాన్ క్యాంపింగ్, ఎకో కాటేజీలు ఏర్పాటు చేయాలని నిర్ణయించిన విషయాన్ని అధికారులు మంత్రి దృష్టికి తీసుకొచ్చారు. ఖమ్మంలోని కనకగిరి ప్రాజెక్టు పనులు అక్టోబర్ 2025 నుంచి ప్రారంభమవుతాయని తెలిపారు. నల్గొండ ముచ్చర్ల ఎకో పార్క్ నైట్ సఫారీ, వీఆర్ పార్క్, డైనోసార్ పార్క్ వంటివి రూపకల్పన చేసినట్టు వివరించారు. సంగారెడ్డిలోని మంజీరా వన్యప్రాణి సంరక్షణ కేంద్రంలో భూసేకరణ, భూమి కేటాయింపు సమస్యల పరిష్కారం పెండింగ్‌లో ఉందన్నారు. నిజామాబాద్ నందిపేట్ , నాగర్‌కర్నూల్ మన్ననూరు , దొమల పెంట, అమరగిరి, పాకాల సరస్సు, కిన్నెరసాని, నాగార్జునసాగర్, వనస్థలి మొదలైన ప్రాంతాల ప్రాజెక్టులపై విస్తృతమైన చర్చ జరిగింది. ఎకో టూరిజం ప్రాజెక్టులు కేవలం ప్రకృతి వైభవం వరకే పరిమితం కాకుండా, అక్కడి ఆలయ ఆధ్యాత్మిక వాతావరణాన్ని కూడా ప్రతిబింబించేలా అభివృద్ధి చేయాలని మంత్రి కొండా సురేఖ సమావేశంలో ప్రస్తావించారు. ఎక్కడ ఆలయాలు ఉన్నాయో అక్కడి ఆధ్యాత్మికత, సంప్రదాయాలు, ధార్మిక విశ్వాసాలు ప్రతిబింబించేలా అభివృద్ధి చేయాల్సిన అవసరం ఉందన్నారు. ఈ సమావేశంలో తెలంగాణలో వివిధ జిల్లాల్లో జరుగుతున్న ఎకో టూరిజం ప్రాజెక్టుల పురోగతిని మంత్రి కొండా సురేఖ సమీక్షించారు.

# అక్టోబరు ఆఖరుకు సనత్‌నగర్ టిమ్స్ పనులు పూర్తి చేయాలి

### ఆర్‌అండ్‌బి అధికారులకు మంత్రి దామోదర రాజనర్సింహ ఆదేశం



**హైదరాబాద్, సెప్టెంబరు 19, ప్రభాతవార్త:** అక్టోబర్ చివరి నాటికి సనత్‌నగర్ టిమ్స్ పనులను పూర్తి చేయాలని ఆర్‌అండ్‌బీ అధికారులను వైద్య, ఆరోగ్య శాఖ మంత్రి దామోదర రాజనర్సింహ ఆదేశించారు. హాస్పిటల్ ప్రారంభించిన రోజు నుండే ప్రజలకు వైద్య సేవలు అందించే విధంగా అవసరమైన ఎక్విప్‌మెంట్, ఫర్నీచర్ అన్నీ ముందే సమకూర్చుకోవాలని హెల్త్ సెక్రటరీ క్రిస్టినా జడ్ చొంగ్తుకి మంత్రి సూచించారు. డాక్టర్లు, నర్సులు ఇతర వైద్య సిబ్బందిని నియమించుకోవాలని డీఎంఈ నరేంద్ర కుమార్‌ను ఆదేశించారు. సనత్‌నగర్, ఎల్బీనగర్, కొత్తపేట్ టిమ్స్ హాస్పిటళ్లు, నిమ్స్ హాస్పిటల్ విస్తరణ ప్రాజెక్ట్, వరంగల్ సూపర్ స్పెషాలిటీ హాస్పిటల్, మెడికల్ కాలేజీల నిర్మాణ పనులపై సచివాలయంలోని తన చాంబర్‌లో ఆర్ అండ్ బీ అధికారులతోపాటు వైద్య, ఆరోగ్యశాఖ ఉన్నతాధికారులతో మంత్రి శుక్రవారం సమీక్ష నిర్వహించారు. సమావేశంలో హెల్త్ సెక్రటరీ క్రిస్టినా, టీజీఎంఎస్‌ఐడీసీ ఎండీ ఫణీంద్రరెడ్డి, డీఎంఈ డాక్టర్ నరేంద్ర కుమార్, ఆర్‌అండ్‌బీ సీఈలు రాజేశ్వర్‌రెడ్డి, లింగారెడ్డి ఇతర అధికారులు, ఆయా భవనాలు నిర్మిస్తున్న కాంట్రాక్ట్ సంస్థల ప్రతినిధులు పాల్గొన్నారు. సనత్‌నగర్ నిర్మాణ పనులు చివరి దశలో ఉన్నాయని, అల్వాల్, ఎల్బీనగర్ టిమ్స్‌ల పనులు మరో 6 నెలల్లో పూర్తి అవుతాయని అధికారులు మంత్రికి వివరించారు.

సనత్‌నగర్ టిమ్స్‌ను ఈ ఏడాది చివరిలో ప్రారంభించి, ప్రజలకు అందుబాటులోకి తీసుకురావాలని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి సిచించిన విషయాన్ని అధికారులకు మంత్రి గుర్తు చేశారు. అక్టోబర్ చివరి నాటికల్లా అన్ని పనులను పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. ఆర్‌అండ్‌బీ, ఆరోగ్యశాఖ అధికారులు సమన్వయంతో పనిచేసుకోవాలని, ఎట్టి పరిస్థితుల్లోనూ పనులు ఆలస్యం కావొద్దన్నారు. ఎక్విప్‌మెంట్, ఫర్నీచర్ కొనుగోలు విషయంలో అన్ని జాగ్రత్తలు తీసుకోవాలని, డయాగ్నస్టిక్ ఎక్విప్‌మెంట్స్ అన్నీ అడ్వాన్స్‌డ్ టెక్నాలజీతో కూడినవే కొనుగోలు చేయాలని సూచించారు. సంబంధిత డిపార్ట్‌మెంట్ డాక్టర్ల అభిప్రాయాలను పరిగణలోకి తీసుకోవాలన్నారు. నిమ్స్ విస్తరణ ప్రాజెక్టు పనులపై మంత్రి వివరాలను సేకరించారు. పిజి స్టూడెంట్స్‌కు హాస్టల్ సదుపాయం కూడా అక్కడే ఉండాలని అధికారులను మంత్రి ఆదేశించారు. మహబూ బాబాద్, మంచిర్యాల్, జనగాం, వనపర్తి మెడికల్ కాలేజీ భవనాలను మరో 2 నెలల్లో అప్పగి స్తామని ఆర్‌అండ్‌బీ అధికారులు వెల్లడించారు. మరో 8 నెలల్లో మిగిలిన కాలేజీల పనులను పూర్తి చేస్తామని తెలి పారు. వరంగల్ సూపర్‌స్పెషాలిటీ హాస్పిటల్ పనులను ఈ యేడాది చివరికల్లా పూర్తి చేయా లని ఆర్‌అండ్‌బి అధికారులను మంత్రి ఆదేశించారు.

# అడ్వొకేట్ ప్రొటెక్షన్ యాక్ట్ అమలు చేయాలి

### 25న ధర్నాచౌక్‌లో న్యాయవాదుల న్యాయదీక్ష

**హైదరాబాద్, సెప్టెంబరు 19, ప్రభాతవార్త:** న్యాయవాదులపై జరుగుతున్న దాడులను తీవ్రంగా ఖండిస్తూ ఈనెల 25న న్యాయవాదుల న్యాయ దీక్ష చేపడుతున్నారు. శుక్రవారం తెలంగాణ జూనియర్ అడ్వకేట్ అసోసియేషన్ అధ్యక్షుడు జక్కుల వంశీకృష్ణ ఆధ్వర్యంలో జరిగే న్యాయవాదులపై ఇటీవల దాడులు పెరుగుతున్నాయి. వీరికి ఎస్సీ ఎస్టీ అట్రాసిటీ తరహాలో 'అడ్వకేట్ ప్రొటెక్షన్ యాక్ట్' తీసుకురావాలని ఆయన డిమాండ్ చేశారు. రాజస్థాన్ లాగా ఇక్కడ కూడా న్యాయవాదుల రక్షణ కోసం ప్రత్యేక యాక్ట్ తీసుకురావాలని ఆయన డిమాండ్ చేశారు. ఎమ్మెల్యేలకు సుమారు మూడు లక్షల వరకు వేతనాలు ఇస్తున్న ప్రభుత్వం..జూనియర్ అడ్వకేట్లకు 15వేలు స్టైఫండ్ ఎందుకు ఇవ్వడంలేదని ఆయన ప్రభుత్వాన్ని నిలదీశారు. జుడిషియల్ కమిషన్ ద్వారా జడ్జిలను



తెలంగాణ జూనియర్ అడ్వొకేట్ అసోసియేషన్ సమావేశంలో మాట్లాడుతున్న రాజ్యసభసభ్యుడు ఆర్.కృష్ణయ్య, చిత్రంలో అసోసియేషన్ అధ్యక్షుడు జక్కుల వంశీకృష్ణ, గుజ్జ కృష్ణ తదితరులు

న్యాయదీక్ష సన్నాహక సమావేశానికి బిసి సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షుడు, రాజ్యసభ సభ్యుడు ఆర్.కృష్ణయ్య ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన 25న జరిగే న్యాయవాదుల న్యాయ దీక్ష వాల్‌పోస్టర్‌ను ఆవిష్కరించి మాట్లాడారు. న్యాయవాద వృత్తి పవిత్రమైనది, సున్నితమైనది. తెగింపు, సహాసోపేతమైన వృత్తి. నియమించాలన్నారు. న్యాయమైన న్యాయవాదుల సమస్యలపై త్వరలో సిఎం రేవంత్‌రెడ్డితో చర్చిస్తానని హామీ ఇచ్చారు. తెలంగాణ జూనియర్ అడ్వకేట్ అసోసియేషన్ అధ్యక్షుడు జక్కుల వంశీకృష్ణ మాట్లాడుతూ నాయం కోసం పాటుపడే న్యాయవాదులకే రక్షణ లేదన్నారు.

# ప్రాధాన్యత క్రమంలో పనులను హేతుబద్ధం చేయండి

### మౌలిక వసతులు, మూలధన పనుల సబ్‌కమిటీ సమావేశంలో డిప్యూటీ సిఎం భట్టి విక్రమార్క

**హైదరాబాద్, సెప్టెంబరు 19,ప్రభాతవార్త:** అభివృద్ధి పనులను శాఖల వారీగా ప్రాధాన్యత క్రమంలో రేషనలైజేషన్ చేసుకొని రావాలని డిప్యూటీ సిఎం, సబ్ కమిటీ చైర్మన్ భట్టి విక్రమార్క మల్లు అన్నారు. శుక్రవారం డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ సచివాలయంలో మౌళికవసుతులు, మూలధన అభివృద్ధిపనుల సబ్ కమిటీ సమావేశం జరిగింది. సమావేశంలో మంత్రులు సబ్ కమిటీ సభ్యులైన ఉత్తమ్ కుమార్ రెడ్డి, దుద్దిల్ల శ్రీధర్ బాబు పాల్గొన్నారు. 1:3 శాతం చొప్పున ప్రతిపాదనలు తీసుకురావాలని, ప్రతిపాదనల సంఖ్య ఎక్కువగా ఉంటే సంవత్సరాల వారిగా ప్రాధాన్యత క్రమంలో విభజన చేయాలని అధికారులను డిప్యూటీ సీఎం ఆదేశించారు. సూచించిన మేరకు అన్ని శాఖల ప్రధాన కార్యదర్శులు వారంలోగా పూర్తిస్థాయి ప్రతిపాదనలతో సమావేశానికి రావాలని డిప్యూటీ సిఎం ఆదేశించారు. హామ్ రోడ్ల పనులకు సంబంధించిన టెండర్ల ప్రక్రియను వేగవంతం చేయాలని సబ్ కమిటీ సభ్యులు ఆర్ అండ్ బి, పంచాయతీరాజ్ శాఖ అధికారులను ఆదేశించారు. ఆర్‌అండ్‌బి, పంచాయతీరాజ్, పోలీస్ శాఖలో వచ్చిన ప్రతిపాదనలను సమావేశంలో సమీక్షి ంచారు. సమా వేశంలో చీఫ్ సెక్రటరీ రామకృష్ణారావు వివిధ శాఖల కార్యదర్శులు పంచాయతీరాజ్ ప్రిన్సిపల్ సెక్రెటరీ శ్రీధర్ తదితరులు

# సిపిఎస్ వారి డిఎ బకాయిలను చెల్లించాలి

### సిఎస్ రామకృష్ణారావుకు సిపిఎస్ యూనియన్ వినతి

**హైదరాబాద్, సెప్టెంబరు 19, ప్రభాతవార్త:** రాష్ట్రంలో కొనసాగుతున్న సిపిఎస్ ఉద్యోగులకి రావల్సిన డిఏ బకాయిలను చెల్లించాలని తెలంగాణ సిపిఎస్ యూనియన్ డిమాండ్ చేసింది. ఈ మేరకు సిపిఎస్ రాష్ట్ర అధ్యక్షులు స్థితప్రజ్ఞ ఆధ్వర్యంలో ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి రామకృష్ణారావుకి శుక్రవారం సచివాలయంలో వినతిపత్రం సమర్పించారు.


ఈ కార్యక్రమంలో యూనియన్ రాష్ట్ర నాయకులు కల్వల్ శ్రీకాంత్, నరేష్ గౌడ్, కోటకొండ పవన్, హైదరా బాద్ జిల్లా అధ్యక్షులు నరేందర్ రావుపాల్గొన్నారు. కరువు భత్యాని(డిఏ)కి కరువు వచ్చిందని యూనియన్ రాష్ట్ర అధ్యక్షులు స్థితప్రజ్ఞ ఆవేదన వ్యక్తం చేశారు. సిపిఎస్ ఉద్యోగులకు రావాల్సిన డిఏ బకాయిలను ఒకేసారి చెల్లించాలన్నారు. చీఫ్ సెక్రటరీ సానుకూలంగా స్పందించి ఫైనాన్స్ సెక్రటరీ దృష్టికి ఈ విషయం తీసుకెళ్తానని చెప్పారని సిపిఎస్ నాయకులు తెలిపారు. ఆరు నెలలకు ఒకసారి ఇచ్చే డిఏ రెండేళ్లకి ఇచ్చి .. అందులో వాయిదా పద్ధతిలో చెల్లించడం వల్ల సిపిఎస్ ఉద్యోగుల పరిస్థితి మూల్గే నక్కపై తాటికాయపడినట్లు అయిందన్నారు. సిపిఎస్ ఉద్యోగుల డిఏ బకాయిల బిల్లులు 17 ఈఎంఐలు 8, 28 ఈఎంఐ ఈ మూడు బిల్లులను.. సంబంధిత డిడివోలు సమర్పించి ఆడిట్ చేసినప్పటికీ బకాయిలు ప్రభుత్వం వద్ద ఏప్రిల్ 2025 నుండి పెండింగ్‌లో ఉన్నాయన్నారు.

# లంబాడాలను ఎస్టీ జాబితా నుండి తొలగించాలని కుట్ర

### మాజీ మంత్రి సత్యవతి రాథోడ్

**హైదరాబాద్ (ధర్నాచౌక్), సెప్టెంబరు 19, ప్రభాతవార్త:** లంబాడీలను ఎస్టీ జాబితానుంచి తొలగించాలని కుట్రలు చేస్తున్నారని మాజీ మంత్రి సత్యవతి రాథోడ్ ఆరోపించారు. శుక్రవారం ఇందిరాపార్కు ధర్నాచౌక్‌లో తెలంగాణ లంబాడీల ఆత్మగౌరవ వేదిక ఆధ్వర్యంలో లంబాడీల ఆత్మగౌరవ సభ నిర్వహించారు. ఈ సభకు మాజీ మంత్రులు సత్యవతి రాథోడ్, రెడ్యానాయక్, అమర్‌సింగ్, మాజీ ఎంపీలు ప్రొఫెసర్ సీతారాం నాయక్, కవిత, మాజీ ఎమ్మెల్యేలు శంకర్ నాయక్, రాష్ట్ర అధ్యక్షులు రామచంద్ర నాయక్‌లు హాజరై ప్రసంగించారు.

ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ లంబాడీ తెగకు, మిగతా తెగలకు చిచ్చుపెట్టాలని చూస్తున్న కొంతమంది కార్పోరేట్ శక్తులు, వాళ్ల వెనక ఉన్న రాజకీయ నాయకుల కుట్రలను మిగతా తెగలు అర్థం చేసుకుని, తిప్పి కొట్టాలని పిలుపునిచ్చారు. లంబాడా భాషను అధికార భాషగా గుర్తించాలని డిమాండ్ చేశారు. రాబోయే రోజుల్లో తెలంగాణ రాష్ట్రంలోని ప్రతి తండాకు లంబాడీ ప్రజలను చైతన్యం చేయటానికి బస్సు యాత్ర చేయాలని తీర్మానించారు. ఈ ఆత్మగౌరవ సభలో కరాటే రాజునాయక్, నెహ్రూనాయక్, సంపత్‌నాయక్, శరత్ నాయక్, రవీందర్ నాయక్, సుబ్బు నాయక్, నాము నాయక్, అశోక్ నాయక్, విజయేందర్‌నాయక్, సురేష్ నాయక్‌తో పాటు మాజీ చైర్మన్‌లు, 33 జిల్లాల ఉద్యోగ, ప్రజా, విద్యార్థి సంఘాల నాయకులు పెద్దఎత్తున హాజరయ్యారు.



ఆత్మగౌరవ సభలో ప్రసంగిస్తున్న మాజీమంత్రి సత్యవతిరాథోడ్

# తెర




ప్రస్తుతం ఉన్న కుర్ర హీరోయిన్లలో నభా నటేష్‌కి క్రేజ్ ఎక్కువ. సినిమాలు వాటి ఫలితాల విషయం పక్కన పెడితే సోషల్ మీడియాలో నభా ఆరబోత మామూలుగా ఉండదు. ఈ బ్యూటీ షేర్ చేసే ఫొటోల కోసం ఫ్యాన్స్ తెగ వెయిట్ చేస్తుంటారు. వాళ్లని ఏమాత్రం డిజప్పాయింట్ చేయకుండా ఫొటోలు వదులుతూ కనులవిందు చేస్తుంటుంది. తాజాగా వైట్ కలర్ ఔట్‌ఫిట్‌లో నభా చేసిన ఫొటో షూట్ అదిరిపోయింది. నభా నటేష్ ఎన్ని సినిమాలు చేసినా ఫ్యాన్స్‌కి మాత్రం ఇస్మార్ట్ శంకర్ ఎప్పటికీ గుర్తుండిపోతుంది. ఎందుకంటే ఈ సినిమాలో నభా అందాల ఆరబోత ఆ లెవల్లో ఉంటుంది. ముఖ్యంగా చిలక చిలక పాటలో నభా వేసిన స్టెప్పులు కురిపించిన గ్లామర్‌కి కుర్రాళ్లకి క్రష్ అయిపోయింది. అయితే అదే ఊపులో వెళ్తున్న నభా కెరీర్‌కి చిన్న బ్రేకులు వేసింది ఓ యాక్సిడెంట్. దాని నుంచి కోలుకొని మళ్లీ గతేడాది డార్లింగ్ చిత్రంతో ఆడియన్స్‌ని పలకరించింది ఈ కన్నడ బ్యూటీ.

## మంత్రి పొంగులేటి బయోపిక్..

తెలంగాణ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి జీవిత చరిత్ర ఆధారంగా శ్రీనన్న అందరివాడు పేరుతో బయోపిక్ రూపొందిస్తున్నారు. పొంగులేటి పాత్రను ప్రముఖ హీరో సుమన్ పోషించనున్నారు. సాధారణ వ్యక్తి నుంచి కాంట్రాక్టర్, పొలిటీషయన్‌గా ఎలా గెలిచిన తీరుపై ఆకట్టుకునే సన్నివేశాలు ఉంటాయని తెలుస్తోంది. అనంతరం బీఆర్ఎస్‌లో చేరిక.. అక్కడ ప్రాధాన్యం దక్కకపోవడంతో కాంగ్రెస్‌లో చేరి ఆ పార్టీ గెలుపులో ఎలా కీలక పాత్ర పోషించాడనే అంశాలపై సీన్లు ఉంటాయని సమాచారం. కాంట్రాక్టర్ పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి..




మారడన్నది ప్రధాన కథగా తెలుస్తోంది. బయ్యా వెంకట నర్సింహా రాజ్ ఈ సినిమాకు దర్శకత్వంతో పాటు నిర్మాతగా కూడా ఉన్నారు. కాసర్ల శ్యామ్ పాటలు రాస్తున్నారు. శ్రీ వెంకట్ సంగీతం అందిస్తున్నారు. త్వరలో ఈ సినిమా షూటింగ్ ప్రారంభం కానుందని మేకర్స్ తెలిపారు. అయితే.. ఈ సినిమాలో పొంగులేటి కష్టపడి సాధారణ కాంట్రాక్టర్ స్థాయి నుంచి ప్రముఖ కాంట్రాక్టర్‌గా మారిన అంశాలతో పాటు రాష్ట్రంలో వైసీపీకి ప్రతికూల పరిస్థితులు ఉన్న సమయంలో ఆ పార్టీని ఎంచుకుని ఎంపీగా అభిమానుల శ్రీనన్నగా ఎలా మారాడు?, ఆయన చేస్తున్న సహాయక కార్యక్రమాలపై సన్నివేశాలు ఉంటాయని తెలుస్తోంది. ఈ సినిమా కోసం పొంగులేటి అభిమానులు ఆసక్తిగా ఎదురు చూస్తున్నారు. రాజకీయ వర్గాల్లోనూ ఈ చిత్రంపై తీవ్ర చర్చ సాగుతోంది. జగన్, కేసీఆర్, రేవంత్ రెడ్డి, కేటీఆర్ తదితర నాయకులకు సంబంధించిన సీన్లు ఈ సినిమాలో ఉంటాయా? ఆ పాత్రలను ఎవరు పోషిస్తారు? అన్న ఉత్కంఠ నెలకొంది. సినిమా విడుదలైన తర్వాతనే ఈ ప్రశ్నలకు సమాధానం లభించే ఛాన్స్ ఉంది.

## సుకుమార్ రైటింగ్స్ @ 10 వసంతాలు



పుష్పా ఫ్రాంచైజీతో ఆల్ టైం ఇండియన్ ఇండస్ట్రీ హిట్ స్థాయికి చేరిన దర్శకుడు సుకుమార్, తెలుగు రాష్ట్రాలకే కాకుండా జాతీయ స్థాయిలో కూడా కల్ట్ ఫిల్మ్ మేకర్‌గా గుర్తింపు పొందారు. అయితే తెలుగు ప్రేక్షకుల దృష్టిలో సుకుమార్ గొప్పతనం బాక్సాఫీస్ విజయాలకు, స్టార్‌డమ్‌కి మించి ఉంది. ఒకవైపు స్టార్ హీరోల చిత్రాలకు దర్శకత్వం వహిస్తూనే మరో వైపు సుకుమార్ రైటింగ్స్ బ్యానర్ ద్వారా క్రేజీ పాన్ ఇండియా చిత్రాలతో పాటు కొత్తదనంతో కూడిన వైవిధ్యమైన చిత్రాలను అందించడంలో కూడా ముందంజలో ఉన్నారు. ఇప్పటి వరకు ఈ పది వసంతాల కాలంలో సుకుమార్ రైటింగ్స్‌లో కుమారి 21ఎఫ్, ఉప్పెన, విరూపాక్ష, 18 పేజెస్, పుష్ప2, గాంధీ తాత చెట్టు వంటి బ్లాక్‌బస్టర్ చిత్రాలు అగ్ర నిర్మాణ సంస్థలతో నిర్మాణ భాగస్వామ్యంలో పాలు పంచుకుంటూ సుకుమార్ రైటింగ్స్ బ్యానర్‌పై రూపొందాయి. ఈ సినిమాలు కొత్త ప్రతిభను పరిచయం చేయడంతో పాటు, తెలుగు సినిమాకి కొత్త ఊపును ఇచ్చాయి. ఈ ప్రయాణంలో అత్యంత ప్రతిష్టాత్మక విజయంగా నిలిచింది పుష్పా 2: ది రూల్. ఈ చిత్రం భారతదేశం మొత్తంలోనే కాకుండా విదేశాల్లో కూడా రికార్డులు బద్దలు కొట్టింది. బాక్సాఫీస్‌ను దాటి, ఇది ఒక సాంస్కృతిక ప్రభావాన్ని కలిగించిన చిత్రంగా నిలిచింది. ఇది సుకుమార్ సృజనాత్మకత ఎంతదాకా వెళ్తుందో స్పష్టంగా చూపించింది. అంతేకాదు సుకుమార్ రైటింగ్స్ బ్యానర్ నిర్మాణ విలువలు కూడా చాటిచెప్పింది. ఇప్పుడు భారతదేశం అంతా ఎదురు చూస్తున్న ప్రాజెక్టులలో ఒకటైన పెద్ది. గ్లోబల్ స్టార్ రామ్ చరణ్ హీరోగా బుచ్చిబాబు సానా దర్శకత్వంలో రూపొందుతున్న సినిమా కూడా సుకుమార్ రైటింగ్స్ నిర్మాణ భాగస్వామ్యంలో తెరకెక్కుతోంది. అలాగే, యువ సామ్రాట్ నాగచైతన్య హీరోగా దర్శకుడు కార్తీక్ దండు రూపొందిస్తున్న తాజా చిత్రంలో కూడా సుకుమార్ రైటింగ్స్ భాగస్వామంగా ఉంది. ప్రస్తుతం సుకుమార్ గ్లోబల్ స్టార్ రామ్ చరణ్‌తో తెరకెక్కే కొత్త చిత్రానికి స్క్రిప్ట్ సిద్ధం చేస్తూ, ప్రీవిజువలైజేషన్ పనుల్లో నిమగ్నంగా ఉన్నారు. అంతేకాదు, ఈ చిత్రానికి దర్శకత్వంతో పాటు సుకుమార్ రైటింగ్ నిర్మాణ భాగస్వామ్యంగా కూడా ఉంది. సమాచారం ప్రకారం, ఇంకా ఆరు స్క్రిప్టులు నిర్మాణానికి సిద్ధంగా ఉన్నట్లు తెలుస్తోంది. ఈ సినిమాలు సుకుమార్ రైటింగ్స్‌పై తెరకెక్కడానికి సిద్ధంగా ఉన్నాయి. ఈ ఆరు కథలు కూడా దేశవ్యాప్తంగా ప్రభావం చూపగల సామర్థం కలిగి ఉన్నాయని పేర్కొంటున్నారు. సుకుమార్ రైటింగ్స్ 10వ సంవత్సరంలోకి ప్రవేశిస్తున్న సమయంలో, ఈ సంస్థ కొత్త ప్రతిభను ప్రోత్సహిస్తూ, యూనివర్శల్‌గా అందరిని మెప్పించే భావోద్వేగపూరిత కథలు చెబుతూ తెలుగు సినిమా స్థాయిని మరో మెట్టు ఎక్కించే దిశలో ఉంది.

## యాడ్ షూట్ చేస్తూ ప్రమాదం
### స్వల్ప గాయాలు



టాలీవుడ్ స్టార్ హీరో, మ్యాన్ ఆఫ్ మాసెస్ జూనియర్ ఎన్టీఆర్ యాడ్ షూటింగ్‌లో గాయపడ్డారు. హైదరాబాద్‌లో ఓ ప్రైవేట్ యాడ్ షూటింగ్‌లో ఆయన ప్రమాదానికి గురయ్యారు. వెంటనే మెడికల్ టీమ్ ప్రాథమిక చికిత్స అందించింది. స్వల్ప గాయమే కావడంతో ఎన్టీఆర్ ఆరోగ్యం సవ్యంగా ఉందని టీమ్ తెలిపింది. ప్రస్తుతం ఆయన విశ్రాంతి తీసుకుంటున్నారు. తారక్ త్వరగా కోరుకోవాలని ఫ్యాన్స్ కోరుకుంటున్నారు. విషయం తెలిసిన వెంటనే పలువురు సెలబ్రిటీలు ఎన్టీఆర్‌కు ఫోన్ చేసి క్షేమ సమాచారం తెలుసుకున్నట్లు సమాచారం. వైద్యుల సలహా మేరకు, పూర్తిగా కోలుకోవడానికి ఆయన వచ్చే రెండు వారాలు విశ్రాంతి తీసుకుంటారు. ఎన్టీఆర్ ఆరోగ్య పరిస్థితి నిలకడగానే ఉంది. అభిమానులు ఆందోళన చెందాల్సిన అవసరం లేదు. అభిమానులు, మీడియా, ప్రజలు ఎటువంటి ఊహాగానాలు వ్యాప్తి చేయకుండా ఉండాలని మనస్ఫూర్తిగా కోరుతున్నాము అని ఎన్టీఆర్ టీం ప్రకటన విడుదల చేసింది.

## మోటార్ సైకిల్ రేసర్



చార్మింగ్ స్టార్ శర్వా తన 36వ మూవీలో స్కిల్డ్ మోటార్ సైకిల్ రేసర్‌గా కనిపించబోతున్నారు. అభిలాష్ కంకర దర్శకత్వంలో ప్రతిష్టాత్మక యువి క్రియేషన్స్ ఈ చిత్రాన్ని నిర్మిస్తోంది. ప్రస్తుతం ఈ సినిమా షూటింగ్ హైద రాబాద్‌లో జరుగుతోంది. శర్వా, టీమ్‌పై రేస్‌కు సంబం ధించిన కీలక సన్నివేశాలను చిత్రీకరిస్తున్నారు. ఈ సన్నివేశాలు సినిమాలో హైలైట్‌గా వుండబో తున్నాయి. శుక్రవారం మేకర్స్ శర్వానంద్ పర్సనల్ స్టిల్స్‌ని విడుదల చేశారు. స్టైలిష్ మేకోవర్‌లో శర్వా లుక్స్ అదిరిపోయాయి. శర్వా ఫ్యాషన్ ట్రెండీ క్లాసీ లుక్‌లో ఆకట్టుకున్నారు. యూ నిక్ క్యారెక్టర్స్‌తో ఆకట్టుకునే శర్వా, ఈ చిత్రంలో ఓ ఛాలెంజింగ్ క్యారెక్టర్ చేస్తున్నారు. మును పెన్నడూ లేని విధంగా ఆడ్రినలిన్ రష్‌ని ఇచ్చే స్టంట్స్‌తో అదరగొట్ట బోతు న్నారు. ఈ చిత్రంలో మాళవిక నాయర్ కథానా యికగా నటించగా, బ్రహ్మా జీ, అతుల్ కులకర్ణి కీలక పాత్రలు పోషించారు. వంశీ, ప్రమోద్ నిర్మిస్తున్న ఈ హైఎనర్జీ మూవీ మోటో క్రాస్ రేసింగ్ బ్యాక్ డ్రాప్ లో ఉండబోతోంది. ఈ చిత్రానికి జె యువరాజ్ సినిమాటోగ్రఫీని నిర్వహిస్తూ, ఎక్సయిటింగ్ విజువల్స్ ని అందిస్తున్నారు. గిబ్రాన్ ఈ చిత్రానికి డైనమిక్ సౌండ్‌ట్రాక్‌ను కంపోజ్ చేస్తున్నారు. అనిల్ కుమార్ పి ఎడిటర్‌గా, ఎన్ సందీప్ ఎగ్జిక్యూటివ్ నిర్మాతగా వ్యవహరిస్తున్నారు. రాజీవన్ ప్రొడక్షన్ డిజైనర్, ఎ పన్నీర్ సెల్వం ఆర్ట్ డైరెక్టర్.

## ప్రేమకు మరణం లేదు




ప్రేమలో రెండోసారి చిత్రం టీజర్ రిలీజ్ వేడుకలో పాల్గొన్న దర్శకులు తేజ

సాకే రామయ్య సమర్పణలో సిద్ధ క్రియేషన్ బ్యానర్‌లో సత్య మార్క దర్శకత్వంలో, ప్రొడ్యూసర్ సాకే నీరజ లక్ష్మి నిర్మిస్తున్న చిత్రం ప్రేమలో రెండోసారి. ఈ చిత్రానికి సంబంధించి టీజర్ ప్రముఖ అగ్ర దర్శకులు తేజ చేతుల మీదుగా జరిగింది. ఈ సందర్భంగా తేజ మాట్లాడుతూ ప్రేమలో రెండోసారి సినిమా టీజర్ చాలా బాగుంది. ఈ భూమి ఉన్నంతవరకు ప్రేమకు మరణం లేదని, లవ్ కంటెంట్‌తో తీసిన సినిమాలు ఎప్పటికీ ఆదరణ పొందుతూనే ఉంటుందని చెప్పారు. సినిమా హీరో రమణ సాకే మాట్లాడుతూ. లవ్ కంటెంట్‌తో ఎన్నో విజయాలు సాధించిన తేజ ద్వారా ఈ సినిమా టీజర్ రిలీజ్ కావడం ఒక యాదృచ్ఛికం. ఆయన తీసిన సినిమా లాగానే ఈ సినిమా కూడా సక్సెస్‌ని పొందుతుందన్నారు. డైరెక్టర్ సత్య మార్క మాట్లాడుతూ ఈ సినిమా లేటెస్ట్ ట్రెండ్ తగ్గట్టుగా నేటి యువతీ యువకులకు బాగా కనెక్ట్ అవుతుంది. సినిమా పోస్ట్ ప్రొడక్షన్ కంప్లీట్ చేశామని, అక్టోబర్లో రిలీజ్‌కి వెళ్తున్నామని, చిన్న సినిమాలలో పెద్ద విజయాన్ని సాధించే చిత్రం అవుతుందని ఆశాభావం వ్యక్తం చేశారు. హీరోయిన్ వనిత గౌడ మాట్లాడుతూ ఈ సినిమాలో బ్యాక్ గ్రౌండ్ మ్యూజిక్ మనసుకు హత్తుకునేలా ఉందని, కెమెరా ఫోటోగ్రఫీ చాలా బాగా వచ్చిందని, స్టోరీ, మ్యూజిక్ ద్వారా ప్రతి ఒక్కరూ మైమరిచి సినిమాకు కనెక్ట్ అవుతారని చెప్పారు. ఇందులో నటీ నటులు హీరో రమణ సాకే, హీరోయిన్ వనిత గౌడ, మరియు జబర్దస్త్ శ్రీను, బాబీ, దుర్గారావు, జబర్దస్త్ ఫణి, రాణి, సతీష్ సారపల్లి, చిరంజీవి, విక్టర్, ప్రదీప్, బి ఎస్ మన్యం, సురేష్ అవ్వరు. తదితరులు నటించారని వివరించారు.

## సినీ రచయిత ఆకెళ్ళ ఇకలేరు

దాదాపు వంద చిత్రాలకు రచన చేసిన ప్రముఖ కథ, మాటల రచయిత ఆకెళ్ళ (ఆకెళ్ళ వెంకట సూర్యనారాయణ) హైదరాబాద్‌లో గురువారం రాత్రి కన్నుమూశారు. ఆంధ్రప్రదేశ్ తూర్పు గోదావరి జిల్లా కాకినాడలో ఫిబ్రవరి 10, 1950లో ఆకెళ్ళ జన్మించారు. బాల్యంలోనే నటుడిగా నాటక రంగంలోకి అడుగుపెట్టారు. ఆ తర్వాత బాలల పత్రికలకు కథలు రాయడంతో రచయితగా ప్రస్థానం మొదలు పెట్టారు. డిగ్రీ పూర్తి అయిన తర్వాత నాటికలు, నాటకాలు, పద్య నాటకాలు రాశారు. విజయ బాపినీడు దర్శకత్వం వహించిన చిరంజీవి సినిమా మగమ హారాజుతో ఆయన సినీ రచయతగా కెరీర్ ప్రారంభించారు. కె. విశ్వనాథ్ దర్శకత్వం వహించిన స్వాతిముత్యం, శ్రుతిలయలు, సిరివెన్నెల చిత్రాలకు ఆకెళ్ళ రచన చేశారు. గీత రచయిత సీతారామశాస్త్రికి స్నేహితుడైన ఆకెళ్ల..విశ్వనాథ్‌కు ఆయన్ని పరిచయం చేసి సిరివెన్నెలకు పాటలు రాసేలా చేశారు. ఆడదే ఆధారం, శ్రీమతి ఒక బహుమతి, ఆయనకు ఇద్దరు, చిలకపచ్చ కాపురం, ఔనన్నా కాదన్నా, ఎంత బావుందో తదతర చిత్రాలు ఆయనకు మంచి పేరు తెచ్చిపెట్టాయి. నరేశ్ హీరోగా ఆకెళ్ళ అయ్యయ్యో బ్రహ్మయ్య చిత్రాన్ని డైరెక్ట్ చేశారు. నాటక రచయితగా ఆకెళ్ళకు మంచి గుర్తింపు ఉంది. ఆయన రాసిన నాటికలతో మూడు సంపుటాలు విడుదల అయ్యాయి. ఆకెళ్ళ సినీ, నాటక రంగాలకు సంబంధించి మొత్తం 13 నంది అవార్డులు అందుకున్నారు. అలానే ఆయన రాసిన కథలకూ బహుబతులు వచ్చాయి. ఆకెళ్ళ రాసిన తొలి నాటకం కాకి ఎంగిలి సాహిత్య అకాడమీ అవార్డును పొందింది. ఆయన రెండు వందల కథలు, ఇరవై నవలలు, 800కు పైగా టీవీ ఎపిసోడ్స్ కు రచన చేశారు. అలానే ఖిల్లసాని పెద్దన్న, రాణి రుద్రమ, రాణా ప్రతాప్‌ఖి వంటి చారిత్రక నాటకాలు రాశారు. ఆకెళ్ళ కు నలుగురు అమ్మాయిలు. ఒక అబ్బాయి. ఆయన భౌతిక కాయానికి శనివారం హైదరాబాద్ నిజాంపేటలో అంత్యక్రియలు జరుగనున్నాయి. ఆకెళ్ళ మృతి పట్ల తెలుగు సినీ రచయితల సంఘం తీవ్ర సంతాపం తెలియచేసింది.



## బిల్డప్‌లు ఎక్కువైనయ్ తగ్గించుకో..

సక్సెస్ ఫుల్ హీరో కిరణ్ అబ్బవరం నటిస్తున్న కొత్త సినిమా 'రేర్యాంప్' టీజర్ రిలీజైంది. ఈ టీజర్ సినిమాలోని హెవీ ఎంటర్ టైన్ మెంట్‌కు చిన్న శాంపిల్ చూపించింది. కేరళ బ్యాక్ డ్రాప్‌లో ఒక ఎనర్జిటిక్ ఎంటర్ టైనర్‌గా ఈ సినిమా ఉండబోతున్నట్లు టీజర్ ద్వారా తెలుస్తోంది. కుమార్ క్యారెక్టర్‌లో రిచ్చెస్ట్ చిల్లర్ గయ్‌గా కిరణ్ అబ్బవరం చేసిన సందడి, ఫన్‌తో టీజర్ ఆకట్టుకుంది. ఫుల్ ఎనర్జీతో యాక్టర్‌గా కంప్లీట్‌గా ఓపెన్ అప్ అయ్యి కుమార్ క్యారెక్టర్ లో నటించారు కిరణ్ అబ్బవరం. తన స్క్రీన్ ప్రెజెన్స్, బ్యూటీతో కేరళ అమ్మాయి మెర్సీ క్యారెక్టర్‌కు హీరోయిన్ యుక్తి తరేజా పర్ఫెక్ట్‌గా సెట్ అయ్యింది. సాయి కుమార్, మురళీధర్ గౌడ్, వెన్నెల కిషోర్, శివన్నారాయణ వంటి యాక్టర్స్ కీ రోల్స్ చేశారు. ఇంతమంది చెప్పినా ప్రేమించావంటే నువ్వు డెఫనెట్‌గా డెవిల్ గిఫ్టెడ్ చైల్డ్ రా..అరేయ్ నీకు అందరూ చెబుతున్నార్రా బిల్డప్‌లు ఎక్కువైనయ్ తగ్గించుకోమని, ఏం చేద్దాం, అవే చేద్దాం.. అనే డైలాగ్స్ టపాసుల్లా పేలాయి. లవ్, రొమాన్స్, యాక్షన్, ఫన్‌తో కంప్లీట్ ఎంటర్ టైనర్‌గా రేర్యాంప్ ఉండబోతున్నట్లు టీజర్ ద్వారా తెలుస్తోంది. ఈ టీజర్ సినిమా మీద మరిన్ని ఎక్స్ పెక్టేషన్స్ పెంచేస్తోంది. ఈ సినిమాను ప్రముఖ నిర్మాణ సంస్థ హాస్య మూవీస్, రుద్రాంశ్ సెల్యులాయిడ్ బ్యానర్‌ల మీద రైజింగ్ ప్రొడ్యూసర్ రాజేష్ దండ, శివ బొమ్మకు సంయుక్తంగా నిర్మిస్తున్నారు. 'రేర్యాంప్' సినిమాకు జైన్స్ నాని దర్శకత్వం వహిస్తున్నారు. ఈ మూవీ దీపావళి పండుగ సందర్భంగా అక్టోబర్ 18న గ్రాండ్ థియేట్రికల్ రిలీజ్ కు రాబోతోంది.



## కెరీర్ కోసం ప్రేమనే వదిలేశా
-అమీషా పటేల్




బాలీవుడ్ హీరోయిన్ అమీషా పటేల్ ప్రస్తుతం సినిమాలకు కొద్దిగా గ్యాప్ ఇచ్చింది. గదర్ 2తో రీఎంట్రీ ఇచ్చి భారీ విజయాన్ని అందుకున్న అమీషా.. ఆ తరువాత తౌబా తేరా తల్వా అనే సినిమాలో కనిపించింది. గతేడాది రిలీజ్ అయిన ఈ సినిమా ఆశించిన ఫలితాన్ని అందించలేకపోయింది. ఆ తరువాత నుంచి అమీషా ఒక్క ప్రాజెక్ట్ ను కూడా ఓకే చేయలేదు. అమ్మడి సినిమాల గురించి పక్కన పెడితే.. 50 ఏళ్లు వచ్చినా అమీషా పెళ్లి చేసుకోలేదు. ఇప్పటివరకు ఆమె ఎందుకు పెళ్లి చేసుకోలేదు అన్న విషయం మాత్రం ఎవరికి తెలియదు.

ఎట్టకేలకు అమీషా ఆ సీక్రెట్‌ను రివిల్ చేసింది. తాజాగా ఒక ఇంటర్వ్యూలో అమీషా 50 ఏళ్లు వచ్చినా ఇంకా ఎందుకు పెళ్లి చేసుకోలేదో వివరించింది. చాలామంది హీరోయిన్స్.. పెళ్లి చేసుకొని కెరీర్‌ను వదిలేస్తూ ఉంటారు. కానీ, అమీషా మాత్రం కెరీర్ కోసం ప్రేమనే వదిలేసాను అని చెప్పుకొచ్చింది. తానేమీ పెళ్లికి వ్యతిరేకిని కాను కానీ, తన ఇష్టాలను గౌరవించేవాడు వస్తే కచ్చితంగా పెళ్లి చేసుకుంటానని చెప్పుకొచ్చింది. ఇప్పటికీ నాకు చాలా పెళ్లి ప్రపోజల్స్ వస్తున్నాయి. నాకన్నా వయస్సులో సగం ఉన్నవారు కూడా నన్ను పెళ్లి చేసుకుంటానికి రెడీ అంటున్నారు.

కానీ, వారందరూ పెళ్లి తరువాత సినిమాలు వద్దు అని చెప్తున్నారు. అందుకే నేను పెళ్లి చేసుకోవడం లేదు.

50 ఏళ్లుగా పెళ్లి చేసుకోకపోవడానికి కారణం ఇదే. మనల్ని ప్రేమించేవారు మనం ముందుకు వెళ్ళాలి అని కోరుకోవాలి. అలాంటి వారు నా జీవితంలో ఇంకా రాలేదు. గతంలో నేను ఒక వ్యక్తిని ప్రేమించాను. అతను కూడా పెళ్లి తరువాత సినిమాలు వద్దు అన్నాడు. కేరర్ కోసం నేను ఎన్నో వదులుకున్నాను. ప్రేమ కన్నా కెరీర్ గొప్పదనిపించింది. అందుకే ప్రేమనే వదిలేశాను. నాకు తగినవాడు వచ్చినప్పుడు నేను పెళ్లి చేసుకుంటాను అంటూ అమీషా చెప్పుకొచ్చింది. ప్రస్తుతం ఈ వ్యాఖ్యలు సోషల్ మీడియాలో వైరల్‌గా మారాయి.

## మొత్తం లెక్కవేసి చూస్తే .. చివరికి ధర్మమే గెలుస్తుంది



యాక్షన్ కింగ్ అర్జున్, ఐశ్వర్య రాజేష్ లీడ్ రోల్స్‌లో నటిస్తున్న 'ముఫ్తీ పోలీస్' చిత్రాన్ని నిర్మాత జి. అరుల్ కుమార్ సమర్పణలో జి.ఎస్. ఆర్ట్స్ నిర్మిస్తోంది. నూతన దర్శకుడు దినేష్ లెట్చుమనన్ దర్శకత్వం వహించిన ఈ చిత్రం పవర్ ఫుల్ టీజర్ లాంచ్ అయ్యింది. క్రైమ్ థ్రిల్లర్‌గా రూపొందిన ఈ టీజర్ థ్రిల్లింగ్ సన్నివేశాలతో అంచనాలను పెంచింది. ఇంటర్నెట్ అంతటా ప్రేక్షకుల నుండి ప్రశంసలను అందుకుంది. కొన్నిసార్లు చట్టాన్ని దాటి న్యాయం ఉంటుంది. ఇంకొన్నిసార్లు న్యాయాన్ని దాటి ధర్మం ఉంటుంది. కానీ మొత్తం లెక్కవేసి చూస్తే చివరికి ధర్మమే గెలుస్తుంది అని అర్జున్ చెప్పిన డైలాగ్ స్టోరీ సెంట్రల్ ఐడియాని ప్రజెంట్ చేస్తోంది. యాక్షన్ కింగ్ అర్జున్ పెర్ఫార్మెన్స్ అదిరిపోయింది. ఐశ్వర్య రాజేష్ ఇంటెన్స్ క్యారెక్టర్‌లో ఆకట్టుకున్నారు. ఇన్వెస్టిగేషన్ సీన్స్ థ్రిల్లింగ్ వున్నాయి. స్టైలిష్ మేకింగ్‌తో టీజర్ ఆకట్టుకుంది. ఈ చిత్రంలో బిగ్ బాస్ ఫేమ్ అభిరామి, రామ్‌కుమార్, జి.కె. రెడ్డి, పి.ఎల్. తేనప్పన్, లోగు, వేల రామమూర్తి, తంగదురై, ప్రాంక్‌స్టర్ రాహుల్, ఓ.ఎ.కె. సుందర్ తదితరులు నటించారు. శరవణన్ అభిమన్యు సినిమాటోగ్రఫీని నిర్వహిస్తున్నారు, ఆశివాగన్ సంగీతం అందిస్తున్నారు. లారెన్స్ కిషోర్ ఎడిటర్. అరుణ్ శంకర్ ఆర్ట్ డైరెక్టర్, యాక్షన్ కింగ్ అర్జున్, ఐశ్వర్య రాజేష్ తొలిసారి కలిసి పనిచేస్తున్నందున ఈ చిత్రంపై హ్యూజ్ బజ్ వుంది. ఈ సినిమా టీజర్‌కు అద్భుతమైన స్పందన రావడంతో, మేకర్స్ ఇప్పుడు సినిమాను థియేటర్లలో విడుదల చేయడానికి సన్నాహాలు చేస్తున్నారు. ఈ సినిమా ఆడియో, ట్రైలర్, ప్రపంచవ్యాప్తంగా థియేటర్లలో విడుదల తేదీని త్వరలో ప్రకటిస్తారు. ఈ సినిమా తమిళం, తెలుగు, మలయాళం, కన్నడ భాషలలో ఒకేసారి విడుదల కానుంది.

## మెగాస్టార్‌కి విలన్?




మంచు మనోజ్ కెరీర్‌లో మిరాయ్ సినిమా ఒక కొత్త మలుపు తీసుకువచ్చింది. తేజ సజ్జా హీరోగా వచ్చిన ఈ చిత్రంలో మహాబీర్ లామా పాత్రలో మనోజ్ నటన ప్రేక్షకులను ఆకట్టుకుంది. దాదాపు పదేళ్ల తర్వాత రీ ఎంట్రీ ఇచ్చిన ఆయనకు ఈ సినిమాతో మళ్లీ మంచి గుర్తింపు వచ్చింది. తన తండ్రి విలన్‌గా నటించి హీరోగా మారితే.. మనోజ్ మాత్రం రివర్స్‌లో హీరో నుంచి విలన్‌గా మారాడు. వ్యక్తిగత జీవితంలో ఒడిదుడుకులు, ఫ్యామిలీలో ఆస్తి గొడవలతో కొన్నాళ్ల పాటు ఎంతో మనోవేదన అనుభవించిన మనోజ్‌కి ఎట్టకేలకు మంచి రోజులు వచ్చాయి. ఎనిమిదేళ్ల తర్వాత భైరవంతో ఎంట్రీ ఇచ్చిన మనోజ్ మిరాయ్‌తో విలన్‌గా మారాడు. ఈ చిత్రంలో ఆయన నటన ప్రేక్షకుల చేత విజిల్స్ కొట్టించింది. కొన్ని సీన్లలో అయితే హీరో తేజని సైతం డామినేట్ చేసేశాడు.

మిరాయ్ చిత్రం చూసిన వారంతా మనోజ్‌లో ఇంత టాలెంట్ ఉందా అని ఆశ్చర్యపోతున్నారు. ఈ క్రమంలోనే ఆయనకు వరుస ఛాన్సులు క్యూ కడుతున్నాయి. తాజాగా వినిపిస్తోన్న టాక్ ప్రకారం మెగాస్టార్ చిరంజీవి చిత్రంలో మనోజ్ విలన్‌గా నటించనున్నాడట వాల్తేరు వీరయ్యతో తనకు బ్లాక్‌బస్టర్ అందించిన బాబీతో చిరంజీవి ఓ ప్రాజెక్టు చేయనున్న సంగతి తెలిసిందే. ఈ చిత్రాన్ని దసరా రోజున ప్రారంభించేందుకు అన్ని ఏర్పాట్లు జరుగుతున్నాయి.

ఈ నేపథ్యంలోనే ఈ మూవీలో చిరంజీవిని ఢీకొట్టే పాత్రలో మనోజ్‌ని తీసుకోవాలని బాబీ అనుకుంటున్నాడట. ఇందులో విలన్ పాత్ర చాలా కీలకంగా ఉంటుందని, దీనికి మనోజ్ అయితేనే న్యాయం చేయగలడని ఫిక్స్ అయిన బాబీ ఈ స్పెషల్ కాంబో సెట్ చేస్తున్నాడని ఫిల్మ్ నగర్‌లో టాక్ వినిపిస్తోంది. దీనిపై మేకర్స్ నుంచి క్లారిటీ రావాల్సి ఉంది.

## 500 మంది యోధులతో యుద్ధం

పాన్ ఇండియా స్థాయిలో భారీ అంచనాల మధ్య విడుదలకు సిద్ధంగా ఉన్న సినిమా 'కాంతారా: చాప్టర్ 1. అక్టోబర్ 2న ఈ చిత్రం భారీ స్థాయిలో తెలుగు, కన్నడ, హిందీతో పాటు ఇతర భాషల్లో థియేటర్లలో విడుదల కానుంది. ఇప్పుడు మేకర్స్ అభిమానులు ఎదురు చూస్తున్న ట్రైలర్ అప్డేట్‌ను అధికారికంగా ప్రకటించారు. ట్రైలర్‌ను సెప్టెంబర్ 22, మధ్యాహ్నం 12:45 గంటలకు విడుదల చేయనున్నట్లు చిత్రబృందం తెలిపింది. ఈ మేరకు మేకర్స్ సోషల్ మీడియాలో అద్భుతమైన పోస్టర్ షేర్ చేశారు. ఈ చిత్రంలో 500 మంది యోధులు, సుమారు 3,000 మంది ప్రజలు పాల్గొనే ఒక భారీ యుద్ధ సన్నివేశాన్ని రూ పొందించారు. 25 ఎకరాల పట్టణం నిర్మించి, దాదాపు 45-50 రోజు లపాటు ఈ షూటింగ్ జరిగింది. ఇది భారతీయ సినిమా చరిత్రలోనే అతి పెద్ద సన్నివేశాల్లో ఒకటిగా నిలిచింది.



## ఒకరి సక్సెస్ ఎంతోమందికి బాట వేస్తుంది



మౌళి తనూజ్, శివానీ నాగరం జంటగా నటించిన 'లిటిల్ హార్ట్స్' సినిమా ఇటీవల ప్రేక్షకుల ముందుకొచ్చి ఘన విజయాన్ని సొంతం చేసుకుంది. ఈ చిత్రాన్ని ఈటీవీ విన్ ఒరిజినల్ ప్రొడక్షన్ బ్యానర్ పై దర్శకుడు సాయి మార్తాండ్ రూపొందించారు. ఆదిత్య హాసన్ నిర్మాతగా వ్యవహరించారు. అద్భుతంగా ప్రమోట్ చేసి నిర్మాతలు, డిస్ట్రిబ్యూటర్స్ బన్నీ వాస్ తన బీవీ వర్క్స్, వంశీ నందిపాటి తన వంశీ నందిపాటి ఎంటర్ టైన్ మెంట్స్ బ్యానర్స్‌పై వరల్డ్ వైడ్ గ్రాండ్‌గా థియేట్రికల్‌గా రిలీజ్ చేశారు. ఈనేపథ్యంలో 'లిటిల్ హార్ట్స్' సెలబ్రేషన్ ఆఫ్ గ్లోరీ ఈవెంట్ హైదరాబాద్‌లో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా నిర్మాత బన్నీ వాస్ మాట్లాడుతూ గీతా ఆర్ట్స్‌లో విజయ్‌తో త్వరలో సినిమా చేస్తాం. గీత గోవిందం కంటే పెద్ద హిట్ చేయబోతున్నాం. మేము చేయబోయే సినిమా విజయ్ కెరీర్‌లో ఎప్పటికీ గుర్తుండిపోయేలా ఉంటుందన్నారు. నిర్మాత అల్లు అరవింద్ మాట్లాడుతూ ఇలాంటి యంగ్ టీమ్‌తో ఒక సినిమా నిర్మించాలని అనిపిస్తోందన్నారు. హీరో విజయ్ దేవరకొండ మాట్లాడుతూ ఒకరు సక్సెస్ అయితే అది ఎంతోమందికి మంచి చేస్తుంది. అరవింద్ గారు సక్సెస్ కావడం వల్ల ఆయన దగ్గర బన్నీ వాస్, వంశీ, ధీరజ్, ఎస్ కేఎన్..ఇలా ఎంతోమంది యంగ్ ప్రొడ్యూసర్స్ ఆ కాంపౌండ్ నుంచి రాగలిగారు అన్నారు. హీరో మౌళి తనూజ్ మాట్లాడుతూ నా కెరీర్‌లో ఏం జరగాలని కోరుకున్నానో అవన్నీ గత కొద్ది రోజులుగా జరుగుతున్నాయి. నా ఫేవరేట్ స్టార్స్ అందరూ ట్వీట్స్ చేస్తున్నారు, ఫోన్స్ చేస్తున్నారు. పిలిపించుకుని మాట్లాడుతున్నారని చెప్పారు. హీరోయిన్ శివానీ నాగరం మాట్లాడుతూ నా కాత్యాయని క్యారెక్టర్‌ను ప్రేక్షకులు బాగా లవ్ చేస్తున్నారు అని చెప్పారు.

# ఐఐటికి మొదటిసారి మహిళ నేతృత్వం

**ప్రతిష్ఠాత్మక ఐఐటీలను మొదటిసారిగా భారత్ వెలుపల ఆఫ్రికా (టాంజానియా)లో ప్రారంభించారు. 'ఐఐటీ మద్రాస్ జాంజిబార్'గా పిలుస్తోన్న ఈ సంస్థకు ప్రొఫెసర్ ప్రీతీ అఘలయం డీన్. ఒక మహిళ ఐఐటీకి నేతృత్వం వహించడం ఇదే తొలిసారి. ఆ క్యాంపస్, తన కెరియర్ విశేషాలు తెలుసుకుందాం..**

ఈ ప్రాజెక్టు నాకు మాత్రమే కాదు, ఐఐటీ మద్రాస్‌కీ, భారత్‌కూ ఎంతో ప్రతిష్ఠాత్మకం. దీనికి ఎన్నో ప్రత్యేకతలు ఉన్నాయి. వాటితో పోల్చితే మహిళ నేతృత్వం వహించడమనేది చిన్న విషయమే. పశ్చిమ దేశాల్లో ఉన్నట్లు ఇక్కడ ఐఐటీ పూర్వవిద్యార్థులెవరూ లేరు. అలాంటిచోట క్యాంపస్‌ను ప్రారంభించడం సాహసమే! నాకు అవకాశం వచ్చినప్పుడు రెండో ఆలోచన లేకుండా అంగీకరించాను. ప్రస్తుతం అయిదెకరాల్లోని తాత్కాలిక క్యాంపస్‌లో ఉన్నాం. 200 ఎకరాల్లో క్యాంపస్ సిద్ధమవుతోంది. 105 మంది విద్యార్థులు ఉన్నారు. వీళ్లలోనూ కెన్యా, జాంబియా లాంటి ఆఫ్రికా దేశాలతోపాటు ఇతర దేశాలవాళ్లూ ఉన్నారు. చదువు, పరిశోధన, వ్యాపారకోణం. లాంటి అంశాల్లో అచ్చం ఐఐటీ మద్రాస్‌లోనే కరికులమ్ ఉంటుంది. అదే డీఎన్ఏ సర్టిఫికేషన్స్ ఉంటాయి. ఇక్కడికి వచ్చాక ఎక్కువగా స్కూల్ పిల్లల్ని కలిసి మాట్లాడుతున్నా. చాలామందికి రూబిక్స్ క్యూబ్స్ అంటే ఇష్టం. కానీ అక్కడ ఎక్కువగా దొరకవు. ఒకసారి బ్యాగు నిండా భిన్న రకాల క్యూబ్స్ తీసుకువెళ్లి పంచాను. 2023 అక్టోబరులో జాంజిబార్‌లో క్లాసులు మొదలు పెట్టాం. పస్తుతం కెమికల్ పాసెస్, డేటా సైన్స్ ఏఐ విభాగాల్లో బి.ఎస్.తోపాటు డేటా సైన్స్ ఏఐ, ఓషన్ స్ట్రక్చర్స్‌లో మాస్టర్స్ కోర్సులీ అందిస్తున్నాం. భవిష్యత్తులో ఆఫ్రికా ఖండం కీలకం కానుంది. ఇక్కడ ప్రజల సగటు వయసు 19 ఏళ్లు. ప్రపంచంలోని యువ జనాభాలో ఎక్కువ మంది ఇక్కణ్నుంచే రానున్నారు. ఈ మానవ వనరుల్ని అత్యుత్తమంగా తీర్చిదిద్దడమే మా లక్ష్యం. ఐఐటీ మద్రాసు అభివృద్ధిలో జర్మన్లు సహకరించారు. మనమూ ఆ విజ్ఞానాన్ని ఇప్పుడు మరో దేశంతో పంచుతున్నాం.



యూనివర్సిటీ ఆఫ్ మసాచుసెట్స్ నుంచి పీహెచ్‌డి, ఎమ్ఐటీ నుంచి పోస్ట్ డాక్ చేశాక, ఐఐటీ–బాంబేలో అసిస్టెంట్ ప్రొఫెసర్‌గా 2002లో కెరియర్ ప్రారంభించా. 2009 నుంచి ఐఐటీ మద్రాస్‌లో ప్రొఫెసర్‌గా ఉన్నా. బోధనలో కొత్తదనం కోసం ప్రయత్నిస్తుంటా. విద్యార్థులకు ఛాలెంజ్‌లు పెట్టి కార్డు, బోర్డు, ఆనెలైన్ గేమ్‌ల ద్వారా పాఠాలు చెప్పడంపైన 'ప్లే టు లర్న్' కార్యక్రమం మొదలు పెట్టాం. మంచి స్పందన వచ్చింది. ప్రస్తుతం కార్బన్ డయాక్సైడ్ క్యాప్చరింగ్‌పైన మా బృందం పరిశోధనలు చేస్తోంది. నేను ఐఐటీ మద్రాస్‌లో విద్యార్థినిగా ఉన్నప్పటి (1991–95)తో పోల్చితే ఎంతో మార్పు వచ్చింది. విద్యార్థులూ, బోధకుల్లో మహిళల సంఖ్య పెరిగింది. బీటెక్ లో ఇప్పుడు 20 శాతం... పరిశోధకుల్లో 30 శాతం ఉన్నారు. ప్రతిభపరంగా అమ్మాయిలు తక్కువ కాదు. ప్రవేశాల శిక్షణకు దూరంగా వెళ్లాల్సి రావడం, అధిక ఫీజుల్లాంటివి అడ్డంకిగా ఉన్నాయి. జెండర్ అడ్వాన్స్‌మెంట్ ఫర్ ట్రాన్స్ఫార్మింగ్ ఇన్‌స్టిట్యూట్(గతి)లో భాగమై ఐఐటీ మద్రాస్ మహిళల ప్రవేశాలు, పరిశోధనలపైన విలువైన డేటాను ప్రభుత్వానికి అందించా. □

# ఆత్మవిశ్వాసంతో ముందడుగు..



**మహిళలుగా మనం అన్ని రంగాల్లోనూ రాణిస్తున్నాం. స్వతంత్రంగా జీవిస్తున్నాం. అయితే డబ్బు, కెరీర్... ఇలాంట వాటితో పాటు జీవితానికి సంబంధించిన అన్ని అంశాల్లోనూ స్వతంత్రంగా జీవించగలిగితేనే మనం కోరుకునే సంతృప్తి లభిస్తుంది. ఈ క్రమంలో స్వేచ్ఛగా, స్వతంత్రంగా జీవించడానికి దోహదపడే కొన్ని అంశాలేంటో చూద్దాం..**

**ఆత్మవిశ్వాసంతో..** ఏ విషయంలోనైనా ఆత్మవిశ్వాసంతో ముందడుగు వేస్తే విజయం మన సొంతమవుతుందనే విషయం తెలిసిందే. అయినా సరే.. కొన్ని విషయాల్లో లోపల ఏదో భయం, బెరుకు మనల్ని వెంటాడుతూ స్వేచ్ఛగా జీవించకుండా అడ్డుపడుతూ ఉంటాయి. ఉదాహరణకు.. మీకు పాటలంటే చాలా ఇష్టం.. మీ గొంతు కూడా చాలా శ్రావ్యంగా ఉంటుంది. కానీ ఎవరిముందైనా పాడమంటే మాత్రం చాలా భయం. దీనివల్ల మీకున్న అవకాశాలను కోల్పోవడమే కాదు.. మీలోని ప్రతిభను నలుగురికీ చూపే అవకాశాన్నీ చేజార్చుకుంటారు. దీనికి బదులుగా కొద్దిగా ధైర్యం తెచ్చుకొని ఆత్మవిశ్వాసంతో ముందుకు సాగిపోతే విజయం మీ వెంటే ఉంటుంది. అయితే దారిలో అపజయాలు ఎదురైనా సరే మనోధైర్యంతో ముందుకు సాగాల్సి ఉంటుంది. దీనివల్ల మన జీవితంలో ఏం చేయాలనుకుంటున్నామో అవన్నీ చేసే అవకాశం మనకు లభిస్తుంది.

**ఆర్థిక స్వాతంత్ర్యం..** ఎవరిమీదా ఆధారపడకుండా జీవించాలంటే ఆర్థిక స్వాతంత్ర్యం ఎంతో అవసరం. అయితే సంపాదించే డబ్బును విచ్చలవిడిగా కాకుండా జాగ్రత్తగా ఖర్చు పెట్టడం నేర్చుకోవాలి. అంతేగానీ మా డబ్బు.. మా ఇష్టం.. దేనికైనా ఖర్చు పెట్టుకుంటామంటే. భవిష్యత్తు అవసరాలకు డబ్బు మిగలదు. దీనివల్ల ఇతరులపై ఆధారపడే పరిస్థితులు ఎదురు కావచ్చు. అందుకే మన భవిష్యత్తుకు తగ్గట్టుగా మనమే ప్లాన్ చేసుకొని పొదుపుమదుపు చేస్తే ఆర్థికంగా ఎవరిమీదా ఆధారపడకుండా స్వేచ్ఛా స్వాతంత్ర్యాలతో జీవించగలుగుతాం.



**భయపడకుండా..** ఎవరితో అయినా సరే.. భయపడకుండా మనసులోని భావాలను స్వేచ్ఛగా వ్యక్తం చేయడం అలవాటు చేసుకోవాలి. ఇతరులతో మాట్లాడటానికి భయపడితే మనలోని భావాలన్నీ లోపలే మిగిలిపోతాయి. అలా భావాలన్నీ గూడుకట్టుకొని మిగిలిపోయినప్పుడు జీవితంలో అసంతృప్తి మాత్రమే మిగులుతుంది. ఒక్కోసారి కెరీర్‌లో కొన్ని చక్కటి అవకాశాలను కూడా కోల్పోవాల్సి రావచ్చు. మీ జీవితం అలా కాకుండా ఉండాలంటే ఎంతమంది ముందైనా మీ మనసులోని మాట చెప్పడానికి వెనకడుగు వేయొద్దు. ఎదుటివారు మీకంటే వయసులోనో, హోదాలోనో పెద్దవారని భయపడాల్సిన అవసరం లేదు. మీ అభిప్రాయాలు తప్పు కానంతవరకూ ఎవరికీ భయపడాల్సిన అవసరం లేదు.

**మీకు నచ్చిందే..** చదువు, ఉద్యోగం విషయంలో వేరొకరి మీద ఆధారపడి నిర్ణయాలు తీసుకో వద్దు. మీ మనసు చెప్పిన రంగాన్ని ఎంచుకోవడం వల్ల ఆ వృత్తిలో మీరు ఉన్నత స్థానాలకు ఎదగగలుగుతారు. అలా కాకుండా ఎవరో చెప్పారని మీ కెరీర్‌ను ఎంచుకుంటే మీకు నచ్చని వృత్తిలో మిగిలిపోవాల్సి రావచ్చు..

**మీరే బెస్ట్!** ప్రతి విషయంలోనూ మీరే బెస్ట్ అనుకోండి. ఇతరులతో పోల్చుకోవద్దు. నెగెటివ్ ఆలోచనలను మీ దరిదాపుల్లోకి కూడా రానివ్వద్దు. ఇతరులతో పోలిక వల్ల అసూయ, ద్వేషం లాంటి నెగెటివ్ ఫీలింగ్‌కు మీరు దగ్గరవుతారు. అందుకే మీలో ఉన్న నైపుణ్యాలను గుర్తించండి. వాటిని మరింత పెంపొందించుకోండి. కెరీర్‌లో మరింత ఉన్నత స్థానానికి ఎదగండి.

**దృఢంగా..** ఏ విషయంలో అయినా సరే.. ఇంకొకరి మీద ఆధారపడకుండా స్వతంత్రంగా జీవించాలంటే శారీరకంగా, మానసికంగా దృఢంగా ఉండటం అవసరం. అలా ఉన్నప్పుడే మనం ఇంకొకరి మీద ఆధారపడకుండా జీవించగలుగుతాం. అందుకే ప్రతిరోజూ క్రమం తప్పకుండా వ్యాయామం చేయడం, మంచి ఆహారం తినడం, వేళకు పడుకోవడం.. ఇవన్నీ అలవాటు చేసుకోవాలి. మిమ్మల్ని మీరు ప్రేమించుకోండి! అన్నింటికంటే ముఖ్యమైన సంగతి. జీవితంలో స్వేచ్ఛగా, స్వతంత్రంగా జీవించాలనుకుంటే మిమ్మల్ని మీరు ప్రేమించుకోండి. మీకు ఏం అవసరమో గుర్తించి, దాన్ని మీకు మీరే అందించుకోండి. దేని కోసమూ ఇతరులపై ఆధారపడద్దు. మీ శరీరానికి ఆరోగ్యాన్నందించే అలవాట్లు చేసుకోండి. మీ మనసును మీరే ఇబ్బంది పెట్టకుండా నడుచుకోండి అని సూచిస్తున్నారు నిపుణులు. మరి అమ్మాయిలూ తెలుసుకోండి. □

# మెరిసే రంగుల గళ్ల డ్రెస్సు



మెరిసే రంగులు.. పెద్ద పెద్ద గళ్లు.. ఒకప్పుడు ఈ అందం నేత చీరలదే! ఇప్పటికీ ఈ వర్ణన వాటినే గుర్తుకు తెస్తుంది. పట్టుచీరల్లోనూ ఆ అందం అడపాదడపా పలకరిస్తూనే ఉంటుంది. మనకి మాత్రం ఈ గళ్ల ఫ్యాషన్ కొత్తా? జీన్స్ మీదకి వేసే టాప్‌లు, ఫ్రాకుల్లో ఎప్పుడో అలరించింది. మరిప్పుడెందుకు ప్రస్తావన అంటరా? సస్టెయినబిలిటీ.. దీనికి ఎంత ప్రాధాన్యం పెరుగుతోందో తెలుసు కదా! దానికి వస్త్ర ప్రపంచంలో అనువైనదంటే చేనేతే! ఈ వస్త్రాలు పర్యావరణహితం.. భూమిలోనూ త్వరగా కలిసిపోతాయి. నేతతీరు చర్మానికి గాలి తగిలేలా చేసి మేనికి హాయినిస్తుంది. పైగా కాలంతో సంబంధం లేకుండా అనువుగానూ ఉంటాయి. సమస్యల్లా.. అవి కనిపించే తీరే! ఆధునిక అమ్మాయిలు ఆ తరహావి ఎలా మెచ్చుతారు? అలాగని ఊరుకుంటే ఎలా.. అందుకే డిజైనర్లు నేత వస్త్రాలపై దృష్టిపెట్టారు. ఆనాటి గళ్ల డిజైన్లలో ఇలా ట్రెండీగా ఫ్రాక్‌లను తీసుకొచ్చేశారు. ఫలితమే సంప్రదాయ వస్త్రానికి ఇలా ఆధునిక లుక్! బాగున్నాయి కదూ! నాటి లుక్‌లో నేటి ఫ్యాషన్.. మీకూ నచ్చిందా? ఇంకేం ప్రయత్నించేయండి. ట్రెండీగా కనిపించొచ్చు. పర్యావరణానికీ మేలు భలే జోడీ కదూ!







# ఇండక్షన్ స్టవ్ వాడకంలో జాగ్రత్తలు

ఇండక్షన్ స్టవ్.. మామూలు స్టవ్‌తో పోలిస్తే దీని వాడకంలో చాలా జాగ్రత్తలు తీసుకోవాల్సి ఉంటుంది. లేదంటే ఒక్కోసారి కొన్ని సమస్యలు ఎదురయ్యే అవకాశముంటుంది. ఈ క్రమంలో ఇండక్షన్ స్టవ్ ఉపయోగించేటప్పుడు తీసుకోవాల్సిన జాగ్రత్తలేంటో ఓసారి చూద్దాం..

✦ ఇండక్షన్ స్టవ్ వాడుతున్నప్పుడు సాధ్యమైనంత వరకు దానికి సరిపోయే పాత్రలనే ఎంచుకోవాలి.

✦.కొందరు ఇండక్షన్ స్టవ్ ని సైతం గ్యాస్ స్టవ్ పక్కనే పెడుతుంటారు. దీనివల్ల సాధారణ సమయాల్లో ఎలాంటి నష్టం కలగదు. కానీ ఎప్పుడైనా పొరపాటున గ్యాస్ లీకైతే మాత్రం ఇబ్బందులను ఎదుర్కోవాల్సి ఉంటుంది. అందుకే కిచెన్ ప్లాట్‌ఫామ్‌పై వేర్వేరు చోట్ల అమర్చుకోవడం, తగిన జాగ్రత్తలు తీసుకోవడం తప్పనిసరి.

✦ ఎట్టి పరిస్థితుల్లోనూ ఎక్స్టెన్షన్ ప్లగ్ బాక్సులకు ఇండక్షన్ స్టవ్ ప్లగ్‌ని అనుసంధానించకూడదు.



✦ ఇండక్షన్ స్టవ్‌ని శుభ్రం చేసే క్రమంలో నీటిని ఉపయోగించకుండా మెత్తని వస్త్రంతో మాత్రమే తుడవాలి. ఇండక్షన్ స్టవ్ ఉన్న రంధ్రాల్లో దుమ్ము, ధూళి చేరకుండా చూసుకోవాలి.

✦ స్టవ్‌పైమైనా పగుళ్లు వచ్చినట్లనిపిస్తే దానిని ఉపయోగించకూడదు.

✦. అలాగే స్టవ్ దగ్గర్లో ఎలాంటి లోహ సామగ్రిని ఉంచకూడదు.

✦ ఇండక్షన్ స్టవ్ విద్యుత్‌తో పనిచేస్తుంది. కాబట్టి వీలైనంత వరకు దీనిని చెక్క టేబుల్‌పై పెట్టడం మంచిది. అంతేకాకుండా సెరామిక్ టైల్స్, సిమెంట్ ఫ్లోర్ పైన కూడా పెట్టుకోవచ్చు. □

# మునగాకు ప్రయోజనం-2

ఆరోగ్య భాగ్యం



డాక్టర్ కె.ఉమాదేవి
తిరుపతి

**ఎముకలు**: పిల్లలకి మునగాకు రసాన్ని కొద్దిగా పాలలో కలిపి ఇచ్చి ఎముకలు ధృఢంగా పెరుగుతాయి. చిగుళ్ళవాపు, అథ్లెటిక్‌ఫుట్, రుమాటాయిడ్ ఆర్థ్రయిటిస్, సయాటికా, పిప్పిపళ్ళు, నడుంనొప్పి, మెడనొప్పి వంటి వ్యాధులు రావు. మునగాకులోని ఆంటిఇన్‌ఫ్లమేటరీ గుణాలవల్ల ఎథిరోస్క్లిరోసిస్, ఎముకల అరుగుదల, కీళ్లవాపులు, నొప్పులుబెణుకు నొప్పులు, కములుదెబ్బలు, గాయాలు, దెబ్బలు తగిలినవారికి, ఎముకలు విరిగిన వారికి మేలు చేస్తుంది.

**కన్ను** : విటమిన్ 'ఎ' వల్ల రేచీకటి, అంధ్యత్వం, శుక్లాలు, కంటిచూపు మెరుగ్గా ఉంటుంది. బీటాకెరోటిన్లు విటమిన్ 'ఎ'గా మారడం వల్ల పిల్లలల్లో, వృద్ధుల్లో, యువి లైట్ల కాంతివల్ల కలిగే అనేక కంటి సమస్యల్ని ఆరికడుతుంది.

**రక్తం** : మునగాకులోని ఐరన్ సికిల్ సెల్ అనేలియా (అధిక ఐరన్‌తో వచ్చే వ్యాధుల్ని)ని రక్తహీనతని తగ్గిస్తుంది. రక్తశుద్ధి చేస్తుంది. రక్త ప్రసరణని మెరుగుపరుస్తుంది. అధిక రక్తస్రావాల్ని ఆరికడుతుంది.

**సౌందర్య పోషణ** : జుట్టు : మునగాకులోని బయోటిన్ జుట్టురాలడం, నెరవడం, బట్టతలరావడం, చుండ్రు, దురదలు వంటి సమస్యలు రాకుండా చేస్తుంది. ఇది హెయిర్ టానిక్‌గా పనిచేసి కౌశసౌందర్యాన్ని పెంపొందిస్తుంది. **చర్మం** : చర్మం పొడిబారడం, దురదలు, గజ్జి, తామర, నల్లని మచ్చలు మొటిమలు, బ్లాక్‌హెడ్స్, దీర్ఘకాలిక మంటలు, తిమ్మిర్లు, డిర్మటైటిస్ ఫంగల్ ఇన్ఫెక్షన్స్, పులిపిర్లు, ముడతలు, యువి కిరణాల నష్టాన్ని, సన్‌బర్న్‌ని, అనేక చర్మవ్యాధుల్ని, పుండ్లు, పొక్కుల్ని తగ్గిస్తుంది. మునగాకులోని ఫినాలిక్స్ చర్మంలోని మృతకణాల్ని తొలగించి హైడ్రేట్‌గా ఉంచి మృదువుగా, కాంతివంతంగా ఉంచి చర్మ సంరక్షణకు అంటీ ఆక్సిడెంట్‌గా, ఆంటీఇన్‌ఫ్లమేటరీగా, ఆంటిసెప్టిక్‌గా పనిచేస్తుంది.

**స్త్రీలు** : స్త్రీలలో హార్మోన్ల ఇంబాలెన్స్ వల్ల వచ్చే బహిష్టు సమస్యలకి, బహిష్టునొప్పి, రక్తహీనత, పిసిఓడికి మంచి ఆహారం మెనోపాజిల్ లక్షణాలకి (ముట్లాగిపోయేటప్పుడు) మోనోపాజ్ తర్వాత వచ్చే లక్షణాలకి మునగాకు వరప్రదాయిని. గర్భిణీలకి, బాలింతలకి మంచిది. పిండం ఎదుగుదలకి, సుఖప్రసవానికి మునగాకుని ఆహారంలో కొద్దిగా తీసుకోవడం మంచిది. మనగాకు గెలాక్టగాగ్‌గా బాలింతల్లో పాలు పడేలా చేస్తుంది. ప్రసవానంతరం త్వరగా కోలుకుంటారు. థైరాయిడ్ గ్రంథి సమస్యలకి మునగాకు సంజీవనిలాగా పనిచేస్తుంది. **పురుషులు** : ఇది టెస్టోస్టిరాన్ హార్మోన్‌ని పెంచి నపుంసకత్వాన్ని, శ్రీఘ్రస్కలనాన్ని తగ్గిస్తుంది. లైంగిక ప్రేరణని పెంపొదిస్తుంది. వంధ్యత్వాన్ని తగ్గిస్తుంది. గనేరియా, సిఫిలిస్, వరిటి సుఖవ్యాధులకి, వరిబీజంకు మంచిది. **మెదడు/నరాలు:** తలనొప్పి, మైగ్రేన్, నరాలక్షీణత, పిచ్చి, చిత్తవైకల్యం, ఆల్జీమర్స్ డిసీజ్, మతిమరుపు, డిప్రెషన్, ఎపిలెప్సీ, మల్టీపుల్ స్క్లిరోసిస్, తలదిమ్ముని తగ్గించేది ముగాకు జ్ఞాపకశక్తిని పెంచి ఏకాగ్రతని పెంచుతుంది. దీనిలోని న్యూరోప్రొటెక్టివ్ నేచర్, ఆంటీఆక్సిడెంట్ల వల్ల నర్వస్ సిస్టమ్‌ని స్టిములేట్ చేసి న్యూరోపతిక్‌పెయిన్స్‌ని, కండరాలవాపు, నొప్పిని, వాపుల్ని తగ్గిస్తుంది. **ఇమ్యూనిటీ:** ఆరెంజ్ కన్నా 12 రెట్లు ఎక్కువగా విటమిన్ సి, ఆంటీ ఆక్సిడెంట్ల వల్ల మునగాకు ఆంటిబయాటిక్‌గా పనిచేస్తుంది. రోగనిరోధక శక్తిని పెంచి జీవక్రియల్ని ఉత్తేజితం చేస్తుంది. వర్షాకాలంలో వచ్చే అంటువ్యాధుల నుంచి, ఆస్మా, క్షయ, దగ్గు బ్రాంకైటిస్, ఫ్లూ, జలుబు, జ్వరాలు గవదబిళ్ళలవాపు, గొంతునొప్పి, సైనసైటిస్, ఆయాసం, కలరా, కామెర్లు, విరేచనాలు, కఫవ్యాధులు, వాపులు, మంటల్ని నుంచి కాపాడుతుంది. ఇది ఆటోఇమ్యూనిటీ వ్యాధులకి రక్షణగా పనిచేస్తుంది. ఎథైల్ అసిటేట్ వల్ల సిగరెట్ పొగకు వ్యతిరేకంగా, కాలుష్య నివారిణిగా, నోటిలో పుండ్లు న్యూమోనియా, విటమిన్ల లోపాల్ని నివారిస్తుంది.

**కేన్సర్స్** : మునగాకులోని నియోంజియెనైన్ అనే ఆంటికేన్సర్ కారకం వల్ల లంగ్, లివర్, కోలోరెక్టల్, చర్మం, బవేరియన్, గర్భాశయం కేన్సర్, అండాశయకేన్సర్, పెద్దప్రేగు కేన్సర్, పాంక్రియాటిక్ కేన్సర్, మెలనోకిమా కేన్సర్లు రాకుండా నివారిస్తుంది. దీనిలోని గ్లూకోమొరింజన్ సమ్మేళనం వల్ల కేన్సర్ కణాల పెరుగుదలని మందించేలా చేస్తుంది. □

# శ్రీవారి నిజరూప దర్శనం

కలియుగ ప్రత్యక్ష దైవం తిరుమల తిరుపతి శ్రీవారి వైభవం. వెంకటేశ్వర స్వామి వారు 'కో' అని పిలిస్తే ఆ అని పలికే అద్భుతమైనవి. తిరుమల క్షేత్రంలో వేకువ జామున రెండవ అర్చన తరువాత శ్రీహరి నిజరూప దర్శన భాగ్యం తన భక్తులకు కల్పిస్తోంది తిరుమల తిరుపతి దేవస్థానం ప్రతి గురువారం చేసే ఈ సేవలు అద్భుతమైనవి వాటిలో మొదటిది నిజ రూప దర్శనం. నిజరూప దర్శనం అంటే... తిరుమల శ్రీవారి నిజరూప దర్శనం ప్రతి గురువారం ఉంటుంది. ఆ రోజు వేకువ జామున రెండవ అర్చన తరువాత, స్వామి వారికి ఎలాంటి అలంకారాలు లేకుండా ఆభరణాలు తీసేసి వాటి స్థానంలో పట్టు వస్త్రం కడతారు. కిరీటానికి బదులు పట్టు వస్త్రం చూడతారు. స్వామివారికి పచ్చ కర్పూరంతో వున్న పెద్ద నామం చిన్నదిగా చేస్తారు. ఈ నిజరూప దర్శనంలోనే స్వామి వారి నేత్ర దర్శనం కూడా మనకు కలుగుతుంది. గురువారం అంటే గురు దర్శనంగా కొందరు భావిస్తారు. తిరుమల శ్రీవారి నిజరూప దర్శనం సందర్భంగా గురువారం పరమ పవిత్రమైన శుభ దినంగా భావిస్తారు నిజరూప దర్శనంలో స్వామి వారి దివ్యమంగళ స్వరూపం చూసిన వారికి కోరిన కోరికలు లభిస్తాయని ప్రతీతి. అందుకే వారంలో ప్రతి గురువారం జరిగే స్వామి వారి నిజ రూప దర్శనం అంటే సకల భక్త కోటి అమితంగా ఇష్టపడతారు. ఈ నిజరూప దర్శనం చేసుకున్న సకలభక్త కోటికి మనోభీష్ఠ సిద్ధి కలుగుతుంది. నిజరూపం దర్శనంలో ఎంతో శక్తి సౌభాగ్యం వుంది. చూసిన వారికి పుణ్యం లభిస్తుంది. శుభ ప్రదమైన కోరినకోరికలు నరవేరుతాయి. ప్రత్యక్షదైవంగా భావించే వారికి గురువారం నిజరూప దర్శనం ఒక వరంగా భావించాలి. గురువారం స్వామి వారికి గొప్ప విశేషం స్వామి వారి నిజరూప దర్శనంగా భావిస్తారు. అదేవిధంగా గురువారం రోజువారి సేవలులో భాగంగా పూలంగిసేవగా ఈ ప్రత్యేక సేవలు ప్రత్యేక పూల అలంకరణతో అలంకరిస్తారు. రోజు స్వామి వారికి ప్రత్యేకంగా పులిహోర, పాయసం, వడ నైవేద్యంగా సమర్పిస్తారు. ఈ రోజు అక్కడున్న వ్యాపారులు ఇతరులను మోసం చేయరు. ఎందుకంటే ఈ రోజు నేత్ర దర్శన భాగ్యం కూడా కలుగుతుంది. కాబట్టి కేవలం లాభం లేకుండా వస్తువులని విక్రయిస్తారు తప్ప అధిక ధరలతో అమ్మడానికి ఇష్టపడరు. శ్రీవారు తమ భక్తులని వ్యాపారులని స్వయంగా గమనిస్తారని నమ్మకం. ఏది ఏమైనా కలియుగ వైకుంఠం తిరుమల శ్రీహరి కళా వైభవం కనులారా చూసిన వారికి ఈ నిజ రూప దర్శనం పుణ్యఫలం.

-ఎల్. ప్రఫుల్ల చంద్ర

ఆధ్యాత్మికం

# మీట తిప్పితే చాలు !

బియ్యం, పప్పులు లాంటివి ఎంత జాగ్రత్తగా పదిల పరచినా పురుగు చేరుతుంది. కొన్నిసార్లు బూజు పడుతుంది కూడా. అందుకు ముఖ్య కారణం.. తడి చేత్తో కొలత డబ్బాను పట్టుకోవడం. చెయ్యి తుడుచుకున్నాం కదా అనుకుంటాం కానీ.. మిగిలి ఉన్న అతి కొద్ది చెమ్మ వల్ల కూడా పదార్థాలు పాడైపోతాయి. మనకు అందుబాటులోకి వచ్చిన 'రొటేటింగ్ రైస్ డిస్పెన్సర్' అలాంటి ఇబ్బందులను తొలగిస్తుందిఒ. ఇందులో కింది భాగంలోకి పెద్ద అరలో బియ్య, పైనున్న చిన్న అరల్లో కందిపప్పు, మినపప్పు, రవ్వ లాంటివి నిలవచేయొచ్చు. మీట తిప్పితే చాలు..కావాలనుకున్నది పంపులోంచి నీళ్లలా వచ్చేస్తుంది. చుట్టూతిరిగే వీలు ఉంటుంది. అవసరమైన అర ఎదురుగా వచ్చేట్లు తిప్పి కావలసినంత పటుకుని మీట ఆపితే సరిపోతుంది. గాలి చొరబడక పోవడమే కాదు. వాటర్ ప్రూఫ్, డస్ట్ ప్రూఫ్ ఉంటుంది. పదార్థాలు తాజాగా ఉంటాయి. నాణ్యమైన ఫుడ్ గ్రేడ్ ప్లాస్టిక్‌తో తయారయ్యింది కనుక ఆరోగ్య సమస్యలు రావు, పర్యావరణానికీ నష్టం లేదు. □



# 'ఆపిల్ బాసుందీ'

**కావాల్సినవి** : టోన్డ్‌మిల్క్– అరలీటరు, కుంకుమపువ్వు రేకలు – ఎనిమిది (వీటిని గోరువెచ్చని పాలల్లో నానబెట్టాలి), యాలకుల పొడి–పావు టీస్పూన్, సన్నగా తురిమిన ఆపిల్–కప్పు, చియాసీడ్స్–టీస్పూన్, షుగర్ సబ్‌స్టిట్యూట్– నాలుగు నరగా. నిమ్మ రసం–అర టీస్పూన్, బాదం, పిస్తా తురుము– రెండు టీస్పూన్లు.

**తయారీ** : మందపాటి గిన్నెలో పాలు పోసి తక్కువ మంట మీద గంటపాటు మరిగించాలి. మధ్యమధ్యలో కలుపుతూ ఉండాలి. దీంట్లో మూడు గ్రాముల షుగర్ సబ్‌స్టిట్యూట్, యాలకుల పొడి వేసి కలిపి పావుగంటపాటు మరిగించాలి. ఇప్పుడు గిన్నెలో ఆపిల్‌తురుము, కొద్దిగా షుగర్ సబ్‌స్టిట్యూట్ వేసి కాసిన్ని నీళ్లు పోయాలి. దీన్ని మూడు నిమిషాల పాటు ఉడికించి, చల్లార్చి ఈ మిశ్రమాన్ని పాలల్లో వేయాలి. దీంట్లో నానబెట్టిన చియాసీడ్స్ వేసి బాగా కలిపితే ఆపిల్ బాసుందీ సిద్ధమవుతుంది. చివరగా బాదం, పిస్తా తురుముతో అలంకరించాలి. □



# ఆసియా కప్‌లో.. ఛోటా హీరోస్


ఎంఎమ్ గజన్‌ఫర్


ఆర్యన్ బిష్ట్


ఈతాన్ డిసౌజా


తిలక్ వర్మ

**న్యూఢిల్లీ:** ప్రస్తుతం 2025 ఆసియా కప్ జరుగుతోంది. భారతదేశం ఇప్పటికే సూపర్ ఫోర్ దశలో తమ స్థానాన్ని ఖరారు చేసుకుంది. మరోవైపు, హాంకాంగ్ మరియు ఒమన్ టోర్నమెంట్ నుండి నిష్క్రమించాయి. ఈఆసియా కప్‌లో పాల్గొనే ప్రతి జట్టు నుండి అతి పిన్న వయస్కుడైన ఆటగాళ్లు (సెప్టెంబర్ 16, 2025 నాటికి వయస్సు) కూడా ఉండటం విశేషం. కుడిచేతి వాటం స్పిన్నర్ ఎఎమ్ గజన్‌ఫర్ ఆఫ్ఘనిస్తాన్‌కే కాకుండా మొత్తం టోర్నమెంట్‌లోనే అతి పిన్న వయస్కుడు. కేవలం 19 ఏళ్ల వయసులో ఎంపికైన అతను హాంకాంగ్‌తో జరిగిన టోర్నమెంట్ ఓపెనర్‌లో రెండు ఓవర్లు బౌలింగ్ చేశాడు. అలాగే తంజిమ్ హసన్ సాకిబ్ (22) బంగ్లాదేశ్ జట్టులో కుడిచేతి వాటం పేసర్. అతను తన పేస్, బౌన్స్‌కు ప్రసిద్ధి చెందాడు. బంగ్లాదేశ్ టోర్నమెంట్ ఓపెనర్‌లో హాంకాంగ్‌పై 2/21 గణాంకాలతో, ఆతర్వాత శ్రీలంకపై 1/23తో, అన్ని ఫార్మాట్లలో ఆకట్టుకుని తన స్థానాన్ని బలోపేతం చేసుకున్నాడు. లెగ్‌స్పిన్నర్ అలీ హసన్ (21) హాంకాంగ్ తరపున ఆసియా కప్‌లో జరిగిన మూడు మ్యాచ్‌లలో అతను ఆడకపోయినా, దేశీయ క్రికెట్‌లో అతను ఆశాజనకంగా ఉన్నాడు. ముఖ్యంగా పాకిస్తాన్ అసోసియేషన్ ఆఫ్ హాంకాంగ్ మ్యాచ్‌లో యునైటెడ్ సర్వీసెస్ రిక్రియేషన్ క్లబ్ తరపున 3/27 స్పెల్‌తోరాణించాడు. స్టైలిష్ ఎడమ చేతి వాటం బ్యాట్స్‌మన్ తిలక్ వర్మ (22) ఈ ఆసియా కప్ భారత జట్టులో పాకిస్తాన్‌తో జరిగిన

## భారత్ నుండి తిలక్ వర్మ

మ్యాచ్‌లో 31 రన్స్‌చేసి, కెప్టెన్ సూర్యకుమార్ యాదవ్‌తో కలిసి కీలక భాగస్వామ్యాన్ని నిర్మించాడు. కుడిచేతి వాటం స్పిన్నర్ ఆర్యన్ బిష్ట్ (20) ఒమన్ జట్టులో అతి పిన్న వయస్కుడు. యుఎఇతో జరిగిన మ్యాచ్‌లో మిడిల్ ఆర్డర్‌లో 24 పరుగులు చేశాడు కానీ బౌలింగ్‌చేయలేదు. పాకిస్తాన్ జట్టులో టాప్ ఆర్డర్ బ్యాట్స్‌మన్ హసన్ నవాజ్ (22) అతి పిన్న వయస్కుడు. తొలి మ్యాచ్‌ల్లో సింగిల్ డిజిట్ స్కోర్లతో ఇబ్బంది పడినప్పటికీ, అతను ఇప్పటికీ మంచి ఆశావహుడిగా ఉన్నాడు. ఎడమచేతి వాటం స్పిన్నర్ దునిత్ వెల్లగే (22) శ్రీలంక జట్టు తరపున ఈ ఆసియా కప్‌లో ఇంకా ఆడకపోయినా, వన్డేల్లో తన ఖచ్చితత్వం, వైవిధ్యాలతో తన సామర్థ్యాన్ని ఇప్పటికే చూపించాడు. టీ20లలో ప్రతిభను కనబరుస్తున్నాడు. ఆసియా కప్‌లో రెండవ అతి పిన్న వయస్కుడైన ఆటగాడు యుఎఇ కి చెందిన ఈతాన్ డిసౌజా (19). ఇంకా టోర్నమెంట్‌లో పాల్గొననప్పటికీ, అతను ఇటీవల గీతిని ట్రైసిరీస్‌లో అనుభవాన్ని పొందాడు.



## ఐటిఎఫ్ ఉమెన్స్ వరల్డ్ టెన్నిస్..
# క్వార్టర్ ఫైనల్స్‌కు శ్రుతి

**న్యూఢిల్లీ:** ఐటిఎఫ్ ఉమెన్స్ వరల్డ్ టెన్నిస్ టూర్ 2025లో భారత్ ప్లేయర్ శ్రుతి అహ్లావత్ అద్భుతమైన ప్రదర్శనతో సోఫియాను ఓడించి క్వార్టర్ ఫైనల్స్‌కు చేరుకుంది. బలియావాస్‌లోని టెన్నిస్ ప్రాజెక్ట్‌లో శుక్రవారం జరిగిన మహిళల టెన్నిస్ టోర్నమెంట్ ప్రీక్వార్టర్ ఫైనల్స్‌లో 19 ఏళ్ల శ్రుతి అహ్లావత్ 6-2, 6-3 తేడాతో సోఫియా సుస్లోవాను ఓడించి తన సత్తాను నిరూపించింది. ఆమె రష్యన్ ప్రత్యర్థి మొదటి రౌండ్‌లో నాల్గవ సీడ్‌ను ఓడించింది. కానీ, శ్రుతి ఆమెకు టెన్నిస్ కోర్టులో ఆటను పొడిగించుకోవడానికి పెద్దగా అవకాశం ఇవ్వలేదు. అలాగే టాప్ సీడ్ జీల్ దేశాయ్ తన పోరాట పోటీకి, అన్నా సెడిషేవాను 4-6, 7-5, 7-6(2)తో ఉత్కంఠభరితమైన పోటీలో ఓడించింది. క్వాలిఫైయర్ సాహిరా సింగ్‌తో జరిగిన మ్యాచ్ తర్వాత, మొదటి సెట్‌ను కోల్పోయిన తర్వాత జీల్ తిరిగి పుంజుకోవడం ఇది వరుసగా రెండవ మ్యాచ్. ఇక ఆకాంక్ష నిట్టూర్ క్వార్టర్ ఫైనల్స్‌కు చేరిన మూడవ భారతీయురాలుగా నిలిచింది. క్వార్టర్ ఫైనల్స్‌లో నలుగురు భారత్ ప్లేయర్లలో మరొకరు పూజా ఇంగలే రెండు మ్యాచ్ పాయింట్లను కోల్పోయి మూడవ సెట్ టైబ్రేక్‌లో ఐదవ సీడ్ పావోలా లోపెజ్ చేతిలో ఓడిపోయింది. తొమ్మిదో ఆటలో ఆ రెండు మ్యాచ్ పాయింట్లలో నాలుగు ఘనమైన సర్వ్‌లను పావోలా సాధించింది. పూజా పదో ఆటలో సులభంగా సర్వీస్‌ను వదిలివేసింది. పావోలా అప్పటికే తన అత్యుత్తమ ప్రదర్శనను తిరిగి సాధించింది. టైబ్రేక్‌లో 6-1 ఆధిక్యాన్ని సంపాదించి అన్ని ఆశలను వమ్ము చేసింది. పూజా క్లైమాక్స్‌లో మెరిసింది,

# చైనా మాస్టర్స్‌లో.. సింధు ఘోర ఓటమి
## సెమీస్‌లో సాత్విక్-చిరాగ్ జోడీ



**న్యూఢిల్లీ:** చైనామాస్టర్స్ టోర్నమెంట్‌లో భారత్ స్టార్‌షట్లర్ పివి సింధు దారుణ ప్రదర్శనతో ఘోర పరాజయం పాలైంది. ఇదే సమయంలో సెమీస్‌లోకి రాంకిరెడ్డి సాత్విక్ సాయిరాజ్-చిరాగ్ శెట్టి అడుగుపెట్టారు. షెన్‌జెన్‌లో శుక్రవారంజరిగిన చైనామాస్టర్స్ మహిళల సింగిల్స్ క్వార్టర్ ఫైనల్స్‌లో వరుస గేమ్‌లతో ఓటమి పాలైన సింధు, ప్రపంచ నంబర్ వన్ అన్ సే యంగ్‌పై దారుణమైన పరుగును కొనసాగించింది. రెండుసార్లు ఒలింపిక్ పతకి విజేత అయిన సింధు పారిస్ క్రీడల్లో స్వర్ణం సాధించిన 23 ఏళ్ల కొరియా అన్ సేపై 38 నిమిషాల్లో 14-21, 13-21 తేడాతో ఓడిపోయింది. సింధు పేలవంగా ప్రారంభించి 1-6తో వెనుకబడి, సున్నితమైన క్రాస్‌కోర్ట్ డ్రాప్‌తో దానిని 5-9కి తగ్గించింది. అయితే, ఆన్ 11-5 ఆధిక్యాన్ని తెచ్చుకోగా, సింధు 11-14తో ముగించగలిగింది. రెండవ గేమ్‌లో సింధు 3-2తో ఆధిక్యంలో ఉన్నా కొరియా తిరిగి నియంత్రణ సాధించింది. సింధు అటాకింగ్ ప్లేతో ప్రయత్నించి 7-8తో వెనుకబడింది. ఇక పురుషుల డబుల్స్‌లో భారత జంట రాంకిరెడ్డి సాత్విక్ సాయిరాజ్-చిరాగ్ శెట్టి చైనా ద్వయం రెన్ జియా యు-జీ హావోనన్‌లను వరుస గేమ్‌లలో ఓడించి సెమీఫైనల్‌లోకి ప్రవేశించారు. కొన్ని రోజుల క్రితం, రాంకిరెడ్డి-శెట్టి హాంకాంగ్ ఓపెన్‌లో ఈ ఏడాది మొదటి ఫైనల్స్‌లో 61 నిమిషాల పాటు జరిగిన ఉత్కంఠభరితమైన పోరులో చైనా ఒలింపిక్ రజత పతక విజేతలు లియాంగ్ వీ కెంగ్-వాంగ్ చాంగ్ చేతిలో ఓడిపోయారు.




## వరల్డ్ అథ్లెటిక్స్ ఛాంపియన్‌షిప్స్..
# గుల్వీర్, అన్ను ఓటమి

**న్యూఢిల్లీ:** ప్రపంచ అథ్లెటిక్స్ ఛాంపియన్‌షిప్స్-2025లో గుల్వీర్ సింగ్ ఫైనల్‌కు తృటిలో దూరం కాగా, అన్ను జావెలిన్ త్రో ఫైనల్‌కు చేరుకోలేకపోయింది. టోక్యోలో +శుక్రవారం జరిగిన ప్రపంచ అథ్లెటిక్స్ ఛాంపియన్‌షిప్‌లో భారత లాంగ్ డిస్‌టెన్స్ రన్నర్ గుల్వీర్ పురుషుల 5000 మీటర్ల ఫైనల్‌కు అర్హత సాధించలేకపోయాడు. అతను తన హీట్స్‌లో 13:42.34 సమయంతో తొమ్మిదో స్థానంలో నిలిచాడు. ఈ ఈవెంట్‌లో అతను 12:59.77 సమయంతో జాతీయ రికార్డును కలిగి ఉన్నాడు. నార్వేకు చెందిన జాకబ్ ఇంగెబ్రిగ్ట్‌సెన్ కంటే వెనుకబడి ఉన్నాడు, అతని చివరి వేగం 13:42.15 సమయంతో ఫైనల్‌కు చేరుకున్నాడు. రెండు హీట్స్‌ల నుండి టాప్ ఎనిమిది మంది రన్నర్లు మాత్రమే ఫైనల్‌కు చేరుకున్నారు. అలాగే మహిళల జావెలిన్ త్రోలో అన్ను రాణి నిరాశపరిచే ప్రదర్శనతో వరల్డ్స్ నుంచి నిష్క్రమించింది. ఆమె అత్యుత్తమ 55.18 మీటర్ల త్రో ఫైనల్‌కు చేరుకోవడానికి అర్హత మార్కు అయితే 62.50 మీటర్ల కంటే చాలా దూరంలో ఉంది. ఇది ఆమె వ్యక్తిగత బెస్ట్ 63.82 మీటర్లు జాతీయ రికార్డు కంటే కొంత దూరంలో ఉంది.

## మొదటి అనధికారిక టెస్ట్
# డ్రాగా ఇండియా, ఆస్ట్రేలియా మ్యాచ్




**న్యూఢిల్లీ:** ఇండియా, ఆస్ట్రేలియా జట్ల మధ్య మొదటి అనధికారిక టెస్ట్ డ్రాగా ముగిసింది. లక్నోలో దులీప్ ట్రోఫీ 2025 మొదటి సెమీఫైనల్ చివరి రోజు శుక్రవారం జరిగిన క్రికెట్ మ్యాచ్‌లో ఫలితం తేలే అవకాశం లేకపోవడంతో నిర్దేశిత సమయం కంటే ముందుగానే మ్యాచ్‌ను ముగించారు. ఈ మ్యాచ్‌లో టాస్‌గెలిచి తొలుత బ్యాటింగ్ చేసిన ఆస్ట్రేలియా 6 వికెట్లు నష్టానికి 532 పరుగులు చేసి ఇన్నింగ్స్ డిక్లేర్ చేసింది. ఓపెనర్ సామ్ కొన్‌స్టాస్ 109, వికెట్ కీపర్ జోష్ ఫిలిప్ 123 నాటౌట్ సెంచరీలతో కదం తొక్కగా, క్యాంప్‌బెల్ కెల్లావే 88, కూపర్ కన్నోల్లీ 70, లియమ్ స్కాట్ 91తో ఔటయ్యారు. భారత్ బౌలర్లలో హర్ష్ దూబే 3, గుర్నూర్ బ్రార్ 2, ఖలీల్ అహ్మద్ ఒక వికెట్ తీశారు. తదుపరి బరిలోకి దిగిన భారత్ ఆసిస్‌కు ధీటుగా జవాబిచ్చింది. ఆసిస్ తొలి ఇన్నింగ్స్ స్కోరుకు ఒక్క పరుగు ముందుగానే ఇన్నింగ్స్‌ను డిక్లేర్ చేసింది. భారత్ తొలి ఇన్నింగ్స్‌లో 7 వికెట్లు కోల్పోయి 531 పరుగులు చేసింది. ధృవ్ జురెల్ (197 బంతుల్లో 140, 13 ఫోర్లు, 4 సిక్సర్లు), దేవదత్ పడిక్కల్ (281 బంతుల్లో 150, 14 ఫోర్లు, ఒక సిక్స్) అద్భుత శతకాలతో కదం తొక్కగా, సాయి సుదర్శన్ (73), జగదీసన్ (64) అర్ధ సెంచరీలతో రాణించారు. భారత్ ఇన్నింగ్స్‌లో కెప్టెన్ శ్రేయస్ అయ్యర్ (8) ఒక్కడే విఫలమయ్యాడు. ఒక్క పరుగు లీడ్‌తో రెండో ఇన్నింగ్స్ ప్రారంభించిన ఆస్ట్రేలియా 16 ఓవర్లలో వికెట్ నష్టపోకుండా 56 పరుగులు చేసింది. సామ్ కొన్‌స్టాస్ 27, క్యాంప్‌బెల్‌కెల్లావే 24 పరుగులతో అజేయంగా ఉన్నారు. ఈ దశలో మ్యాచ్‌ను డ్రాగా ప్రకటించారు. కాగా ఇరు జట్ల మధ్య రెండో టెస్ట్ ఈ నెల 23-26 మధ్య జరగనుంది.

# మూడు రోజుల లాభాలకు బ్రేక్

## నష్టాల్లోనే ముగిసిన సెన్సెక్స్ నిఫ్టీ
## అదానికి మాత్రం సెబీ ఉత్తర్వుల జోష్
## ఒక్కరోజులోనే రూ. 40 వేల కోట్లు వృద్ధి

**న్యూఢిల్లీ, సెప్టెంబరు 19:** దేశీయ ఈక్విటీ మార్కెట్లు మూడురోజుల లాభాలకు బ్రేక్ పడింది. సెన్సెక్స్,నిఫ్టీ దిగువస్థాయిలోనే ముగిసాయి. హెచ్‌సిఎల్‌టెక్, ఐసిఐసిఐ బ్యాంకు, ట్రెంట్ సంస్థలు లాభాల స్వీకరణకే మొగ్గుచూపించాయి. అలాగే ఆదాని పోర్టులు, స్టేట్‌బ్యాంక్ ఆఫ్ ఇండియా వంటివి ఎగువ ప్రాంతంలో ముగిసాయి. సెన్సెక్స్ 387.73 పాయింట్లు క్షీణించి 82,626.23 పాయింట్లవద్ద ట్రేడింగ్ నిలిపివేసింది. నిఫ్టీ సూచీ 96.55 పాయింట్లు క్షీణించి 25,327.05 పాయింట్లవద్ద స్థిరపడింది. హెచ్‌డిఎఫ్‌సిబ్యాంకు, ఐసిఐసిఐబ్యాంకు, రిలయన్స్ ఇండస్ట్రీస్, కోటక్ మహీంద్ర బ్యాంకు, ఎంఅండ్ఎం సంస్థలు సెన్సెక్స్‌క్షీణతకు మూల కారణంగా నిఇచాయి. ఆదానిగ్రూప్ స్టాక్స్ ఒక్కసారిగాపెరిగాయి. హిండెన్‌బర్గ్ ఆరోపణలు నిరాధారమని సెబీ కొట్టివేయడంతో షేర్లు ఒక్కసారిగా పుంజుకున్నాయి. ఒకటిశాతం నుంచి 13శాతానికి పెరిగినట్లు తేలింది. ఒక్కరోజులోనే 40 వేల కోట్లవరకూ ఆదానికి మార్కెట్లలో లాభంచేకూరింది. వివిధ సూచీలపరంగాచూస్తే బ్యాంకింగ్‌సూచీ 0.46శాతం క్షీణించింది. ఎఫ్ఎంసిజి సూచీ కూడా 0.39శాతం నష్టపోయింది. సెన్సెక్స్‌లో ఎటర్నల్, మారుతి సుజుకి 52 వారాల గరిష్టానికి చేరాయి. మారుతి 339.90, 16,016వద్ద నడిచాయి. మొత్తం 4316 స్టాక్స్‌లో బిఎస్ఇలో 2140 లాభాల్లో ముగిస్తే 1997 షేర్లు క్షీణించాయి. మరో 179 కంపెనీలషేర్లు స్థిరంగా నిలిచాయి. నిఫ్టీలో పిఎస్‌యుబ్యాంకు, రియాల్టీ,ఫార్మా షేర్లు ముందుకు కదిలాయి. వినియోగరంగ వస్తువులు,ప్రైవేటు బ్యాంకు, ఆర్థికరంగ సేవలు క్షీణించాయి. బిఎస్ఇలో మిడ్‌క్యాప్‌సూచీ 0.09శాతంక్షీణిస్తే స్మాల్‌క్యాప్‌సూచీ 0.16శాతం పెరిగింది. సూచీల్లో ఎల్‌అండ్‌టి 0.54శాతం, కేన్స్ టెక్నాలజీ ఇండియా 0.93శాతం, జాన్‌కాకరిల్ ఇండియా 5.09శాతం, జేకే ఎంటర్‌ప్రైజెస్ 5.45శాతం, టెక్స్‌మాకో రైల్ ఇంజినీరింగ్ 0.89శాతం, రైట్స్ 0.79శాతం కొంతమేర సూచీలు స్థిరత్వానికి దోహదంచేసాయి. రైట్స్ తమకు 78.65 కోట్ల ప్రాజెక్టు వర్కుఎన్టీపీసీనుంచి వచ్చిందని ప్రకటించడంతోనే సూచీల్లో లాభాలు జోరందుకున్నాయి. ఇక యూరోపియన్‌స్టాక్స్ శుక్రవారం లాభాల్లోనే ముగిసాయి. ఆసియా మార్కెట్లలో మిశ్రమంగా కనిపించింది. బ్యాంక్ ఆఫ్ ఝపాన్ తన పాలసీ విధానాలను 0.5శాతంవద్దనే స్థిరంగాకొనసాగించింది. ఇక అమెరికా మార్కెట్లపరంగా ఎస్అండ్‌పి 500 0.48శాతం పెరిగింది. నాస్‌డాక్ కాంపోజిట్‌కూడా 0.94శాతం, వద్ద స్థిరపడితే డౌజోన్స్ పారిశ్రామిక సగటు 124 పాయింట్లు జోడించి 0.27శాతం లాభపడింది.



# ఇ-కామర్స్ ప్లాట్‌ఫామ్‌పైకి రాయల్ ఎన్‌ఫీల్డ్!



**న్యూఢిల్లీ, సెప్టెంబరు 19:** రాయల్‌ఎన్‌ఫీల్డ్ బైకులు ఇకపై ఆన్‌లైన్‌లో ఈకామర్స్ సంస్థలనుంచి కొనుగోలుచేసుకోవచ్చు. ఇందుకు సంబంధించి బుల్లెట్ యాజమాన్యం ఫ్లిప్‌కార్ట్‌తో ఒప్పందంచేసుకుంది. సంస్థపరంగా బిగ్ బిలియన్ డేస్ సమీపిస్తున్న సందర్భంగా ఐషర్‌మోటార్స్ తన నిర్ణయాన్ని ప్రకటించింది. స్టాక్ ఎక్ఛేంజిలకు కూడా సమాచారం ఇచ్చింది. 350సిసి మోడల్ రేంజి అన్ని మోడళ్లు కూడా ఫ్లిప్‌కార్ట్‌పై ఈనెల 22వ తేదీనుంచి అందుబాటులోకి వస్తాయి. బిగ్ బిలియన్ డేస్ సందర్భంగా బుల్లెట్‌తో ఒప్పందం వల్ల బైక్‌ల విక్రయాలు భారీగా పెరుగుతాయని అంచనావేస్తోంది. బుల్లెట్‌తోపాటు ఇపుడు ఐఫోన్ 16 సిరీస్ కూడా ఫ్లిప్‌కార్ట్‌లో ప్రైస్‌కట్ డీల్స్‌తో వస్తున్న సంగతి తెలిసిందే. బుల్లెట్ 350, క్లాసిక్350, హంటర్ 350, గోవన్‌క్లాసిక్ 350, న్యూ మెటార్ 350 వంటివి ఇపుడు ఫ్లిప్‌కార్ట్‌లో అందుబాటులో ఉంటాయి. బెంగళూరు, గురుగ్రామ్, కోల్‌కత్తా, లక్నో, ముంబయిలలోని కస్టమర్లు ఆర్డర్లు ప్లేస్‌చేసుకోవచ్చు. ప్రస్తుతం ఐదు నగరాలకే పరిమితంచేసినా భవిష్యత్తులో మరిన్ని నగరాలకు విస్తరిస్తామని ఎన్‌ఫీల్డ్ కంపెనీ చెప్పింది.



# కస్టమర్లపై ఫీజులు, ఛార్జిలు తగ్గించుకోవాలి!
## వాణిజ్య బ్యాంకులకు ఆర్బీఐ సూచన

**న్యూఢిల్లీ,సెప్టెంబరు 19:** ఎంపికచేసిన వినియోగరంగ ఉత్పత్తుల కొనుగోలుచేసే కస్టమర్లపై బ్యాంకులు ఫీజులు తగ్గించాలని ఆర్బీఐ సూచించింది. సర్వీసు ఛార్జిలను తగ్గించాలని డెబిట్‌కార్డులు, లేటు చెల్లింపులు, కనీసనిల్వ ఉల్లంఘనలు వంటివాటిపై విధించే ఛార్జిలు తగ్గించుకోవాలనిసూచించింది. ప్రస్తుతం బ్యాంకులు అన్నీ కూడా రిటైల్ లెండింగ్‌పైనే దృష్టిపెట్టాయి. కార్పొరేట్ రుణాల్లో నష్టాలు ఎదురవుతున్నాయి. రికవరీపరంగా కూడా నామమాత్రంగానే ఉంది. అయితే వ్యక్తిగత రుణాలు, కార్‌ఫైనాన్సింగ్, చిన్న బిజినెస్ రుణాలు వంటివి రిటైల్‌బ్యాంకింగ్‌లో లాభాలను సూచిస్తున్నాయి. సెంట్రల్ బ్యాంకు ప్రత్యేకించి తక్కువ ఆదాయవనరులున్న కస్టమర్లపై ఎక్కువ ఛార్జిలు విధించకూడదని సూచించింది. అయితే నిర్దిష్టమైన ఛార్జిలంటూ ఆర్బీఐ సూచించలేదు. బ్యాంకుల విచక్షణకేవదిలివేసింది. సర్‌ఛార్జిలపై ఎలాంటి అధికారిక పరిమితులు లేవు. ప్రాజెసింగ్ ఫీజులు మానరతం చిన్న బిజినెస్ రుణాలకు 0.5శాతంనుంచి 2.5శాతంవరకూ ఉన్నాయి. కొన్ని బ్యాంకులు గృహరుణాలు ఫీజులు 25వేల రూపాయలుగా నిర్ణయించాయి. బ్యాంకు ఫీజులు ఆదాయం ఈ ఆర్థికసంవత్సరంలో రికవరీ అవుతోంది.

# జెఎస్‌డబ్ల్యు ఎనర్జీకి టిడాంగ్ వ్యాలీ విద్యుత్‌ప్రాజెక్టు



**ముంబయి, సెప్టెంబరు 19:** పారిశ్రామికవేత్త సజ్జన్‌జిందాల్ నేతృత్వంలోని జెఎస్‌డబ్ల్యు ఎనర్జీ హిమాచల్‌ప్రదేశ్‌లోని 150 మెగావాట్ల హైడ్రో ఎలక్ట్రిక్ ప్రాజెక్టును సాధించింది. 1728 కోట్ల ఈ ప్రాజెక్టులో నార్వే స్టాట్‌క్రాఫ్ట్‌ఐహెచ్ హోల్డింగ్ సంస్థకు వాటా ఉంది. హిమాచల్‌లోని టిడాంగ్ పవర్ జనరేషన్ ప్రాజెక్టును జెఎస్‌డబ్ల్యు చేపట్టనున్నది. జెఎస్‌డబ్ల్యు నియోఎనర్జీ ఈ ప్రాజెక్టులో 100శాతం టిడాంగ్ పవర్ ప్రాజెక్టులో హక్కులు సాధించింది. కిన్నౌర్ జిల్లాలోని టిడాంగ్ లోయలో ఈప్రాజెక్టు నిర్మిస్తారు. 2026 అక్టోబరునుంచి ఈ ప్రాజెక్టు పనులుప్రారంభిస్తారు. 22 ఏళ్లపాటు యుపి పవర్ కార్పొరేషన్‌కు పీక్ సమ్మర్‌లో 75 మెగావాట్ల విద్యుత్‌సరఫరాకు ఒప్పందం జరిగింది. కిలోవాట్‌కు 5.57 రూపాయల వంతున సరఫరాచేస్తారు. మిగిలిన 75 మెగావాట్లు ఓపెన్ మార్కెట్‌లో జెఎస్‌డబ్ల్యు విక్రయిస్తుంది. జెఎస్‌డబ్ల్యు ఎనర్జీ మొత్తం హైడ్రో పోర్టుఫోలియలో 1.8 గిగావాట్లు సామర్థ్యంతో ఉన్నాయి. కంపెనీ ప్రస్తుతం 13.1 గిగావాట్ల నిర్వహణ సామర్థ్యంతో ఉంది. 12.8 గిగావాట్లు ప్రాజెక్టులునిర్మాణంలో ఉన్నాయి. 29.4 గిగావాట్ల ఇంధనాన్ని నిల్వచేసే సామర్థ్యం కూడా ఉంది. 2030 నాటికి జెఎస్‌డబ్ల్యు ఎనర్జీ 40 గిగావాట్ల సామర్థ్యానికి వెళ్లనున్నట్లు ప్రకటించింది. 2050 నాటికి 70శాం కెపాసిటీని పునరుత్పత్తి విభాగంనుంచే తీసుకుంటున్నది. ఈ లావాదేవీలు మొత్తం క్యాష్ రూపంలోనే జరుగుతాయి.వచ్చే ఏడాది జనవరి 15తో మొత్తంపూర్తవుతుంది. జెఎస్‌డబ్ల్యు ఎనర్జీ కంపెనీ షేర్లు 1.4 శాతంపెరిగి 545 వద్దముగిసాయి.

# ఐఫోన్ మ్యాక్స్‌ప్రోకు భారీ డిమాండ్
## మెట్రోనగరాల స్టోర్లవద్ద కస్టమర్ల క్యూలు



**ముంబయి, సెప్టెంబరు 19:** భారత మార్కెట్‌లో యాపిల్ ఐఫోన్ 17 సిరీస్ అమ్మకాలు ప్రారంభమయ్యాయి. విడుదల ముందు నుంచే ఈ సిరీస్‌పై భారీ అంచనాలు నెలకొనగా, ప్రీబుకింగ్స్‌లో ఇది ఐఫోన్ 16 రికార్డులను బద్దలు కొట్టింది. రాబోయే పండుగ సీజన్‌లో యాపిల్ అమ్మకాలు భారీగా పెరుగుతాయన్న అంచనాలున్నాయి. ఈ ఏడాది యాపిల్ మొత్తం అమ్మకాల్లో ఐఫోన్ 17 సిరీస్ వాటా 15 నుంచి 20 శాతం వరకు ఉండొచ్చని భావిస్తున్నారు. ఈ ఏడాది జులై, సెప్టెంబర్ త్రైమాసికంలో ఐఫోన్ల షిప్‌మెంట్లు 5 మిలియన్ యూనిట్లను దాటుతాయని అంచనా. గతేడాది ఇదే సమయంలో ఇది 4 మిలియన్లుగా ఉంది. ఈసారి ఐఫోన్ 17 ప్రో, ప్రో మ్యాక్స్ మోడళ్లకు విపరీతమైన డిమాండ్ కనిపిస్తోంది. అయితే, వాటి సరఫరా చాలా పరిమితంగా ఉండటంతో కొరత ఏర్పడే అవకాశం ఉందని రిటైలర్లు చెబుతున్నారు. సాధారణ డెలివరీలలో కేవలం 10 శాతం మాత్రమే ప్రో మోడళ్లు వస్తున్నాయని, దీంతో బ్లాక్ మార్కెట్‌లో వీటిని 10 నుంచి 20 శాతం అధిక ధరకు అమ్ముతున్నారని తెలుస్తోంది.
మరోవైపు, బేస్ మోడల్‌ను ఈసారి 256 స్టోరేజ్‌తో విడుదల చేయడం వినియోగదారులను ఆకట్టుకుంటోంది. దీంతో బేస్ మోడల్ ప్రీఆర్డర్లు కూడా గణనీయంగా పెరిగాయి. ముఖ్యంగా కాస్మిక్ ఆరెంజ్‌రంగుకు ఎక్కువ ఆదరణ లభిస్తోంది. ఐఫోన్ 17 (256జిబి): రూ. 82,900, ఐఫోన్ ఎయిర్: రూ. 1,19,900, ఐఫోన్ 17 ప్రో (256జిబి): రూ. 1,34,900, ఐఫోన్ 17 ప్రో మ్యాక్స్ (256జిబి)రూ. 1,49,900 లుగా కంపెనీ ప్రకటించింది.

# సిబిఐ దర్యాప్తుప్రభావం మాసంస్థపై ఉండదు

## రిలయన్స్ ఇన్‌ఫ్రా వెల్లడి



**ముంబయి, సెప్టెంబరు 19:** పారిశ్రామికవేత్త అనిల్ అంబానికి చెందిన రిలయన్స్ కమర్షియల్‌ఫైనాన్స్, రిలయన్స్ హోం ఫైనాన్స్ సంస్థలపై జరుపుతున్న సిబిఐ దర్యాప్తువల్ల తమ సంస్థకేమీ ఇబ్బందిలేదని రిలయన్స్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ స్పష్టం చేసింది. మా బిజినెస్ కార్యకలాపాలు, ఆర్థిక పనితీరు, వాటాదారులు, ఉద్యోగులు ఇతర వాటాదారులకు ఎలాంటి ఇబ్బందులు లేవని రిలయన్స్ ఇన్‌ఫ్రా పేర్కొంది. ఇటీవలే సిబిఐ ఆర్‌సిఎఫ్ఎల్, ఆర్‌హెచ్‌ఎఫ్ఎల్ సంస్థలపై దర్యాప్తుచేపట్టిన సంగతి తెలిసిందే. అనిల్ అంబానిగ్రూప్ కంపెనీలు ఆర్‌సి ఎఫ్ఎల్, ఆర్‌హెచ్‌ఎఫ్‌ల్, ఎస్‌బ్యాంకు, బ్యాంకు మాజీ ఛైర్మన్ రాణాకపూర్ కుటుంబాల మధ్య అక్రమ లావాదేవీలు నడిచినట్లు సిబిఐ తన ఛార్జిషీటును దాఖలు చేసింది. 2796 కోట్లమేర బ్యాంకుకు నష్టం వాటిల్లిందని సిబిఐ తన ఛార్జిషీటులో వివరించింది. ఎస్‌బ్యాంకు ఆర్‌సి ఎఫ్ఎల్, ఆర్‌హెచ్‌ఎఫ్ఎల్ డెట్ సెక్యూరిటీల్లో ఐదువేల కోట్లు పెట్టుబడులుపెట్టిందని, రేటింగ్ ఏజెన్సీలు ప్రతికూల రేటింగ్ ఇచ్చినా అంబాని కంపెనీల్లోపెట్టుబడులుపెట్టిందని సిబిఐ వెల్లడించింది.

Printed and Published by GireeshSanghi, CMD and Managing Editor on behalf of AGA Publications Ltd., at D.No. 396, Lower Tankbund, Hyderabad - 500 080 Phone : 2764 4999. Fax: 040-27642512, RNI No. 62142/95, Editor : *DamerlaSai Baba, *responsible for selection of news under the PRB Act. Regd.: No.HSD/337/21-22 Air Surcharge: Delhi : 40 Ps. Reproduction in whole or in part without written permission of the publisher is prohibited.